సాక్షి 24|7

భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం 21-8-2017

- ఏజెన్సీలో 'అత్యవసర' సేవలకు కటకట
- వాగులు, వంకలు పొంగితే ఇక అంతే..
- ఆటోలు, అంబులెన్సులే డెలివరీ 'కేంద్రాలు'
- రోడ్డు, రవాణా మార్గాలు లేక 'జెట్టి'నే దిక్కు

ప్రసవానికి పాట్లు



గుండాల మండలంలో బాలింతను వాగు దాటిస్తున్న బంధువులు (ఫైల్), (ఇన్‌సెట్) ఆటోలో ప్రసవించిన మహిళను వాగు దాటిస్తున్న దృశ్యం

సాక్షి, కొత్తగూడెం:

ఏజెన్సీలోని అనేక గ్రామాలకు సరైన రవాణా సౌకర్యాలు లేక, వర్షం వస్తే పొంగే వాగులు, వంకలు దాటలేక రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో ఆటోలు, అంబులెన్సులే 'ప్రసవ కేంద్రాలు'గా మారుతున్నాయి. ఇక జబ్బు చేస్తే 'జెట్టీ'(ఇద్దరు మనుషులు మోసే కాడి)నే దిక్కవుతోంది. అనేక కిలోమీటర్లు కాలినడకన ప్రయాణిస్తూ ఆస్పత్రులకు చేరే సరికి 'నరకం' అనుభవిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో అత్యవసర సేవలను

మిగతా 2వ పేజీలో ▶

ఆశ్రమ పాఠశాలగా మారనున్న దుమ్ముగూడెం వసతి గృహం



సంక్షేమంలో సర్దుబాట్లు

జిల్లాలో కొత్తగా 18 ఆశ్రమాలు

- ఉపాధ్యాయుల నియామకంపై కసరత్తు
- విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలల కుదింపు
- జీపీఎస్‌ల నుంచి 93 మంది గుర్తింపు
- కన్వర్టడ్ ఆశ్రమాల్లో పనిచేసేందుకు ఆప్షన్లు
- విద్యా సంవత్సరంలో మధ్యలో గందరగోళం..

భద్రాచలం: గిరిజన సంక్షేమ విద్యాశాఖ పరిధిలో గల వసతి గృహాలన్నీ ఇక నుంచి ఆశ్రమ పాఠశాలలుగా మారనున్నాయి. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. యుద్ధప్రాతిపదికన పాఠశాలలను ప్రారంభించాలనే ఆదేశాల నేపథ్యంలో ఐటీడీఏ విద్యాశాఖ అధికారులు ఇందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18 వసతి గృహాలు ఇక నుంచి ఆశ్రమ పాఠశాలలుగా మారబోతున్నాయి. వీటిలో ఈ నెలాఖరు నాటికే బోధన సాగేలా కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతానికి 1 నుంచి 5వ తరగతి వరకు నిర్వహించాలనే

మిగతా 2వ పేజీలో ▶



ఈసారి.. బతుకమ్మ శారీ

- పూల పండగలో ఆడపడుచులకు చేనేత చీర బహుమానం
- 23 మండలాల్లో 3,25,159 మంది లబ్ధిదారుల ఎంపిక

కొత్తగూడెం: తెలంగాణ సంప్రదాయ పండగ 'బతుకమ్మ'సందర్భంగా ఆడపడుచులను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించనుంది. రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన మహిళలకు బతుకమ్మ పండగను పురస్కరించుకుని చేనేత చీరలను కానుకగా అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు సెప్టెంబర్ 20 నుంచి బతుకమ్మ పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 మండలాల్లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

తెలంగాణలో తొలిసారిగా 'చేనేత చీరలు'పంపిణీ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ మహిళలు ఎంతో అంగరంగ వైభవోపేతంగా, సందడిగా జరుపుకునే బతుకమ్మ పండగకు ప్రభుత్వం తొలిసారిగా చేనేత చీరలను పంపిణీ చేయబోతుంది. నూతనంగా ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాల్లో 3,25,159 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. జిల్లాలో పాల్వంచ మండలంలో అత్యధికంగా 31,769 మందిని గుర్తించగా, ఆ తర్వాత ఇల్లెందు మండలంలో 29,323 మహిళలను గుర్తించారు. అత్యల్పంగా ఆళ్లపల్లి మండలంలో 3,479 మంది లబ్ధిదారులు ఉన్నారు. జిల్లాలో ఉన్న తెల్ల రేషన్ కార్డుల్లో 18 సంవత్సరాలకు పైబడి కలిగి ఉన్న వారిని ప్రాతిపదికగా ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

మినీ FOCUS 8లో

రామా ఇదెక్కడి చోద్యం! -11లో

ప్రసాదాల ధర పెంచే ప్రయత్నం

భద్రాద్రి కొత్తగూడెం | సోమవారం | ఆగస్టు | 21 | 2017 సాక్షి

ప్రసవానికి పాట్లు



జెట్టి ద్వారా వైద్యశాలకు తరలిస్తున్న గిరిజనులు (ఫైల్)

▶మొదటి పేజీ తరువాయి

అందిస్తున్నామని ప్రభుత్వం, అధికారులు చెబుతున్న మాటలు నీటిమూటలే అవుతున్నాయి.

వాగులు పొంగితే అష్టకష్టాలే..

జిల్లాలో భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగితే కొన్ని గ్రామాలకు రవాణా సౌకర్యాలు, వైద్య సేవలు నిలిచిపోయినట్టే. దీంతో ఏజెన్సీలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చర్ల, దుమ్ముగూడెం, గుండాల, ఆళ్లపల్లి, అశ్వారావుపేట మండలాల్లో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంది. చర్ల మండలంలోని పున్నపల్లి, ఎర్రబోరు, బోదనెల్ల, కొరకటపాడు, రామచంద్రుని కుంట వైపు రెండు వాగులు పొంగితే రాకపోకలు నిలిచిపోతాయి. మరో వైపు బక్కినపల్లి, ఎర్రపాడు వైపు మరో వాగు పొంగుతుంది. కాగా ఈ మండలంలో కొన్ని గ్రామాలకు రోడ్డు నిర్మించినప్పటికీ కల్వర్టులు, మినీ బ్రిడ్జీలను లేక 'అత్యవసర తిప్పలు' తప్పడం లేదు. సాధారణ సమయాల్లోనూ వీరు ప్రభుత్వ ఆస్పత్రులకు రావాలన్నా సుమారు 12 నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి వాగు పొంగితే కే లక్ష్మీపురం, గౌరారం, చిన్నమడుగు, లింగాపురం, బురదమడుగు, తోగ్గూడెం, సజ్జనాపురం గ్రామాలకు దుమ్ముగూడెంతో సంబంధాలు కట్ అవుతాయి. అశ్వారావుపేట మండలం కావడిగుండ్ల, కొండతోగు, మల్లాయిగూడెం, చంద్రుగొండ మండలం బెండాలపాడు, మద్రిగూడెం గ్రామాలకు వైద్య, ఇతర సేవలు అందవు. గుండాల మండలంలో మల్లన్న వాగుతో దేవళ్లగూడెం, రోళ్లగడ్డ, నర్సాపురం, కన్నాయిగూడెం గ్రామాలు, కిన్నెరసాని వాగుతో నాగారం, పాలగూడెం, నడిమిగూడెం, దొంగతోగు గ్రామాలు, సాయనపల్లి పంచాయితీలో ఏడుమెళికల వాగుతో సాయనపల్లి, గణాపురం, దామరతోగు, ఎలగలగడ్డ, చిన్న వెంకటాపురం, కొమ్ముగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. చెట్టుపల్లి పంచాయితీలో 8 గ్రామాల పరిస్థితీ ఇంతే. మొత్తంగా గుండాల మండలంలో 27 గ్రామాలకు, ఆళ్లపల్లి మండలంలో 17 గ్రామాలకు వైద్య, అత్యసవర సేవలు అందవు.

ఆటోలు, అంబులెన్సులే ప్రసవ 'కేంద్రాలు'..

భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగితే గిరిజనుల బాధలు వర్ణణాతీతం. 108, అంబులెన్సులకు సమాచారం అందజేసినా సరైన రోడ్లు లేక..పొంగిన వాగులుదాటలేక.. అవి గ్రామాలకు వచ్చే పరిస్థితి ఉండదు. దీంతో రోగాల బారిన పడిన గిరిజనులు, గర్భిణులు 'నరకం' అనుభవిస్తున్నారు. ప్రమాదకరంగా పొంగుతున్న వాగుల నుంచి జెట్టీల ద్వారా దాటించే సాహసం చేయాల్సి వస్తోంది. ఇలాంటి సమయాల్లో ఆటోలు, అంబులెన్సులే గర్భిణులకు 'ప్రసవ కేంద్రాలు'గా మారుతున్నాయి.

- ఆదివారం చర్ల మండలంలోని చింతకుప్ప వాగు పొంగటంతో కుర్నపల్లి గ్రామానికి చెందిన రమ్య అనే గర్భిణిని ఆటోలో తరలిస్తుండగా అందులోనే ప్రసవించింది. అనంతరం వాగు దాటించి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్య సేవలు అందించారు.
- ఇటీవల చర్ల మండలం ఎర్రంపాడు గ్రామానికి చెందిన మడకం బింద అనే గిరిజన మహిళకు నెలలు నిండాయి. ఎర్రంపాడు గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక అక్కడి వరకు 108 వాహనం వెళ్లలేకపోయింది. దీంతో జెట్టి కట్టి ఆమెను 108 వాహనం వద్దకు తీసుకురాగా 108లోనే ఆమెకు వైద్యం అందజేశారు.
- గత శుక్రవారం గుండాల మండలం కొడవటంచ గ్రామానికి చెందిన ఈసం రాజకుమారిని 102అమ్మఒడి వాహనంలో నిండు వాగుపై గుండాల పీహెచ్‌సీ నుంచి స్వగ్రామానికి తరలించారు.
- గత కొద్ది నెలల క్రితం గుండాల మండలం రోళ్లగడ్డ గ్రామానికి చెందిన బాలింతను మల్లన్న వాగు పొంగి పొర్లుతుండగా స్ట్రెచర్‌పై చింటికి తరలించారు. ఇలాంటి ఘటనలు మరెన్నో..

అత్యసవర సేవలు అందని ద్రాక్షేనా..

ఏజెన్సీలో గిరిజనులకు అత్యసవర సేవలు అందని ద్రాక్షగానే మిగిలాయి. ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ పథకాలతో పాటు వైద్యశాఖ ద్వారా పలు ఆరోగ్య పథకాలను ప్రవేశపెట్టినా అవి గిరిజనుల చెంతకు చేరడం లేదు. పలు వాగులపై కల్వర్టులు, బ్రిడ్జీలు లేక కొన్ని సందర్భాల్లో గిరిజనులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో ఏజెన్సీలో గిరిజనులకు ప్రతి యేటా ఈ సమస్లు ఎదురవుతున్నా.. అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. వర్షాకాలాన్ని 'ఎమర్జెన్సీ'గా గుర్తించి ముందస్తుగానే తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఈసారి.. బతుకమ్మ శారీ

▶మొదటి పేజీ తరువాయి

ఈ జాబితాను తయారు చేసింది. రాష్ట్రంలో ఉన్న మహిళల అందరికీ ప్రభుత్వమే చేనేత కార్మికులకు చేయూతను ఇచ్చే విధంగా ఆ శాఖ వద్దనే నేరుగా కొనుగోలు చేసి జిల్లాల వారీగా సరఫరా చేయనుంది. జిల్లాలో ఉన్న గోదాముల్లోకి వీటిని సరఫరా చేసి అక్కడ నుంచి మండల కేంద్రాలకు తరలించి అక్కడ నుంచి పంపిణీ చేయనున్నారు. జిల్లా కేంద్రంలో నాబార్డ్‌కు చెందిన గోదాంను అధికారులు ఎంపిక చేశారు. ఈ చీరలను పండగకు వారం రోజుల ముందుగా పంపిణీ చేసేలా అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

చీరల పంపిణీ సంతోషం



బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించటం సంతోషదాయకం. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రభుత్వం మరింత విలువను పెంచింది. ఈ పండుగను గతంలో కంటే ఇంకా చాలా సంతోషంగా జరుపుకుంటాం.

–మారేపల్లి రాములమ్మ, సీతంపేట గ్రామం, సుజాతనగర్

మండలాల వారీగా చీరల లబ్ధిదారులు ఇలా...

1. ఆళ్లపల్లి	3,479
2. అన్నపురెడ్డిపల్లి	6,406
3. అశ్వాపురం	12,469
4. అశ్వారావుపేట	18,695
5. భద్రాచలం	12,298
6. బూర్గంపాడు	18,559
7. చంద్రుగొండ	9,227
8. చర్ల	14,667
9. చుంచుపల్లి	11,148
10. దమ్మపేట	17,882
11. దుమ్ముగూడెం	15,196
12. గుండాల	4,984
13. జూలురుపాడు	11,013
14. కరకగూడెం	5,296
15. కొత్తగూడెం	22,414
16. లక్ష్మీదేవిపల్లి	11,993
17. మణుగూరు	19,328
18. ములకలపల్లి	12,124
19. పాల్వంచ	31,769
20. పినపాక	10,962
21. సుజాతనగర్	9,362
22. టేకులపల్లి	16,555
23. ఇల్లెందు	29,323
మొత్తం	3,25,159

లబ్ధిదారుల జాబితా సిద్ధం



జిల్లాలో తెల్ల రేషన్ కార్డు కలిగి, 18 సంవత్సరాలకు పైబడిన మహిళల జాబితాను ఇప్పటికే సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి బతుకమ్మ చీరలు సరఫరా కాగానే జిల్లా కేంద్రంలో గౌదాంలో భద్రపర్చి పండగకు ముందు వాటిని పంపిణీ చేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

–ఎస్ కిరణ్‌కుమార్, డీఆర్వో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

'సంక్షేమం'లో సర్దుబాట్లు

▶మొదటి పేజీ తరువాయి

ఆదేశాల నేపథ్యంలో ఇక్కడి విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయుల నియామకంపై దృష్టి సారించారు. జిల్లాలో ప్రస్తుతం 46 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వాటి ప్రాంగణంలోనే అనుబంధంగా వసతి గృహాలు కూడా ఉన్నాయి. కానీ ప్రత్యేకంగా హాస్టళ్లు ఉన్నచోట మాత్రం విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. దీని వల్ల విద్యార్థులపై సరైన పర్యవేక్షణ లేక చదువుల్లో వెనుకబడుతున్నారు. పదో తరగతి పలితాల్లో ఈ రెండింటికీ తీవ్రమైన వ్యత్యాసం కనిపించింది. వసతి గృహాల్లో ఫలితాలు ఆశించిన స్థాయిలో రావటం లేదు. ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో ప్రత్యేక వసతి గృహాలు అంటూ లేకుండా, ఇక నుంచి అన్నీ ఆశ్రమ పాఠశాలలుగానే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వసతి గృహాలు దశల వారీగా ఆశ్రమ పాఠశాలలుగా మారనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 64 వసతి గృహాలు ఉండగా, ఇందులో ఖమ్మం జిల్లాకు 11 వెళ్లగా, మహబూబాబాద్‌లో 2, భూపాలపల్లి జిల్లాలో 5 కలిశాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 18 ఉన్నాయి.

జీపీఎస్‌ల నుంచి సర్దుబాటు..

కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆశ్రమపాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకంపై ఐటీడీఏ విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు గిరిజిన ప్రాథమిక పాఠశాలల్లో(జీపీఎస్) ఎక్కువగా (సర్‌ప్లస్) ఉన్న ఉపాధ్యాయులను కన్వర్టెడ్ ఆశ్రమాల్లో సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. జీవో నంబర్ 17 ప్రకారం 20 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడే ఉండాలి. 60 లోపు ఉంటే ముగ్గురు ఎస్‌జీటీలు, 120 మంది లోపు ఉంటే నలుగురు ఎస్‌జీటీలు, 1 ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఉండాలి. ఈ ప్రాతిపదికన జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలల్లో 93 మంది ఉపాధ్యాయులు అదనంగా(సర్‌ప్లస్) ఉన్నట్లుగా లెక్కతేలింది. వీరిని కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై పంపించనున్నారు. ఇందు కోసం ఉపాధ్యాయుల నుంచి ఆప్షన్‌లను తీసుకుంటున్నారు.

ఆశ్రమాలుగా మారనున్న వసతి గృహాలు ఇవే

బూర్గంపాడు	(బాలురు)
సత్యనారాయణ పురం	(చర్ల, బాలురు)
చర్ల	(బాలికలు)
దుమ్ముగూడెం	(బాలురు)
మణుగూరు	(బాలురు)
అన్నపరెడ్డిపల్లి	(బాలురు)
అశ్వారావుపేట	(బాలురు)
చంద్రుగొండ	(బాలికలు)
దమ్మపేట	(బాలురు)
రామవరం	(బాలురు)
కొత్తగూడెం	(బాలికలు)
ముల్కలపల్లి	(బాలురు)
పాల్వంచ	(బాలురు)
పాల్వంచ	(బాలికలు)
గుండాల	(బాలురు)
గుండాల	(బాలికలు)
ఇల్లెందు	(బాలురు)
ఇల్లెందు న్యూ	(బాలికలు)

అంతా గందరగోళం..

విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు అవుతోంది. ఈ తరుణంలో కొత్తగా పాఠశాలల ఏర్పాటు కొంత గందరగోళానాకి తావిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాగా ఉన్నప్పుడు ఐటీడీఏ పరిధిలో 13 వసతి గృహాలను కన్వర్టెడ్ ఆశ్రమపాఠశాలలుగా మార్చారు. ఆయా చోట్ల నేటికీ ఉపాధ్యాయులు, సిబ్బందిని భర్తీ చేయలేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలో డిప్యూటేషన్ ప్రాతిపదికపై నియాయకాలు చేస్తున్నారు. వీటికి ఇన్‌చార్జిగా ఉన్న హెచ్‌ఎంలు ఎటువంటి ఉత్తర్వులు లేకుండానే పనిచేయటం గమనార్హం. చాలా చోట్ల పూర్తి స్థాయిలో భవన సౌకర్యాలు లేవు. ఇటువంటి అనుభవాల నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు చేస్తు న్న 18 ఆశ్రమ పాఠశాలలకు ఉపాధ్యాయుల సర్దుబాట్లు, తరగతుల నిర్వహణకు భవన సదుపాయాలు ఎలా సమకూర్చటం అనే దానిపై ఐటీడీఏ విద్యాశాఖాధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఆప్షన్‌లపై అభ్యంతరాలు...

గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో(జీపీఎస్) మిగులుగా చూపిస్తున్న 93 మంది నుంచి ప్రస్తుతం ఐటీడీఏ అధికారులు ఆప్షన్‌లు తీసుకుంటున్నారు. అయితే ఒకే పాఠశాలలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉన్న చోట ఏ ప్రాతిపదికన చేస్తారనే దానిపై ఉపాధ్యాయులు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ ఉపాధ్యాయుడు ఆప్షన్ ఇస్తే, అతనికే చాన్స్ ఉంటుంది, ఒక వేళ ఆయన ఆప్షన్ ఇవ్వకుంటే, అక్కడ జూనియర్‌గా ఉన్న ఉపాధ్యాయుడు బయటకు రావాల్సి ఉంటుందని ఐటీడీఏ అధికారులు చెబుతున్నారు. అయితే దీనిపై ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాల మేరకే డిప్యుటేషన్ వేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి సింగ్ రాథోడ్ డిమాండ్ చేస్తున్నారు. మొత్తం మీద ఈ నెలాఖరు నాటికి పాఠశాలల నిర్వహణ సాగేలా ఐటీడీఏ అధికారులు ఆగమేఘాల మీద కసరత్తు చేస్తున్నారు.

పగలంతా బడి! రాత్రంతా బార్..!!

టేకులపల్లి:

అదొక చిన్న పల్లె..
అక్కడొక బుడ్డి బడి..!
పగలంతా పిల్లలతో కళకళ..
రాత్రంతా సీసాలతో గోలగోల..!!

ఎక్కడ..?

టేకులపల్లి మండలంలోని బేతంపూడి పంచాయతీలోగల తొమ్మిదోమైలు తండా. అదొక చిన్న పల్లె. అక్కడొక.. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. 30 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఇద్దరు ఉపాధ్యాయినులు ఉన్నారు. అటెండర్, స్వీపర్ లేరు.

ఏమైంది..?

బడి కాస్తా.. బార్ అండ్ రెస్టారెంట్‌గా మారింది. సెలవు రోజు వచ్చిందంటే చాలు.. ఈ బడి వాతావరణం చెప్పలేనంత అధ్వానంగా, రోతగా మారుతోంది. లోపలికి వెళితే.. గుప్పున మద్యం వాసన. పగిలిన మద్యం సీసాలు. తినుబండారాల వ్యర్థాలు. ప్లాస్టిక్ కవర్లు. ఒక రోజు కాదు.. ఒక వారం కాదు.. దాదాపుగా ఐదేళ్ల నుంచి దాదాపుగా ప్రతి రోజూ.. సెలవు రోజుల్లో తప్పనిసరిగా కనిపిస్తున్న దృశ్యమిది.

ఎవరు..?

ఇంకెవరు..? ఈ తండాలోని తాగుబోతులు. వారే ఈ బడిని రాత్రి వేళ బార్ అండ్ రెస్టారెంట్‌గా మారుస్తున్నారు. ఈ పాఠశాలలో చదువుతున్న పిల్లలంతా తమ తమ్ముళ్లో, బిడ్డలో, బంధువుల పిల్లలో అనే కనీస జ్ఞానం కూడా లోపించిన బుద్ధి హీనులు. తమ చర్య కారణంగా ఇబ్బందులు పడుతున్నది తమ ఊరి పిల్లలేనన్న ఆలోచన కూడా లేని అజ్ఞానులు. వారే దీనిని ఇంత అధ్వానంగా, ఛండాలంగా తయారుచేస్తున్నారు. తామంతా ఒకప్పుడు ఈ బడి గోడల మధ్యనే నాలుగు అక్షరాలు నేర్చుకున్నామన్న విషయాన్ని విస్మరిస్తున్నారు.

ఎలా..?

ఈ బడిలోకి ఆ తాగుబోతులు ఎలా వస్తున్నారన్నదేగా మీ ప్రశ్న! సుమారు మూడు నెలల క్రితం మిషన్ భగీరథ తవ్వకాలు చేపట్టారు. ఆ పనులు చేపట్టిన సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఈ పాఠశాల ముందు గోడ ధ్వంసమైంది. కింద పడిన గేటును తీసి పక్కన విసిరేశారు. ఈ బడి ఆవరణలో వెనుక భాగాన ఓ పాత భవనం ఉండేది. దానిని తొలగించడంతో ప్రహరీ లేకుండా పోయింది. ముందు, వెనుక.. రెండువైపులా ప్రహరీ లేకపోవడంతో లోపలికి తాగుబోతులు, జంతువులు యథేచ్ఛగా వస్తున్నాయి.

ఇబ్బందే...

కొద్దిగ కాదు.. చాలా! ఇక్కడ దాదాపుగా 30మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఇద్దరు ఉపాధ్యాయినులు ఉన్నారు. ఇందులో ఒకరు



పాఠశాల వరండాలో మద్యం సీసాలను చూపుతున్న ఉపాధ్యాయినిలు

ప్రధానోపాధ్యాయురాలు. ఇక్కడి పరిస్థితి ఎలా ఉంటోందని వారిని పలకరిస్తే.. వెంటనే ఏమీ చెప్పలేక, ఎలా చెప్పాలో తెలీక.. ఉబికొస్తున్న కన్నీటిని ఆపుకుంటూ ఇలా తమ మనోవేదనను ఇలా వివరించారు.. ‘‘ఉదయమే బడికి రావాలంటే భయమేస్తోంది. తరగతి గదుల్లో ఏం చూడాల్సొస్తోందని వణుకు పుడుతోంది. ఆదివారం, వరుసగా సెలవు రోజులొస్తే.. మాకు నరకం దాపురించినట్టే. బడి పక్కనే మద్యం దుకాణం ఉంది. అక్కడి నుంచి మందు బాటిళ్లు, తినుబండారాలు తెచ్చుకోవడం.. ఇక్కడికొచ్చి తాగడం, తినడం. తాగిన సీసాలను, తినుబండారాల కవర్లను, వ్యర్థాలను తరగతి గదుల్లో ఇష్టమొచ్చినట్టుగా పడేస్తున్నారు. చెప్పడానికే సిగ్గుగా ఉంది... (ఇబ్బందిపడుతూ, తలొంచుకుని).. తరగతి గదుల్లోనే మలం, మూత్రం విసర్జిస్తున్నారు. మాకు ఇక్కడ స్వీపర్, అటెండర్ లేరు. ఛండాలంగా మారిన ఈ గదులను పిల్లలు రాక ముందే మేమే శుభ్రం చేసుకోవాలి. ఐదేళ్ల నుంచి ఇదే నరకం. మొన్న గురువారం ఉదయం మేము వచ్చేసరికి నాలుగు బీరు సీసాలు, తినుబండారాల వ్యర్తాలు కనిపించాయి. మూత్ర విసర్జన దుర్వాసన కూడా వచ్చింది. గ్రామస్తులను పిలిచాం. చూశారు.. వెళ్లారు. ఈ ఊళ్లోని కొందరైతే.. ‘ఇద్దరు టీచర్లు ఉన్నారుగా! ఒకరు పాఠాలు చెప్పండి.. ఇంకొకరు శుభ్రం చేయండి’ అని ఎగతాళిగా మాట్లాడారు. అధికారులకు చెప్పాం, గ్రామస్తులకు చెప్పాం, ఇక్కడి ప్రజాప్రతినిధులకు చెప్పాం. ఇంకేం చేయాలి? మాకు ఈ నరకం ఇంకెన్నాళ్లో..’’ ఉబికొస్తున్న కన్నీళ్లను ఆపడం ఆ ఉపాధ్యాయినులకు సాధ్యపడలేదు.

ఏమంటున్నారు..?

ఎవరు..? అధికారులేగా..! ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్‌ను కూడా ‘సాక్షి’ పలకరించింది. ‘‘తొమ్మిదోమైలుతండా పాఠశాలలో సమస్యను అక్కడి ఉపాధ్యాయినులు నా దృష్టికి తీసుకొచ్చారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పాలని సూచించాను. వారు పని కూడా చేశారట. స్పందన రాలేదట. దీనిని అక్కడి గ్రామ పెద్దలతోపాటు పోలీసుల దృష్టికి తీసుకెళతాం’’ అని అన్నారు.



తరగతి గదిలో మద్యం సీసాలు, వ్యర్థాలు



సిరివెన్నెలమ్మా..! మళ్లెప్పుడొస్తావ్..?!

ఖమ్మంక్రైం:

“అమ్మా...!”

కూతురి పిలుపుతో ఆ తల్లి గాఢ నిద్ర నుంచి దిగ్గున మేల్కొంది. తండ్రి కూడా మేల్కొన్నాడు. పదేళ్ల ఆ బిడ్డ ఏడుస్తోంది. నిద్ర మగతలోనే ‘‘అమ్మా కడుపు నొప్పి’’ అంటోంది. అప్పుడు సమయం (శనివారం) అర్ధరాత్రి దాటి రెండు గంటలు. ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్‌లో ఆ చిన్నారి 4వ తరగతి చదువుతోంది. చదువంటే ఆ చిట్టి తల్లికి ఎంతిష్టమో! ఆ రోజు రాత్రి 11 గంటల వరకు శ్రద్ధగా చదువుకుంది. ఒకవైపు అలసట, మరోవైపు ముంచుకొస్తున్న నిద్రతో ఏమీ తినకుండానే పడుకుంది. అందుకే, తన బిడ్డకు ఆకలవుతుందేమోనని, ఆ విషయం చెప్పడం తెలీక ‘కడుపు నొప్పి’ అంటుందేమోనని ఆ తల్లి అనుకుంది. గబగబా లేచి గోరు ముద్దలు తినిపించింది. ‘‘చాప మీద వద్దులే. ఆ మంచం మీద పడుకుందాం’’ అంటూ తీసుకెళ్లింది. తన పక్కనే పడుకోబెట్టుకుంది. ‘‘ఇక పడుకోరా నాన్నా.. కడుపు నొప్పి తగ్గిపోతుందిలే’’ అని చెప్పి, జోకొట్టింది. కొద్దిసేపటి తరువాత ఆ చిన్నారి నిద్రలోకి జారుకుంది.

సిరి వెలుగు..!

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన ఉపేందర్, ఉమాభారతి దంపతులు బతుకుదెరువు కోసం ఖమ్మం వచ్చారు. ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో ఆమె ఆయాగా పనిచేస్తోంది. ఉపేందర్ ఆటో నడుపుతున్నాడు. వారికి ఒక్కతే కూతురు. వయసు పదేళ్లు. తల్లి పనిచేస్తున్న పాఠశాలలోనే నాలుగోతరగతి చదువుతోంది. తమ పాఠశాలలోనే పనిచేస్తున్న ఉమాభారతి కుటుంబం ఉండేందుకని హెడ్ క్వార్టర్స్‌లోని పాత క్వార్టర్స్‌ను ఆమెకు పోలీస్ అధికారులు కేటాయించారు. సిరిసంపదలు లేని ఆ దంపతులకు ఆ బిడ్డే గొప్ప ‘సిరి’ (ఆస్తి)! ఆ ఇద్దరి బతుకుల్లోని పేదరికమనే చీకట్లో ఆ చిన్నారే దేదీప్యపు ‘వెలుగు’!! అందుకే ఆ బిడ్డను ఇలా పిల్చుకుంటున్నారు.. ‘సిరి వెలుగు’!!!

అమ్మో..!

‘‘అమ్మా...!’.. అరగంట తర్వాత ఆ చిన్నారి సిరివెన్నెల గట్టిగా ఏడుస్తూ లేచి కూర్చుంది. తల్లిదండ్రులు ఆదుర్దా, ఆందోళనతో లేచారు. ‘‘ఒళ్లంతా చీదర పెడుతోంది. కళ్లు కనిపించటం లేదు..’’ ఆ చిన్నారి బిగ్గరగా ఏడుస్తోంది. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఆ తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. ఆగకుండా ఏడుస్తున్న ఆ పాపను మంచంలోనే పడుకోబెట్టి సిద్ధమవుతున్నారు. అరగంట కిందటివరకూ తన భార్య, కూతురు పడుకుని ఉన్న చాపను ఉపేందర్ తీస్తూనే.. ‘అమ్మో’ అని భయంతో గట్టిగా కేక వేశాడు. ఆయన భార్య ఉలిక్కిపడింది. ఆ చాప కింద పాము.. కట్ల పాము! చుట్ట చుట్టుకుని పడుకుంది. తన కూతురిని పాము కరిచిందని ఉపేందర్‌కు అర్థమైంది. ఇంట్లోని కర్ర తీసుకొచ్చి ఆ పామును చంపాడు. ఆ వెంటనే ఆయన భార్య బిగ్గరగా ఏడుస్తోంది... సిరివెన్నెల నోట్లో నుంచి నురగ వస్తోంది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆ దంపతులు పాపను తమ ఆటోలో జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు వెంటనే చికిత్స మొదలుపెట్టారు. ప్చ్... కాసేపటికే ఆ చిన్నారి.. తన తల్లిదండ్రులకు దూరంగా.. ఈ లోకం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయింది. ఆ తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించారు.

ఆమె.. ఓ పాఠశాలలో ఆయా..
అతడు.. ఆటో డ్రైవర్.
వారు నిరుపేద దంపతులు..
వారి బతుకుల్లో చీకట్లు.
ఆ ఇంటికి పదేళ్ల కిందట..
అదృష్ట దేవత వచ్చింది..
‘సిరి’ తెచ్చింది..!
‘వెలుగు’ నింపింది..!!
‘సిరి వెలుగు’గా మారింది.
ఓ అర్ధరాత్రి వేళ...
ఆ దేవత మాయమైంది..!!!
నీతోనే మేమంటూ..
‘సిరి’, ‘వెలుగు’ వెళ్లిపోయాయి..
‘సిరి వెలుగు’ దేవతమ్మా..
మళ్లెప్పుడొస్తావ్ తల్లీ..!!??

దిగ్భ్రాంతి

తెల్లారేసరికి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని అందరికీ ఈ దుర్వార్త తెలిసింది. కృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్ సిబ్బంది వచ్చారు. పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, ఆయన సతీమణి, కృష్ణప్రసాద్ పాఠశాల చైర్మన్ జెబాఖానమ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పాప మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహనాన్ని, అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందేలా ఏర్పాటు చేయించారు. అందరి మదిలో ఒకే ప్రశ్న.. ‘‘అమ్మా.. సిరివెలుగూ..! మళ్లెప్పుడొస్తావ్..?’’. రాదని తెలిసినా అదే ప్రశ్న.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

తిరుమలాయపాలెం(పాలేరు): మండలంలోని తిప్పారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాకాసితండాలో ఈ నెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ, హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో ఆదివారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రాకాసితండాకు చెందిన పానుగంటి పుష్పలత (36), భర్త సహదేవ్ మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 14న ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమె పరిస్థితి విషమించడంతో కుటుంఈబకులు హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె అక్కడే ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఆమె కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట(అశ్వారావుపేట): చత్తీస్‌గడ్‌కు కోడి పందాలు ఆడేందకుకు వెళుతున్న 9మంది వ్యక్తులను దమ్మపేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. మందలపల్లిలో ఎస్‌ఐ జలకం ప్రవీణ్‌కుమార్ వాహనాల తనీఖీచేస్తున్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన 9 మంది వ్యక్తులు చత్తీస్‌గడ్‌లో నిర్వహిస్తోన్న కోడిపందాలకు వెళుతున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసకుని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని అరెస్ట్ చేసి,వారి వద్ద ఉన్న రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు. మండలంలోని పార్కలగండి శివారు పాకలగూడెంలో కోడిపందాలపై ఆదివారం సాయంత్రం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ దాడి చేశారు. ఐదుగురితో అదుపులోకి తీసుకుని, పోలీసులు రూ.10,100 నగదు, రెండుకోళ్లుస్వాధీన పర్చుకున్నారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్ నికోబార్ దీవులు, పశ్చిమ తీరం, మధ్య మహారాష్ట్ర, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు గుజరాత్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయువ్య మైదానాలు, తూర్పు రాజస్తాన్, తూర్పు, మధ్య భారతంలోని మిగిలిన ప్రాంతాల్లో చిరుజల్లులు కురవచ్చు.

ఖమ్మం జిల్లా వాతావరణం

గరిష్టం కనిష్టం
28.2°/24.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	29.6	26.0
కోల్‌కతా	32.7	27.2
బెంగళూరు	28.6	20.3
ముంబై	27.8	25.6
చెన్నై	34.3	24.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	34.6/28.0	కర్నూలు	29.1/23.2
చిత్తూరు	34.4/26.2	నల్లగొండ	28.6/23.4
తిరుపతి	34.4/26.2	గుంటూరు	28.2/24.0
అనంతపురం	33.8/24.7	కాకినాడ	27.5/24.7
శ్రీకాకుళం	32.5/25.5	ఖమ్మం	27.0/19.4
విజయనగరం	32.5/25.5	కరీంనగర్	26.2/23.3
కడప	31.2/24.5	వరంగల్	26.1/24.0
ఒంగోలు	29.8/24.9	నిజామాబాద్	26.0/23.5
ఏలూరు	29.8/24.6	మహబూబ్‌నగర్	26.0/22.5
రాజమండ్రి	29.8/24.6	ఆదిలాబాద్	26.0/21.3
తాడేపల్లిగూడెం	29.8/24.6	హైదరాబాద్	25.7/21.9
విశాఖపట్నం	29.3/26.0	రంగారెడ్డి	25.7/21.1
విజయవాడ	29.1/24.1	మెదక్	25.4/21.5

బుల్లితెర

www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 బతుకు చిత్రం
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 జనపథం
మ.12.00 ఫస్ట్ హాఫ్ ప్రైమ్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 క్రైమ్ స్టోరీ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సాగరసంగమం
ఉ.09.30 నాగ ప్రతిష్ఠ
మ.12.00 చిరునవ్వుతో
సా.06.00 వాసు
రా.09.00 మృగరాజు




మూవీస్ నౌ
ఉ.09.00 డెమాలిషన్ మ్యాన్
ఉ.11.15 సిటీ లైట్స్
మ.01.00 యాంట్-మ్యాన్
సా.06.20 మ్యాన్ ఆఫ్ స్టీల్
రా.11.50 సూపర్‌మ్యాన్ 2




హెచ్‌బీవో
ఉ.07.21 10.000 బి.సి.
ఉ.09.20 ద గాడ్‌ఫాదర్
మ.12.29 ద హ్యాంగోవర్-2
సా.04.15 ద డార్క్ నైట్ రైజెస్
రా.07.16 ఫైనల్ డెస్టినేషన్ 5



స్టార్ మూవీస్
ఉ.06.45 గాడ్జిల్లా
మ.01.17 లైఫ్ ఆఫ్ పై
సా.06.18 స్పైడర్ మ్యాన్ 2
రా.09.00 టామ్ యమ్ గూంగ్
రా.11.18 ఇండిపెండెన్స్‌డే



మా మూవీస్
ఉ.07.00 తీన్‌మార్
ఉ.09.00 మొదటి సినిమా
మ.12.00 అసాధ్యుడు
మ.03.00 కాయ్ రాజా కాయ్
సా.05.00 ఒక లైలాకోసం



జీ సినిమా
ఉ.04.45 బిన్ బులాయే బరాతి
ఉ.09.57 మైనే ప్యార్ కియా
మ.02.13 లింగా
సా.05.29 వీర్
రా.09.00 బిజినెస్‌మ్యాన్ 2

తిరుమల సమాచారం

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:
ఉచిత గదులు, రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు, రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు
సహస్రదీపాలంకరణ సేవ – ఖాళీ లేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు
సోమవారం ప్రత్యేక సేవ : విశేష పూజ



భద్రాద్రి సమాచారం

తెల్లవారుఝామున 4.30 దేవాలయం తెరచుట
5.30 నుంచి 7.00 వరకు దర్శనం ఉండదు
7.00 నుంచి స్వామి వారి దర్శనం ప్రారంభం
7.00 నుంచి 8.00 వరకు అభిషేకం(భద్రుని మండపంలో)
9.00 నుంచి 11.30 వరకు కళ్యాణ సహస్ర నామార్చన
మధ్యాహ్నం 1.00 నుంచి 3.00 వరకు ఆలయం మూసివేత
3.00 నుంచి 9.00 వరకు దైవదర్శనం
రాత్రి 7.00 నుంచి 8.00 వరకు దర్బారు సేవ
9.00 గం.లకు ఆలయం మూసివేత

మార్కెట్ ధరలు

క్వింటాల్‌కి రూ.లలో

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం పంట ఉత్పత్తుల ధరలు

	గరిష్ఠ	కనిష్ఠ
మొక్కజొన్న	--	--
పెసలు	4,950	3,000
కందులు	4,250	3,600
మినుములు	4,500	4,500
బొబ్బర్లు	--	--
వేరుశనగ	--	--
ఎండుమిర్చి	5,500	2,000
మిర్చి తాలు	1,500	1,000
పత్తి	5,100	4,750

–ఖమ్మం, వ్యవసాయం

చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	144	168

పాడి-పంట

నారు పెంపకం..నాట్లేసే విధానం

తల్లాడ మండల వ్యవసాయశాఖ అధికారి సూచనలు



తల్లాడలో పెంచుతున్న వరి నారు



నాటు వేసేందుకు దమ్ము సిద్ధం



తల్లాడ ఏఓ శీలం చంద్రశేఖర్‌రెడ్డి

తల్లాడ: ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా లేని కారణంగా ఖరీఫ్‌లో వరినాట్లు ఆలస్యంగా పడే అవకాశముంది. ఈ నెలాఖరు నాటికి చెరువులు, కుంటలు, లిఫ్ట్‌లు, బావులు, బోర్ల కింద నాట్లు వేయనున్నారు. నారు పెంచే విధానం, నాట్లు వేసే పద్ధతులను తల్లాడ మండల వ్యవసాయశాఖాధికారి శీలం చంద్రశేఖర్‌రెడ్డి పలు సూచనలు చేశారు. ఆ వివరాలు ఇలా..

నారు పోసుకునే విధానం..

నారు మడిని 10–12 రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాల్వలను ఏర్పాటు చేయాలి. 5 సెంట్ల నారుమడికి కిలో నత్రజనిని విత్తనం చల్లేముందు, మరో కిలో విత్తనం వేసిన 12–14 రోజులకు, కిలో భాస్వరం, కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు చేయాలి. మొలకకట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు, ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి, తర్వాత పలుచగా నీరు కట్టాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రా జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉంటే దాళ్వా వరి సాగులో జింకులోప లక్షణాలు కనిపిస్తాయి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనో క్రోటోఫాస్ 1.6 మి.లీ. లేక క్లోరిపైరిపాస్ 2.0 మి.లీటరు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలి.

నాట్లేసేందుకు పొలంమడి తయారీ ఇలా..

నాటు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయడం మొదలెట్టాలి. 2–3 దఫాలుగా మురగ దమ్ము చేయాలి. పొలమంతా సమానంగా దమ్ము చెక్కతో, అడ్డతో గానీ..చదును చేయాలి. రేగడి భూముల్లో నాట్లు వేయడానికి రెండు రోజులు ముందుగానే దమ్ము పూర్తి చేసి, తర్వాత నాట్లు వేస్తే మంచిది.

- నారు తీసేటప్పుడు లేతాకుపచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరుగుతుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలి.
- ముదురు ఆకును నాటితే దిగుబడి తగ్గుతుంది.
- పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశముంది.
- భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చ.మీ.33 మూనలు, రబీలో 44 మూనలుండాలి.
- నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ బాటలు తీయాలి.
- పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి తగ్గుతుంది.
- ఎరువులు, పురుగు, కలుపు మందులు వేయడానికి ఇది ఎంతో ఉపయోగం.
- వరి రకాల కాలపరిమితిని బట్టి కుదుళ్ల సంఖ్యను నిర్ధారించాలి.
- ముదురు నారున్నప్పుడు నత్రజని ఎరువును 25 శాతం పెంచి రెండు దఫాలుగా దమ్ములో, 30 శాతం అంకురం దశలో వేయాలి.

భవిష్యం

మేషం: కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. బంధువర్గంతో తగాదాలు. అనారోగ్యం. వ్యాపారాలు, ఉద్యోగాలలో గందరగోళంగా ఉంటుంది. దేవాలయదర్శనాలు.

వృషభం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. నూతన పరిచయాలు. అందరిలోనూ గుర్తింపు. యత్నకార్యసిద్ధి. పరపతి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు తొలగుతాయి.

మిథునం: ఆదాయానికి మించి ఖర్చులు. కొత్త బాధ్యతలు. ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్య సూచనలు. ఆస్తి వివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒడిదుడుకులు.



కర్కాటకం: నూతన ఉద్యోగ ప్రాప్తి. చిన్ననాటి స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. మీ సేవలకు గుర్తింపు లభిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

సింహం: ప్రయాణాలలో ఆటంకాలు. కార్యక్రమాలు వాయిదా వేస్తారు. సోదరులతో భూవివాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఇబ్బందులు. అప్పులు చేయాల్సివస్తుంది.

కన్య: నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆలోచనలు అమలు చేస్తారు. గత సంఘటనలు గుర్తుకొస్తాయి. వ్యాపార, ఉద్యోగాల్లో ఉత్సాహవంతంగా ఉంటుంది. దేవాలయ దర్శనాలు.

తుల: ఇంటిలో శుభకార్యాలు. ఆకస్మిక ధనలాభం. యత్నకార్యసిద్ధి. హోదాలలో ఉన్న వారితో పరిచయాలు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో ముందుకు సాగుతారు.

వృశ్చికం: దూరప్రయాణాలు. కార్యక్రమాలలో అవాంతరాలు. విలువైన వస్తువులు జాగ్రత్త. కష్టానికి తగ్గ ఫలితం ఉండదు. వ్యాపారాలు, ఉద్యోగాలలో మార్పులు ఉండవచ్చు.

ధనుస్సు: కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. బంధువులతో అకారణ వైరం. ఆరోగ్య, కుటుంబసమస్యలు. భూవివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు.

మకరం: కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆత్మీయుల నుంచి శుభవర్తమానాలు. అదనపు రాబడి ఉంటుంది. సన్నిహితులు, స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

కుంభం: కార్యజయం. శుభకార్యాలలో పాల్గొంటారు. పాత స్నేహితులను కలుసుకుంటారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం.

మీనం: కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. బంధువులు, స్నేహితులతో తగాదాలు. కాంట్రాక్టులు చేజారతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిక్కులు తప్పవు.

– సింహంభట్ల సుబ్బారావు



కొత్తగూడెంటౌన్: ఇటీవల కురిసన వర్షాలకు వీధుల్లో వర్షపు నీరు నిలిచి రహదారులన్నీ బురదమయంగా మారాయి. దీంతో బయటికి వెళ్లలేక పోతున్నాం. అధికారులు స్పందించి రహదారులను బాగు చేయించాలి.



సునీల్, కారుకొండ రామవరం

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9949702944

ఇదేం దారిద్ర్యం



పాల్వంచరూరల్: జగన్నాథపురం వీధిలో నిలిచిన నీటిలోనుంచి వస్తున్న మహిళలు



జూలూరుపాడు: పెద్దహరిజనవాడలో..

చిన్న వర్షం కురిసినా అంతర్గతరోడ్లు బురదమయం.. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక వీధుల్లో నిలిచిన వర్షపు నీరు.. ఎక్కువైన నీరు ఇళ్లలోకి వస్తున్న వైనం.. చిత్తడిగా మారిన రహదారులపై నడవలేక ఇబ్బంది పడుతున్న ప్రజలు.. అస్తవ్యస్తంగా మారిన పారిశుద్ధ్యం.. ఇదీ.. శుక్రవారం, శనివారం కురిసిన వర్షాలకు పాల్వంచ మండలంలోని జగన్నాథపురం, జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు, వెనకతండా, భీమ్లాతండా, జడల చింత, పెద్దహరిజనవాడ, రాజారావుపేట తదితర గ్రామాల దుస్థితి.. జగన్నాథపురంలో ఇటీవల పైపులైన్ నిర్మాణంకోసం తవ్వకా లు చేపట్టి ఎత్తుగా మట్టిపోశారు. దీంతో వరదనీరు నిల్వ ఉంది. వీధిలో ప్రజలు రాకపోకలు సాగిం చాలంటే అవస్థలు పడుతున్నారు.

ప్రతి ఏటా ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నా.. అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా.. పట్టించుకునేవారు కరువయ్యారు.

-పాల్వంచరూరల్/ జూలూరుపాడు



పాల్వంచరూరల్: జగన్నాథపురంలో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట..

నిధులు రాగానే..

జగన్నాథపురంలో అంతర్గరోడ్ల అభివృద్ధికోసం గ్రామ జ్యోతి కింద ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే అన్ని 'వీధుల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తాం. వారి ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తాం.

పాల్వంచ ఎంపీడీఓ కె. ధన్‌సింగ్

మరమ్మతులు చేపడతాం

మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గతరోడ్లు అధ్వానంగా ఉన్నాయనే విషయం మా దృష్టికి వచ్చింది. మరమ్మతులు చేపడతాం. పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తాచెదారం తొలగిస్తాం. -జూలూరుపాడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బి.భారతి



జూలూరుపాడు: పాపకొల్లు వెనకతండాలో..

న్యూస్‌బాక్స్

ఆర్ట్,క్రాఫ్ట్ పోస్టుల భర్తీకి ఉద్యమం

చుంచుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టుల భర్తీకోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎండీ జలాల్, ఆర్ట్ లెక్చరర్ బిక్షపతి అన్నారు.
ఆదివారం స్థానిక అంబేడ్కర్ ఐటీఐలో జరిగిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పరిధితో పాటుగా, వివిధ గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.5000 చెల్లించాలని డిమాండ్ చేశారు. సదస్సులో వెంకన్న, రాంబాబు, సాయికిరణ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ

పాల్వంచ: పాల్వంచ వాసవీ క్లబ్ సభ్యుడు మాలె రాజేష్ కుమార్తె తనుశ్రీ జన్మదినం పురస్కరించుకుని ఆదివారం స్థానిక యువసేన అనాథాశ్రమంలో కేక్ కట్ చేశారు. అనాథ పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు, చాక్లెట్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు.

వయోజన అభ్యాసకులకు ఎన్ఐఓఎస్ పరీక్ష

జూలూరుపాడు: సాక్షర భారత్ ఆధ్వర్యంలో వయోజన అభ్యాసకులకు ఎన్ఐఓఎస్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో 192 మందికి పరీక్షను నిర్వహించినట్లు మండల సమన్వయకర్త బి.లక్ష్మా తెలిపారు.
కార్యక్రమంలో సర్పంచ్ పాయం వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్ సుభద్ర, వీసీఓలు డి.రవి, రేణుక, మోహన్‌రావు, మంగూలాల్, రజని, అనురాధ, బాలు, రత్నకుమార్ పాల్గొన్నారు.
పాల్వంచరూరల్: మండల పరిధిలోని 11 గ్రామపంచాయతీల్లో సాక్షర భారత్ ఆధ్వర్యంలో ఎన్ఓసీ అర్హత పరీక్షను నిర్వహించారు. మండల కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. ఉత్తీర్ణులైన వయోజనులకు అర్హత పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు అవార్డు రావడం పట్ల హర్షం

జూలూరుపాడు: భారత ఆహార, వ్యవసాయ మండలి ప్రతిష్టాత్మకమైన అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు రావడం పట్ల టీఆర్ఎస్ మండలశాఖ ఆదివారం హర్షం వ్యక్తం చేసింది. హర్షం వ్యక్తం చేసిన వారిలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చావా వెంకటరామారావు, వేల్పుల నరసింహారావు, నున్నా రంగారావు, శ్రీనాథరాజు నాగరాజు, గాదె గోవర్ధన్, మోదుగు రామక్రిష్ణ ఉన్నారు.

చిరకాల జ్ఞాపకాలను అందించేవారే ఫొటోగ్రాఫర్లు

డీఎస్పీ సురేందర్‌రావు

కొత్తగూడెం: చిరకాల జ్ఞాపకాలను అందించేవారే ఫొటోగ్రాఫర్స్ అని కొత్తగూడెం డీఎస్పీ సురేందర్‌రావు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం పట్టణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పద్మశాలీ కల్యాణ మండపంలో ఫొటోగ్యాలరీ, వివిధరకాల కెమేరాలు, పరికరాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ సురేందర్‌రావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ పులి గీత ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. త్రీటౌన్ సీఐ షుకూర్, పట్టణ ప్రముఖులు జి.వి.కె.మనోహర్, 2వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీబాయి, ఫొటో, వీడియోగ్రాఫర్స్ జిల్లా గౌరవాధ్యక్షుల ఎస్‌కె.ఎ.షరీఫ్, జిల్లా అధ్యక్షులు మైలవరపు రామకృష్ణ, సెక్రటరీ వెంకటపతిరాజు, పట్టణాధ్యక్షులు చావా పాపారావు, సెక్రటరీ గడ్డం ప్రభాకర్, కోశాధికారి మంచికట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కెమేరాల సృష్టికర్తలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

రజకులు అన్ని రంగాల్లో రాణించాలి

రజక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పాగర్తి సుధాకర్

పాల్వంచ: రజకులు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రజక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు. ఆదివారం పాత పాల్వంచలో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 23న మధిర పట్టణంలో జరిగే రజకుల బహిరంగ సభను విజయవంతం చేయాలని ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకుల అభివృద్ధికోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. రూ.250 కోట్ల రుణాలను మంజూరు చేసి ఆధునిక పరికరాలను వెంటనే అందించాలన్నారు. తమ్మరపు బ్రహ్మయ్య, శాం, నిమ్మల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీతారాంనాయక్ జన్మదిన వేడుకలు

పాల్వంచ: ఎంపీ సీతారాంనాయక్ జన్మదిన వేడుకలను ఆదివారం స్థానిక గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బానోతు బాబురావు నాయక్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు గుగులోతు చందు నాయక్ , మాలోతు రమేష్, బోడా బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపు కేసులో నిందితుల అరెస్ట్

పాల్వంచ:

రెండు రోజుల క్రితం అక్రమంగా లారీలో రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిని వారిని ఆదివారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఎన్. కరుణాకర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం స్థానిక దమ్మపేట సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కొత్తగూడెం నుంచి వస్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో వంద క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో డ్రైవర్, క్లీనర్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. అక్రమ రవాణాకు కారణమైన తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రాపురానికి చెందిన లారీ డ్రైవర్ కొత్తపల్లి వెంకటేష్, క్లీనర్ కర్రి వెంకన్నబాబు, లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లికి చెందిన రేషన్ డీలర్ బీమల శ్రీనివాసరావును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన మాచర్ల రమేష్, శేఖర్, రంజిత్, వర్మ అనే నలుగురు పరారీలో ఉన్నారని త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామని తెలిపారు.

రామయ్యకు స్వర్ణ పుష్పాలతో పూజలు

భద్రాచలం:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం స్వర్ణ పుష్పాలతో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలోని మూలమూర్తులకు జరిపించిన ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారికి నిత్య కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని భద్రుని మండపంలో స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. గోదావరి పుణ్య జలాలతో భద్రుని గుడిలో స్వామి వారి పాదుకుల వద్ద అభిషేకం నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూర్తులకు అంతరాలయంలో పూజలు చేశారు. ప్రత్యేక పల్లకిపై మేళతాళాలతో గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు.

ఆలయ ప్రాకార మండపంలో స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోత్రధారణగావించారు. భక్తుల గోత్రనామాలను స్వామి వారికి విన్నవించారు. వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు అత్యంత వైభవోపేతంగా రామయ్యకు నిత్య కల్యాణం జరిపించారు. భక్తులకు స్వామి ప్రసాదాలు అందించారు. కాగా పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి కల్యాణం అనంతరం పట్టాభిషేకం నిర్వహించారు.



పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, (ఇన్‌సెట్) వేడుకను తిలకిస్తున్న భక్తులు

రామాలయంలో అన్నదానానికి వితరణ



ధ్రువీకరణ పత్రం ఇస్తున్న నర్సింహరాజు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి ఖమ్మం పట్టణానికి చెందిన శ్రీరంగం వాకుల భాష్యం, లక్ష రూపాయలను ఆదివారం అందించారు. ఆయన ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ తాయారమ్మ, అభయాంజనేయస్వామి ఆలయాలను కూడా దర్శించుకుని పూజలు చేశారు. నిత్యాన్నదాన కౌంటర్‌లో నగదు చెల్లించారు. ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని ఆలయ పర్యవేక్షకుడు నర్సింహరాజు అందజేశారు.

ఏకలవ్య గురుకులంలో 23న ప్రవేశ కౌన్సెలింగ్

దమ్మపేట(అశ్వారావుపేట): మండలంలోని గండుగులపల్లిలోగల ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలలో 5, 6తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గిరిజన గురుకులాల వరంగల్ రీజియన్ అధికారి బురాన్, స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ సీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో ఎస్టీ–64, ఎస్సీ–10, బీసీ–4, ఇతరులకు–2 సీట్లు కేటాయించినట్టు వివరించారు. దరఖాస్తు చేసేందుకు ఈ నెల 23వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. అదే రోజున (ఈ నెల 23న) పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు దరఖాస్తుదారులంతా హాజరు కావాలని కోరారు.

పెళ్లికి ఒప్పుకోలేదని ఆత్మహత్యాయత్నం

మరిపెడ(డోర్నకల్): పెళ్లికి ఒప్పుకోలేదని ఓ యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రం శివారులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన ఓ బాలిక ఖమ్మంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతోంది. ఖమ్మానికి చెందిన షేక్ రియాజ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరు గత నాలుగేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నారు. ఈ క్రమంలో పెళ్లి చూపుల నిమిత్తం ఆదివారం రియాజ్ తన బంధువులతో అబ్బాయిపాలెం చేరుకున్నాడు. అయితే అమ్మాయి తల్లిదండ్రులు వరుస కాదని చెప్పడంతో అమ్మాయి కూడా వ్యతిరేకించింది. దీంతో రియాజ్ మనస్తాపానికి గురై మండల కేంద్రం శివారులోని ఎత్తిపోతల పథకం ప్రాంతంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయం బంధువులకు తెలియడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని రియాజ్‌ను స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించడంతో 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: కడుపు నొప్పి భరించలేని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ రైటర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. రమణగుట్ట ప్రాంతానికి చెందిన నిరుపేద కూలీ కుంచం భద్రి(19) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో ఎస్‌ఐ సర్వయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవలో
వైద్యులు ముందుండాలి

జిల్లా ఎస్పీ అంబర్‌కిషోర్ ఝా



వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న ఎస్పీ అంబర్‌కిషోర్ ఝా

కొత్తగూడెంక్రైం:

వైద్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని జిల్లా ఎస్పీ అంబర్‌కిషోర్ ఝా అన్నారు. పేదలకోసం చేపట్టే కార్యక్రమాలకు పోలీసుల సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోగల సురక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో చెవి సంబంధ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వైద్య శిబిరం నిర్వహించిన సురక్ష హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ రవిబాబునాయక్‌ను అభినందించారు. వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా వారికి అవసరమైన మందులు, వినికిడి యంత్రాలను సైతం ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి దయానందస్వామి మాట్లాడుతూ.. జిల్లాలో వైద్యుల కొరత ఉందని, ఇలాంటి సమయంలో పేదల కోసం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఐఎంఏ ఆధ్వర్యంలో సైతం వైద్య శిబిరాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వైద్య శిబిరం నిర్వాహకుడు డాక్టర్ రవిబాబు నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి తేజావత్ రామచంద్రనాయక్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కొత్తగూడెం పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుమారు 500 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ హియరింగ్ సొల్యూషన్స్ నుంచి ప్రభాకర్, కిరణ్, సందీప్, శ్యామ్, వినాయక హియరింగ్ సొల్యూషన్స్ నుంచి నేహా, జయ, వీరన్న, కస్తూరి హియరింగ్ సొల్యూషన్స్ నుంచి సత్యనారాయణ, సురక్ష ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ కాదు.. ప్రభుత్వ హత్యలే..

సీపీఐ మావోయిస్టు దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ

దుమ్ముగూడెం: తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కిష్టారం అటవీ ప్రాంతంలో ఈ నెల 13న ఇద్దరు ఆదివాసీ యువకులను సీఆర్‌పీఎఫ్ బలగాలు కాల్చి చంపగా.. ప్రభుత్వం దాన్ని ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తోందని సీపీ మావోయిస్టు దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ ఆరోపించింది. ముమ్మాటికి అవి ప్రభుత్వం, పోలీసుల చేసిన హత్యలేనని పేర్కొంది. ఆదివారం సీపీఐ మావోయిస్టు దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ పేరుతో విలేకరులకు లేఖలు అందాయి. కిష్టారం ప్రాంతంలో జరిగిన బూటకపు ఎన్ కౌంటర్లకు మతతత్వ బీజేపీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ బాధ్యత వహించాలని ఆ లేఖలో మావోయిస్టులు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ఎన్‌కౌంటర్లను ఖండించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీలను సీఆర్‌పీఎఫ్ బలగాలతో పాటు కోయ కమాండోల నాయకుడు మడకం ముద్దరాజు నేతృత్వంలో తీసుకెళ్లి చిత్ర హింసలకు గురి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఈ నెల 13న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న పొడియం సన్నా, ఒన్జం హుంగా అనే ఇద్దరు ఆదివాసీలను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి చిత్ర హింసలు పెట్టి హత్య చేశారన్నారు. ఆగస్టు 2న మెట్టగూడ గ్రామానికి చెందిన మడివి గంగా, పాలచెలం గ్రామానికి చెందిన అర్జున్, 10న చినమ్‌పెంట్రగ్రామానికి చెందిన ఇడమా, కుంజం భీమా, తుమిడిగడ్డ గ్రామానికి చెందిన సోడె భీమాలను పోలీసులు పట్టుకెళ్లి వారిని ఎక్కడ ఉంచారనేది ఇంతవరకు సమాచారం లేదని ఆ లేఖలో చెప్పారు.



మావోయిస్టులు విలేకరులకు పంపిన లేఖ

టీ మాస్ ఫోరం సదస్సుకు తరలిరండి

టీ మాస్ జిల్లా కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: ఈనెల 26న కొత్తగూడెంలో జరిగే టీ మాస్ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో బానోతు ధర్మా అధ్యక్షతన టీమాస్ సన్నాహాక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమం, సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా టీమాస్ ఫోరం ఏర్పాటైందన్నారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ప్రజా సంఘాలు, సంస్థలు, ప్రజలు, విద్యార్థులు, యువత ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన సాగడం లేదన్నారు. బడుగు, బలహీన, మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలు అభివృద్ధి సాధించకుండా బంగారు తెలంగాణ ఎలా సాధ్యమౌతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు కాకా మహేష్, కాంగ్రెస్ నాయకుడు లాకావతు గిరిబాబు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాసా కొండలరావు, గిరిజన సంఘం నాయకులు బానోతు మంగిలాల్, ఇస్లావత్ భద్రు, మాల మహానాడు నాయకులు బి.ప్రభాకర్, ఇల్లంగి గోపయ్య, సేవాలాల్ సేన జిల్లా నాయకుడు బి.హరి, మైనార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కే.మస్తాన్ సాహెబ్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కల్తి రాములు, కేవీపీఎస్ సంఘం నాయకుడు జి.కనకరత్నం, రజక సంఘం నాయకుడు ధర్మరాజుల వెంకటనారాయణ, మున్నూరుకాపు సంఘం నాయకుడు గోపు జానికిరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు చీమలపాటి భిక్షం, లాకావతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

23న మట్టి వినాయక విగ్రహాల తయారీపై పోటీలు

కొత్తగూడెంరూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో పాల్వంచ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో ఈనెల 23న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీపై పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి హయగ్రీవచార్య తెలిపారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగూడెం, పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపహాడ్ మండలాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. వివరాల కోసం 9247296012ను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

సమన్వయంతో పనిచేద్దాం

టీపీసీసీ అధికార ప్రతినిధి యడమకంటి రోశిరెడ్డి

బూర్గంపాడు: అంతర్గత విభేదాలను పక్కకు పెట్టి సమన్వయంతో పనిచేద్దామని అందుకు పార్టీ అధిష్టానం చొరవతీసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి యడమకంటి రోశిరెడ్డి అన్నారు. ఆదివారం సారపాకలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను తమకు అనుకూలంగా మలుచుకునే విషయంలో కాంగ్రెస్‌పార్టీ శ్రద్ధ వహించటం లేదన్నారు. నాయకత్వంలో ఉన్న వర్గవైషమ్యాలను పక్కకు పెట్టకుంటే రానున్న రోజుల్లో పార్టీ మరింత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌పార్టీపై ఉన్న ఆదరణ చెక్కు చెదరలేదన్నారు. కలిసి పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

కొత్తగూడెంరూరల్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ స్థానంలో నూతన పెన్షన్ విధానాన్ని తీసుకురావడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ జిల్లా నాయకుడు బి.ముత్తయ్య, టీపీటీఎఫ్ నాయకుడు ఎస్.వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్.శ్యాంప్రసాద్, ఎస్‌టీఎఫ్ నాయకుడు జగో రాంబాబు, టీపీటీఎఫ్ నాయకుడు బి.రమేష్, టి.మాధవరావు, ఎం.కృష్ణ, ఎం.నటరాజ్, ఎల్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భర్తపై దాడి కేసు నమోదు


సుజాతనగర్: భార్యపై భర్త దాడిచేసిన సంఘటనపై సుజాతనగర్ పోలీసులు ఆదివారం కేసు నమోదుచేశారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్‌కు చెందిన జి.కృష్ణవేణి.. తన భర్త జి.రాములుతో గొడవల కారణంగా తిప్పనపల్లిలో ఒంటరిగా ఉంటోంది. వీరిద్దరూ కలిసి ఉన్న సమయంలో ఒక వ్యక్తికి వడ్డీకి డబ్బులిచ్చారు. వాటికి సంబంధించిన వడ్డీ విషయమై అడిగేందుకు కృష్ణవేణి భర్త వద్దకు వచ్చింది. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. కృష్ణవేణి తలపై రాములు కర్రతో కొట్టడంతో ఆమెకు గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీనివాసరెడ్డిని కోల్పోవడం దురదృష్టకరం



శ్రీనివాసరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి వనమా

పాల్వంచ: రాజకీయాలకతీతంగా అందరితో స్నేహంగా మెలిగే శ్రీనివాసరెడ్డిని కోల్పోవడం దురదృష్టకరమని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. టీఆర్‌ఎస్ నాయకుడు మారం శ్రీనివాసరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆదివారం స్థానిక సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో పెద్దకర్మను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి చిత్రపటం వద్ద వనమా పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర స్టీల్ కమిటీ మాజీ సభ్యుడు దయానంద్, సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాస రావు, తుమ్మల శివారెడ్డి, మిమిక్రీ కళాకారులు రమేష్, మారం వెంకట రెడ్డి, అర్జున్‌రెడ్డి, అభిలాష్ రెడ్డి, క్రిష్టఫర్, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ 'గాంధీ'లో 17 పోస్టులకు 17 నింపారు.

ఆదిలాబాద్ నుంచి రొడ్డ దేవిదాస్:

తెలంగాణలోని నాలుగు ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలు నైరాశ్యంలో ఉన్నాయి. 2013లో ఆదిలాబాద్, జగిత్యాల, సికింద్రాబాద్, 2012లో వరంగల్ నర్సింగ్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. కానీ ఇప్పటివరకు ఈ కళాశాలల్లో రెగ్యులర్ సిబ్బందిని నియమించలేదు. దీంతో సిబ్బంది కొరత వేధిస్తోంది. వరంగల్ కళాశాల ప్రిన్సిపల్ మినహా అన్ని కళాశాలల్లో ఇన్‌చార్జీలు, డిప్యుటేషన్‌లపైనే ఉన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదు. ఉన్న బోధన సిబ్బందిపైనే పనిభారం పెరిగిపోతోంది.

> **తెలంగాణలోని అన్ని కళాశాలల్లో కలిపి 248 టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులకు గాను179 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.**



నర్సింగ్‌పై నజరేదీ?

> ఆయా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సీనియర్ స్టాఫ్ నర్సులను డిప్యుటేషన్‌పై నర్సింగ్ కళాశాలలకు పంపించి బోధన చేయిస్తున్నారు.

నైరాశ్యంలో నర్సింగ్ కళాశాలలు

- **నాలుగు జిల్లాల్లో భర్తీకాని పోస్టులు**
- **248 పోస్టుల్లో 179 ఖాళీ.. 69 భర్తీ**
- **రెగ్యులర్ పోస్టుల్లేవు.. నిధులూ లేవు..**
- **విద్యార్థులకు అందని బోధన**
- **భవనాలులేక ఆస్పత్రి గదుల్లో వసతి**

ఒక్క రూపాయీ రాలె..

నాలుగు జిల్లాల్లోని నర్సింగ్ కళాశాలలకు ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులకు కావాల్సిన పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అయినా పరిస్థితి మారుతుందనుకుంటే అదేతీరు కొనసాగుతోంది. గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధన అందడం లేదు. కళాశాల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు విడుదల చేయలేదు. ప్రతి కళాశాలకు సుమారు రూ.10 కోట్లు అవసరం ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. కళాశాల మంజూరుతోనే నిధులు విడుదల చేయాల్సి ఉన్నా.. కేవలం నర్సింగ్ సీట్లు కేటాయించి విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించారు.


ఒక్కపోస్టూ రెగ్యులర్ కాదు

నాలుగు జిల్లాలో వరంగల్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మినహా మిగతా జిల్లాల్లో ఇప్పటి వరకు ఒక్క రెగ్యులర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. రెగ్యులర్ ప్రిన్సిపల్ ఉంటేనే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతాయి. కానీ.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థినులకు బోధన కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఆయా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సీనియర్ స్టాఫ్ నర్సులను డిప్యుటేషన్‌పై నర్సింగ్ కళాశాలలకు పంపించి బోధన చేయిస్తున్నారు. బోధన సమయంలో విద్యార్థినులకు అవసరమైన పరికరాలు, న్యూట్రిషన్, ప్రాక్టికల్ మెటీరియల్, లైబ్రరీ, ల్యాబ్‌లు, ఎంసీహెచ్ వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా.. ఆ దిశగా ఆలోచన చేయడం లేదు.

రోగుల వార్డుల్లో వసతి



నాలుగు జిల్లాల్లో 850 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఆదిలాబాద్ నర్సింగ్ కళాశాల విద్యార్థినుల పరిస్థితి దారుణంగా ఉంది. కళాశాలలో ప్రస్తుతం నాలుగు బ్యాచ్‌లలో 160 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఏపీలోని శ్రీకాకుళం, కాకినాడ, కర్నూల్, విజయవాడ, తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, ఖమ్మం, జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ ఉన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వీరికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. నర్సింగ్ కళాశాలకు ఇప్పటివరకు సొంత భవనం, వసతి గృహం లేవు. దీంతో రిమ్స్ ఆస్పత్రిలోని మూడో అంతస్తులో కళాశాల, రోగుల వార్డులను వసతికి ఉపయోగిస్తున్నారు. భోజనం సైతం మెడికల్ కళాశాల మెనూ నుంచే ఇస్తున్నారు. దీని కోసం రూ. రెండు వేలు తీసుకుంటున్నారు. జగిత్యాలలో కళాశాల భవన నిర్మాణం ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ ఏరియా ఆస్పత్రిలో కళాశాల నడుస్తోంది.



ఈ పీడీఎస్‌లో వెనకంజలో ఉన్న జిల్లాలు.. | ముందంజలో ఉన్నవి

నల్లగొండ నుంచి బొల్లం శ్రీనివాస్:

ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ఈ పాస్ విధానం అమల్లోకి తెస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అమలు చేస్తున్న ఈ-పాస్ (ఎలక్ట్రానిక్ పోర్టల్ అస్సెస్ సర్వీసెస్) విధానం ఫలితాలను ఇస్తుండడంతో దీన్ని దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే చర్యలకు పూనుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఆహారభద్రత పథకం కింద లబ్ధిపొందుతున్న కార్డుదారుల వివరాలు, ఫోన్ నంబర్లను రెవెన్యూ యంత్రాంగం సేకరిస్తోంది. వీటినన్నింటినీ ఈ పీడీఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. జూలై 1 నుంచి రెవెన్యూ యంత్రాంగం ఈ కసరత్తు చేపట్టింది.

31 జిల్లాల్లో ఆహార భద్రత కార్డులు **85,42,213**

> రాష్ట్రంలో తొలిసారిగా ఆహార భద్రత కార్డుల్లో మతాల వారీగా గణన చేశారు. ఈ పాస్ విధానానికి మతాలతో సంబంధం లేకున్నా ప్రభుత్వం ఈ వివరాలు సేకరించింది.



మతాలవారీగా కార్డుదారులు

తొలిసారిగా మతాలవారీగా ఆహార భద్రత కింద లబ్ధి పొందుతున్న కార్డుదారులను గణన చేశారు. మొత్తం 85.42 లక్షల కార్డుల్లో హిందువులవి 37,75,808, ముస్లింలు 5,21,933, క్రిస్టియన్లు 1,39,533, సిక్కులు 1,398, బుద్దిస్టులు 514, జైనులు 572, ఇతర మైనార్టీలు 2,331, ఇతరులవి 3,248 కార్డులు ఉన్నాయి. ప్రభుత్వం ప్రచార కార్యక్రమానికి ఉపయోగించుకునేందుకు ప్రజాపంపిణీ కింద వీరి లెక్కలు తీసి పెట్టింది. అన్ని మతాలకు ఆహార భద్రత కల్పిస్తున్నామని చెప్పుకోవడానికి మతాలవారీగా కార్డులదారుల సంఖ్య వివరాలు తీసుకుంది.

ఇక పక్కా లెక్క!

రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఇలా కట్టడి చేస్తారు..

- నిరుపేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దులు దాటి పక్కదారి పడుతోంది.
- దీనికి చెక్ పెట్టేందుకే ప్రభుత్వం ఈ – పాస్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తోంది.
- ముందుగా ఈ పాస్ విధానంపై డీలర్లు, తహసీల్దార్లు, సివిల్ సప్లయీస్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.
- ఈ పాస్ మిషన్లు దశలవారీగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల రేషన్ దుకాణాలకు రానున్నాయి.
- ఈ విధానంతో ప్రజాపంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసినట్లువుతుంది.
- లబ్ధిదారులు దుకాణాలకు వచ్చినప్పుడు వేలిముద్రలు తీసుకుని సరుకులు పంపిణీ చేస్తారు.
- కార్డుపైన ఉన్న కుటుంబ సభ్యుల్లో ఎవరైనా వేలిముద్ర వేసి సరుకులు పొందవచ్చు.
- రేషన్ దుకాణానికి సరుకులు వచ్చిన సమాచారం, కార్డుదారులు డీలర్ నుంచి సరుకులు తీసుకున్న సమాచారం వెంటనే కార్డుదారుల ఫోన్ నెంబర్‌కు వెళ్తుంది.
- డీలర్ వద్ద ఎం-రిజిష్టర్ అనేది ఇక ఉండదు. ఈ పాస్‌లోనే అన్ని వివరాలు నిక్షిప్తమై ఉంటాయి.
- దీంతో పాటే పోర్టబులిటీ విధానాన్ని కూడా ప్రవేశపెట్టనున్నారు.
- కార్డుదారులు రేషన్ సరుకులు తమకు కేటాయించిన దుకాణాల్లోనే కాకుండా అందుబాటులో ఉన్న ఏ దుకాణం నుంచి అయినా పొందవచ్చు.

31 జిల్లాల్లో 85,42,213 ఆహార భద్రత కార్డులున్నాయి.. 3,12,14,828 మంది లబ్ధిపొందుతున్నారు. మొత్తం కార్డుల్లో ఇప్పటివరకు 44,45,337 కార్డులు ఈ పీడీఎస్ పోర్టర్‌లో నమోదయ్యాయి. మిగతా 40,96,876 కార్డుదారుల వివరాల అప్‌డేట్ చేయలేదు.

వైరా: బోనాలతో తరలివెళ్తున్న మహిళలు



మణుగూరు: బోనాల ఊరేగింపు..






జూలూరుపాడు: కాకర్లలో..

బోనమెత్తి..

శ్రావణ మాసం చివరి ఆదివారం బోనాల వేడుకలు పలు చోట్ల ఘనంగా జరిగాయి. బోనాలు ఎత్తుకుని మేళతాళాలు, డప్పుచప్పుళ్లతో ఊరేగింపులు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. బోనాల పండగతో రెండు జిల్లాల్లో సందడి నెలకొంది. **-సాక్షి నెట్‌వర్క్**



ఖమ్మం: గంగపుత్రుల కోలాహలం



బోనకల్: ప్రభ బండ్లతో తరలివెళ్తున్న రైతులు



నేలకొండపల్లి: పూజలు చేస్తున్న భక్తులు

కిన్నెరసానిలో పర్యాటక సందడి

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయం పూర్తిస్థాయిలో నిండడంతో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి ప్రకృతి అందాలను తిలకించారు. డీర్‌పార్కులోని జింకలు, చుక్కల దుప్పులు, నెమళ్లు, డక్‌పాండ్‌లోని బాతులను, నిండుకుండలా మారిన రిజర్వాయర్ అందాలను వీక్షించారు. చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు, మహిళలు ఆటపాటలతో ఆనందోత్సవాల నడుమ ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపారు. ప్రాజెక్టు గేటు ఎత్తడం వల్ల బోటింగ్ నిలిపివేశారు. వివిధ ప్రాంతాల నుంచి 1,059 మంది పర్యాటకులు ఆదివారం కిన్నెరసానిని సందర్శించారు. దీంతో రూ.15,970 ఆదాయం లభించింది.

406 అడుగులకు చేరిన నీటిమట్టం

ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువనుంచి వస్తున్న వరద కారణంగా కిన్నెరసాని జలాశయం జలకళ సంతరించుకుంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్ నీటి మట్టం ఆదివారం 406 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్ట్ ఒక గేటు ఎత్తి 3 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీరు తెలిపారు. వరద ఉధృతి అధికంగా ఉండటంతో శనివారం రాత్రి మూడు గేట్లు ఎత్తి 8వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఆదివారం రెండు గేట్లను మూసివేశారు.

నిలిచిన రాకపోకలు

కిన్నెరసాని గేట్లు ఎత్తడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి పెరగడంతో ఆదివారం ఉదయం నుంచి నీటిని వదులుతున్నారు. సోమవారం ఉదయం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో రాజాపురం–యానంబైల్ చప్టా మునిగిపోయింది. యానంబైల్, ఉలవ్వనూరు, చంద్రాలగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని 20 గ్రామాలకు పైగా రాకపోకలు స్థంభించాయి. ఆటోలు మాత్రం డ్యామ్‌మీద నుంచి రాకపోకలు సాగించాయి.

406 అడుగులకు చేరిన రిజర్వాయర్ నీటిమట్టం



డీర్‌పార్కులోని చుక్కల దుప్పులను వీక్షిస్తున్న సందర్శకులు

రాజాపురం-యానంబైల్ చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు





కిన్నెరసానిలో నీటిమట్టం నిల్వ సూచిక



జలకళ సంతరించుకున్న కిన్నెరసాని రిజర్వాయర్

ప్రాజెక్ట్ వద్ద పర్యాటకులు



భద్రాద్రి కొత్తగూడెం । సోమవారం । ఆగస్టు । 21 । 2017 సాక్షి

‘ఎస్సార్పీ-3’లో కార్మికుడి దుర్మరణం

గనిలో టబ్బులు మీదపడి రాజయ్య మృతి ● అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం : కార్మిక సంఘాలు





రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) రాజయ్య మృతదేహం

శ్రీరాంపూర్(మంచిర్యాల జిల్లా): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ(శ్రీరాంపూర్)-3 భూగర్భ గనిలో టబ్బులు మీదపడి ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. తోటి కార్మికుల కథనం ప్రకారం.. చెన్నూరు సమీపంలోని ఎల్లక్కపేటకు చెందిన రత్న రాజయ్య(57)కోల్‌ఫిల్లర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి షిఫ్ట్ డ్యూటీకి వచ్చాడు. అతన్ని అధికారులు యాక్టింగ్ ట్రామర్‌గా పనులకు పురమాయించారు. దీంతో అండర్‌గ్రౌండ్‌లోని 6సీమ్ 17 లెవల్ 20 డిప్ 16 క్రాస్ కట్ వద్ద గల జంక్షన్‌లో ట్రామర్‌గా విధులకు వెళ్లాడు. ఆదివారం ఉదయం కొంతసేపు ఐతే పనులు పూర్తవుతాయన్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. పై నుంచి వచ్చిన టబ్బులను కింద ఉన్న ఖాళీ టబ్బులకు జతచేసి లైన్ మార్చే పనిలో నిమగ్నమై ఉండగా, ఒక్క సారిగా టబ్బులు జారీ అతనిపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఇతర కార్మికులెవరూ లేరు. కొద్ది సేపటికి సమీప లెవల్‌లో పని చేస్తున్న కార్మికులు అటు వెళ్తుండగా గమనించి అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రాజయ్యను టబ్బుల కింద నుంచి బయటికి తీసి. రామకృష్ణపూర్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రాజయ్య తలకు, ఛాతీ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మృతునికి భార్య రాజేశ్వరి, కుమారులు సత్యనారాయణ, సంతోష్, కూతురు సౌందర్య ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు పలువురిని కలచివేశాయి.

డిపెండెంట్ ఉద్యోగం ఇప్పిస్తాం

విషయం తెలుసుకున్న వెంటనే శ్రీరాంపూర్ జీఎం ఎస్‌డీఎం సుభాని, ఎస్‌ఓటుజీఎం వీపీ సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) చిత్తరంజన్‌కుమార్, ఏజెంట్ విజయ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ రమేష్, గని సంక్షేమ అధికారి రాజు ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రమాద వివరాలను తోటి కార్మికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బంటు సారయ్య, బండి రమేశ్, మహిపాల్‌రెడ్డి, పానుగంటి సత్తయ్య, నీలం సదయ్య, గోపాల్ ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామి ఇచ్చారు. కంపెనీ నుంచి వచ్చే నష్టపరిహారాలు, డిపెండెంట్ ఉద్యోగం త్వరగా ఇప్పిస్తామన్నారు.

అధికారులపై కేసులు పెట్టాలి: ఏఐటీయూసీ

వీటీసీలో శిక్షణ ఇవ్వకుండా రాజయ్యను యాక్టింగ్ ట్రామర్‌గా విధులకు పంపి అతని మరణానికి అధికారులు కారణమయ్యారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శులు ముస్కె సమ్మయ్య, పీ భానుదాస్, బ్రాంచి సెక్రెటరీలు ల్యాగల శ్రీనివాస్, కొట్టె కిషన్‌రావు, నాయకులు హన్మంతు, హెచ్ఎమ్మెస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు పేరం రమేశ్, కరీముల్లా, గోల్ల సత్యనారాయణ తదితరులు ఏరియా ఆస్పత్రి వద్దకు వచ్చి అధికారులపై మండిపడ్డారు. పని స్థలం వద్ద హ్యాండ్ లివర్లు, ఇతర రక్షణ పని ముట్లు లేవన్నారు. పోస్టుమార్టం కోసం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రి వద్దకు తీసుకువచ్చిన రాజయ్య మృతదేహాన్ని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి సీతారామయ్య సందర్శించారు. రక్షణ చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాద కారకులైన అధికారులపై డీజీఎంఎస్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్కే-5బీలో కార్మికుడికి తీవ్ర గాయాలు

పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు

శ్రీరాంపూర్(మంచిర్యాల జిల్లా): శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే-5బీ గనిలో ప్రమాదవశాత్తు యాక్టింగ్ ట్రామర్ దాసరి లచ్చయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కోల్‌ఫిల్లర్‌గా పని చేస్తున్న లచ్చయ్య శనివారం రాత్రి షిఫ్ట్ విధులకు హాజరయ్యాడు. ఆయన్ను అధికారులు యాక్టింగ్ ట్రామర్‌గా విధులకు పంపారు. భూగర్భ గనిలో 4సీమ్ నుంచి 3 సీమ్‌కు వెళ్లేందుకు 10 లెవల్ వద్ద టన్నెల్ కడుతున్నారు. బొగ్గు రవాణ కోసం ట్రాక్‌లైన్ వద్ద విధుల్లో ఉన్న లచ్చయ్యను తాడుతో కాకుండా జామ్‌లతో టబ్బులను పోనివ్వాలని అండర్ మేనేజర్ ఎల్లయ్య ఆదేశాలు ఇచ్చారు. అదే పనిలో ఉండగా ఒక్క సారిగా టబ్బులు జారడంతో వాటిని జామ్‌లతో ఆపబోతూ రోలర్‌పై పడ్డాడు. దీంతో అతని తలకు గాయమైంది. దవడ విరిగింది. వెంటనే ఆయన్ను తోటి కార్మికులు ఉపరితలానికి తీసుకువచ్చి అక్కడి నుంచి రామకృష్ణపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గని మేనేజర్ రాజేందర్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఫిట్‌సెక్రెటరీలు నీలం సదయ్య, మహేందర్‌రెడ్డి తదితరులు వైద్యులను ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు వెంటనే హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.

ఓసీపీ-3లో కాపర్ కేబుల్ చోరీ

ఇటీవల కాలంలో ఐదో ఘటన

యైటింక్లయిన్‌కాలనీ(పెద్దపల్లి జిల్లా): రామగుండం ఏరియా-2 పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో శనివారం రాత్రి కాపర్ కేబుల్ చోరీకి గురైంది. ప్రాజెక్టులోని డ్రిల్ యంత్రాలకు విద్యుత్ సరఫరా చేసే త్రీకోర్ ఆర్మ్‌డ్ కాపర్‌కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకుని ఎత్తుకెళ్లారు. దీంతో ప్రాజెక్టు క్వారీలోని మూడు డ్రిల్‌యంత్రాలు నిలిచిపోయాయి. గమనించిన అధికారులు ఆదివారం దొంగలించిన కాపర్ కేబుల్ స్థానంలో కొత్తదాన్ని అమర్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. చోరీకి గురైన కేబుల్ విలువ సుమారు రూ. 50వేల వరకు ఉంటుందని భావిస్తున్నారు. కాగా ఇటీవల కాలంలో జరుగుతున్న కాపర్ కేబుల్ చోరీ ఘటనల్లో ఇది ఐదోది.

స్పెషల్ అలవెన్స్‌కు ఒప్పుకోకుంటే సమ్మె

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్, గోదావరిఖని: ఈ నెల 17,18,19వ తేదీల్లో రాంచీలో జరిగిన జేబీసీసీఐ చర్చల్లో పూర్తి స్థాయిలో వేతన ఒప్పందం జరగలేదని, కేవలం మూల వేతనం పెంపుపై మాత్రమే అంగీకారం కుదిరిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి సీతారామయ్య తెలిపారు. ఆదివారం ఆయన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. బేసిక్, వీడీఏ, ఎస్‌డీఏ, క్వార్టర్లీ బోనస్‌ను కలుపుకుని 21 శాతం వేతనాల పెంపునకు అంగీకరించినట్లు తెలిపారు. డీపీఈ గైడ్‌లైన్స్ ప్రకారం ఏ ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులకైనా 15 శాతం మించి వేతనాలు పెంచరాదని కేంద్ర నిర్ణయం తీసుకుందని తొలుత యాజమాన్యం పేర్కొందని, అయితే తాము ఒప్పుకోలేదన్నారు. దీంతో యాజమాన్యం దిగి వచ్చి 21 శాతం పెంచేందుకు ఒప్పుకుందన్నారు. 9వ వేజ్‌బోర్డులో ఇచ్చిన 4 శాతం స్పెషల్ అలవెన్సును కూడా ఇందులో కలుపుకోవాలని ప్రతిపాదన చేయగా, తాము వ్యతిరేకించామని తెలిపారు. ఈ 4 శాతం అలవెన్సుపై ఈ నెల 24న ఢిల్లీలో సమావేశం జరగనుందన్నారు. ఇందులో 21 శాతంతో సంబంధం లేకుండా 4 శాతం స్పెషల్ అలవెన్సు ఇస్తేనే ఒప్పందంపై సంతకం చేస్తామని లేనియెడల సమ్మె నోటీసు ఇవ్వాలని జాతీయ సంఘాలన్ని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 21 శాతం వేతన పెంపు వల్ల మినిమం గ్యారెంటీ బెన్‌ఫిట్ 1వ కేటగిరీ కార్మికునికి రూ. 5140 వస్తుందన్నారు. వేజ్ బోర్డు ఒప్పందాల గురించి తెలియని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నాయకులకు తమను విమర్శించే అర్హత లేదన్నారు.

లాభాలు తక్కువ చేసి..

సింగరేణి యాజమాన్యం ఆర్థిక సంవత్సరం రూ.395.38 కోట్లు లాభాలు వచ్చాయని తక్కువ చేసి ప్రకటించిందని సీతారామయ్య ఆరోపించారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో 60.3 మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి చేస్తే రూ.1,066.13 కోట్ల లాభం వచ్చిందని, కానీ ఈసారి 61.34 మిలియన్ టన్నులు ఉత్పత్తి జరిగిందని, సింగరేణి పవర్‌హౌస్‌లో వచ్చిన రూ.235 కోట్లు కూడా కలిపారని, అలాంటి సమయంలో ఇంత తక్కువగా లాభం ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాల్సి వస్తుందనే కారణంతో లాభాలు తక్కువగా ప్రకటించిందని ఆరోపించారు. నాయకులు ముస్కె సమ్మయ్య, ల్యాగల శ్రీనివాస్, కొట్టె కిషన్‌రావు, వేణుమాధవ్, భీంరాజు, మిర్యాల రంగయ్య, డి.శేషయ్య, వేల్పుల నారాయణ, మడ్డి ఎల్లయ్య పాల్గొన్నారు.

‘1997’ డిపెండెంట్లకు న్యాయం చేయాలి

రుద్రంపూర్(భద్రాద్రి కొత్తగూడెం): 1997 డిపెండెంట్లకు న్యాయం చేయాలని డిపెండెంట్ ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న తెలంగాణ తల్లి చమన్‌లో ఆదివారం వీఆర్ఎస్ ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం తమను ఉద్యోగాలకు ఎంపికచేసి మెడికల్ టెస్ట్‌కు పంపించి, ఫిట్ ఆర్డర్ కూడా అందజేసి, ఉద్యోగాలు ఇచ్చినట్లే ఇచ్చి మరలా ఉద్యోగాలు జీవో మారిందని ఉద్యోగాలు లేవని చెప్పి తమకు తీవ్రంగా అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిపెండెంట్ ఫోరం నాయకులు వల్లాల వెంకటేశ్వర్లు, ఆవుల అంజయ్య, కూరపాటి భాస్కర్, సారయ్య, అనుమాల రవికుమార్, జి మదన మోహన్, వెంకటరాజం, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

28 ఏళ్లుగా ఒకే డిజిగ్నేషన్

ప్రమోషన్ కల్పించాలని కార్మికుడి వేడుకోలు



చాల్లేటి దేవేందర్

రుద్రంపూర్(భద్రాద్రి కొత్తగూడెం): సింగరేణిలో ఓ కార్మికుడు 28 సంవత్సరాలుగా ఒకే డిజిగ్నేషన్‌లో కొనసాగుతున్నాడు. కనీసం సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్, అలవెన్స్‌లు కూడా రావడంలేదు. ఏరియాలోని కొందరు అధికారులు పదోన్నతిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నాడు. బాధితుడు చాల్లేటి దేవేందర్ (ఈసీ నంబర్ 4030073) తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 1989 సంవత్సరంలో కేటగిరీ-1 (ఎలక్ట్రీషియన్ ట్రైనీగా) మణుగూరు ఏరియాలోని ప్రకాశంఖని-2 ఇంక్లైన్‌లో ఉద్యోగంలో చేరాడు. 1991లో గోదావరిఖనికి, అక్కడి నుంచి 1995లో కొత్తగూడెం ఏరియాకు బదిలీపై వచ్చాడు. ఈ క్రమంలో 2013 సంవత్సరంలో రోడ్డు ప్రమాదానికి గురై కుడికాలు రెండు వేళ్లు విరిగిపోయాయి. దీంతో 9 నెలలు సిక్‌లోనే ఉన్నాడు. అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు దరఖాస్తు పెట్టుకోగా డిప్యూటేషన్‌పై ఏరియా వర్క్‌షాప్‌నకు పంపించారు. ఈ క్రమంలో ప్రతిమూడు నెలలకు ఒక పర్యాయం ఎక్స్‌టెన్సన్ (పొడిగింపు) ఇస్తున్నారు. కాలుకు దెబ్బతగిలి ఉండటంతో భూగర్భ గనిలో పనిచేయలేనని, తనను సర్ఫేస్‌కు బదిలీ చేయాలని ఎన్నోమార్లు వేడుకున్నా అధికారులు కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 2000 సంవత్సరం నుంచి వరుసగా తనకంటే జూనియర్స్‌కు, సబ్‌జూనియర్స్‌కు ప్రమోషన్‌లో అవకాశం కల్పించారు కానీ, తనకు మాత్రం అవకాశం కల్పించలేదని వాపోతున్నాడు.

గ్రేడ్స్‌కూడా రాకుండా నిలుపుదల చేశారు

2000 సంవత్సరం నుంచి వరుసగా నాలుగుసార్లు ఈపీ ఎలక్ట్రీషియన్ పరీక్ష రాశాను. ప్రాక్టికల్ పరీక్షలో సైతంనైపుణ్యాన్ని కనబరిచాను. నాకు సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్ పాలసీ ప్రకారం ప్రతి ఏడు సంవత్సరాలకు గ్రేడ్ మారుస్తూ, ప్రమోషన్ కల్పించి వేతనంలో కూడా కొంత మార్పు చేయాలి. 2000 సంవత్సరంలో డీ గ్రేడ్, 2007లో సీ గ్రేడ్, 2014లో బీ గ్రేడ్ రావాల్సిఉంది. నా కంటే జూనియర్స్‌కు, సీనియర్స్‌కు అండర్‌గ్రౌండ్‌లో పనిచేసేవారికి విధిగా ప్రమోషన్‌లు వస్తున్నాయి. నున్న మాత్రం ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఒకే గ్రేడ్‌లో పనిచేయిస్తున్నారు. సింగరేణి డైరెక్టర్లకు ఎన్నోమార్లు విన్నవించా. **– దేవేందర్**

రామా ఇదెక్కడి చోద్యం..!

ప్రసాదాల ధరల పెంచే ప్రయత్నం ● కల్యాణ లడ్డూ మళ్లీ తయారీ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో లడ్డూ ప్రసాదాల ధరలను పెంచుతున్నట్లు దేవస్థానం ఈఓ ప్రభాకర శ్రీనివాస్ ప్రకటించారు. 80 గ్రాముల పరిమాణం గల చిన్న లడ్డూను ప్రస్తుతం రూ.15లకు విక్రయిస్తున్నారు. దీన్ని 100 గ్రాములతో తయారు చేసి రూ.20లకు విక్రయించాలని నిర్ణయించారు. గతంలో అందుబాటులో ఉన్న 400 గ్రాముల పరిమాణం గల కల్యాణం లడ్డూను ఈఓ ప్రభాకర శ్రీనివాస్ పూర్తిగా తొలగించారు. కాగా ఆ లడ్డూను మళ్లీ తయారు చేయిస్తామని ప్రకటించారు. ఈ సారి కల్యాణ లడ్డూను 500గ్రాములతో తయారు చేసి, రూ.100లకు విక్రయించనున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో ధరల పెంపు, జీఎస్టీ ప్రభావంతో లడ్డూ ప్రసాదాల ధరలను పెంచాలనే ప్రతిపాదనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. అయితే ప్రసాదాల ధరల పెంపుపై భక్తుల నుంచి అభిప్రాయాలు కోరుతున్నట్లు ప్రకటించారు. భక్తులు పది రోజుల్లోగా ధరల పెంపుపై లిఖిత పూర్వకంగా తమ అభిప్రాయాలను దేవస్థానం కార్యాలయంలో అందజేయాలన్నారు. భక్తుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు లేకుంటే ధరలను పెంపును అమలు చేస్తామని తెలిపారు.

గతంలో నిలిపివేసి..

దేవస్థానం ఈఓ ప్రభాకర శ్రీనివాస్ ఇక్కడ విధుల్లో చేరిన తరువాత లడ్డూ ప్రసాదాల ధరలను పెంచటంతో పాటు, కల్యాణం లడ్డూ తయారీని పూర్తిగా నిలిపివేశారు. దీనిపై భక్తులతో పాటు పలు ఆధ్యాత్మిక సంస్థల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. 400 గ్రాముల కల్యాణ లడ్డూ గతంలో రూ.50 లు ఉండేది. స్వామి వారి నిత్య కల్యాణం చేయించుకునే భక్తులకు కూడా దీనినే ఇచ్చేవారు. కల్యాణ లడ్డూ ప్రసాదాన్ని కొనుగోలు చేసేందుకు భక్తులు ఎంతో ఆసక్తి కనబరిచేవారు. కానీ నష్టం వస్తుందనే సాకుతో తయారీ నిలిపివేశారు. ఈ లడ్డూకు బదులుగా స్వామి వారి నిత్యకల్యాణంలో పాల్గొనే భక్తులకు 300 గ్రాముల పరిమాణంతో కూడిన లడ్డూను ప్రస్తుతం ఇస్తున్నారు. భక్తుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, తిరిగి కల్యాణ లడ్డూ తయారీకి సిద్ధమయ్యారు. 500 గ్రాముల పరిమాణంలో తయారు చేసి, రూ.100లకు విక్రయించనున్నట్లు ప్రకటించారు. దీనిపై భక్తుల నుంచి ఎటువంటి స్పందన వస్తుందనేది వేచి చూడాల్సి ఉంది. ఈఓ శ్రీనివాస్ ఇక్కడ విధుల్లో చేరిన వంద రోజుల వ్యవధిలోనే స్వామి వారి లడ్డూ ప్రసాదాల ధరలు, పరిమాణం విషయంలో నిర్ణయాలను మార్పు చేసుకోవటంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. రామాలయంలో పెళ్లిళ్లు చేసుకోకూడదని నిర్ణయాన్ని ప్రకటించటంపై కూడా భక్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈఓ శ్రీనివాస్ దీనిపై కూడా తిరిగి పునరాలోచన చేస్తారా..? అనేది భక్తుల్లో చర్చసాగుతోంది.

మంత్రి తుమ్మలను పరామర్శించిన ట్రైకార్ చైర్మన్

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, అశ్వారావుపేట ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఇటీవల మంత్రి తుమ్మల అస్వస్థతకు గురై హైదారాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న సంగతి తెలిసిందే. కాగా భద్రాచలం సీతారాముల ఆలయంలో మంత్రి తుమ్మల త్వరగా కోలుకోవాలని, ఆయన ఆరోగ్యం మెరుగు కావాలని కోరుతూ ప్రత్యేక పూజలు జరిపించి ఆదివారం లడ్డూ ప్రసాదాన్ని మంత్రికు అందించారు. ఎమ్మెల్యేతోపాటు టీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు పడిదాల నవీన్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు మోటురి మోహన్‌తోపాటు పలువురు ఉన్నారు.



మంత్రి తుమ్మలతో ట్రైకార్ చైర్మన్ తాటి తదితరులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు



ర్యాలీ నిర్వహిస్తున్న డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు

కూసుమంచి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మువ్వా విజయ్‌బాబు అన్నారు. ఆదివారం హరిత హారం కార్యక్రమంలో భాగంగా కూసుమంచి, నేలకొండపల్లి రహదారికి ఇరువైపులా చైర్మన్‌తో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రెండు జిల్లాల బ్యాంక్ మేనేజర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఆధ్వర్యంలో గత ఏడాది ఖమ్మం పట్టణంలో ఓ వీధి దత్తత తీసుకుని మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ ఏడాది పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి రహదారిని దత్తత తీసుకున్నట్లు చెప్పారు. మూడు కిలోమీటర్ల మేర మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తమ సిబ్బందేనన్నారు. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. హరిత తెలంగాణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తొలుత కూసుమంచి నుంచి మొక్కలు నాటే స్థలం వరకు సిబ్బంది, స్థానిక నేతలతో కలిసి ర్యాలీ చేపట్టారు. నాటిన మొక్కలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఇతర ప్రజాప్రతినిధుల పేర్లతో ఉన్న బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మా పాలేరు డివిజన్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, కూసుమంచి, నేలకొండపల్లి ఎంపీపీలు రామసహాయం వెంకటరెడ్డి, నందిగాం కవితారాణి, జడ్పీటీసీ వడ్త్యి రాంచంద్రు నాయక్, సీడీసీ చైర్మన్ జూకూరి గోపాలరావు, కల్లూరిగూడెం, జక్కేపల్లి సహకార సంఘాల అధ్యక్షులు వెల్లంపల్లి అశోక్, పగడాల చంద్రారెడ్డి, కార్పొరేటర్ ధరావత్ రామ్మూర్తి, వైస్ ఎంపీపీ బారి శ్రీను, డీసీసీబీ సీఈఓ నాగచెన్నారావు, జీఎం వసంతరావు, డీజీఎంలు ఆనందరావు, వెంకటేశ్వరరావు, పద్మావతి, ఉదయకుమారి, ఏజీఎంలు అంజని రెడ్డి, సర్వేశ్వరరావు, ప్రవీణ్, అటవీశాఖ అధికారి మంజులతో పాటు పలువురు టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న విజయ్‌బాబు

పైసా వసూల్.. పరార్

అసిస్టెంట్ ప్రొఫెసర్‌నని చెప్పకుని అమాయకులకు టోకరా

అనుమతులు లేకుండానే ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాల బోర్డు

వసూళ్లకు పాల్పడి ఉడాయించిన 'విజ్ఞాన్ భారతి' నిర్వాహకుడు



విజ్ఞాన్ భారతి అకాడమీ ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీ పేరుతో ఇచ్చిన రశీదు

ఖమ్మం:

పదో తరగతి, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులను పాస్ చేస్తానని చెప్పి కోట్లు కొల్లగొట్టి ఉడాయించిన విజ్ఞాన్ భారతి అకాడమీ నిర్వాహకుడు సత్తిరెడ్డి మోసాల్లో రోజురోజుకు కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. ఏకంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ అవతారం ఎత్తిన అతడు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్, బోర్డు ఆఫ్ ఎస్‌ఎస్‌సీలో చక్రం తిప్పుతానని మాయ మాటలు చెప్పి అమాయకుల నుంచి సొమ్ములు వసూళ్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాను నిర్వహించే అకాడమీలో ఇంటర్, డిగ్రీ పీజీ కళాశాల ఉన్నట్లు ఏకంగా బోర్డు పెట్టడం ప్రస్తుతం చర్చానీయాంశంగా మారింది. పదో తరగతి పరీక్షలు, ఇంటర్ పరీక్షల సమయంలో మొదలుపెట్టిన ఈ అకాడమీ కొద్దిమార్కులతో పాసైన విద్యార్థులనే టార్గెట్‌గా చేసుకుని పైసల వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. కాకతీయ యూనివర్సిటీలో గతంలో గైడ్‌గా పనిచేసిన సత్తిరెడ్డి అకాడమీ ఏర్పాటు చేసిన తర్వాత తన వద్దకు వచ్చిన వారికి తాను అసిస్టెంట్ ప్రొఫెసర్‌నని, ఇంటర్, టెన్త్ బోర్డులలో తనకు అనేక మంది తెలిసిన వాళ్లు ఉన్నారని, వారితో మాట్లాడి పాస్ సర్టిఫికెట్లు ఇప్పిస్తానని చెప్పి మోసాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. రీ వాల్యువేషన్ పేరిట దరఖాస్తు చేయించి మార్కులు కల్పిస్తానని వారి వద్దనుంచి వసూళ్లకు పాల్పడ్డాడు. కేవలం పదిహేను రోజుల్లోనే పాస్ మార్కులు వస్తాయని చెప్పినప్పటికీ మూడు నెలలు గడుస్తున్నా పాస్ సర్టిఫికెట్లు రాకపోవడంతో డబ్బులు కట్టిన వారి నుంచి ఒత్తిడి రావడంతో సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉడాయించినట్లు తెలుస్తోంది.

అనుమతులు లేకుండానే కళాశాల పేరుతో బోర్డులు

అనేక అవతవకలకు పాల్పడిన సత్తిరెడ్డి అసలు ఎలాంటి అనుమతులు లేకుండానే ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాల పేరుతో బోర్డులు, రశీదులు ఇవ్వడం గమనార్హం. విజ్ఞాన్ భారతి అకాడమీ అండ్ ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజ్ పేరిట రశీదులు ఇచ్చాడు. అకాడమీతోపాటు కాలేజీలు సైతం ఉన్నాయని నమ్మిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పని అవుతుందనే నమ్మకంతో సొమ్ములు చెల్లించుకున్నట్లు తెలుస్తోంది. ఈ అకాడమీకి సంబంధించిన కళాశాల అనుమతులపై ఆర్ఐవో ఆంద్రూస్‌ను 'సాక్షి'వివరణ కోరగా.. విజ్ఞాన్ భారతి అకాడమీ పేరుతో అసలు కళాశాలలు లేవని తెలిపారు. సత్తిరెడ్డి చేసిన అక్రమాలపై పోలీసులు విచారణ వేగవంతం చేసి తమకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తల్లి మరణం సాకుతో..

విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి సొమ్ములు వసూళ్లు చేసిన సత్తిరెడ్డి రెండు నెలలు గడిచిన తర్వాత వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో 'తన తల్లి మరణించిందని.. తాను ఆ బాధలో ఉన్నానని'చెబుతూ మానవీయ కోణంలో సుమారు పదిహేను రోజుల పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు, అకాడమీలో పనిచేస్తున్న సిబ్బందిని నమ్మించినట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. ఆ తర్వాత నేరుగా అకాడమీ ఏర్పాటు చేసిన అన్ని శాఖలలో పనిచేసే వారికి తమ సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేయాలని ఆదేశాలు జారీ చేసి ఆ తర్వాత కార్యాలయాలను మూసివేసినట్లు తెలుస్తోంది.



వెండితెర



తెలుగు:
నిన్నుకోరి : మహేశ్వరి, ఎ/సి, డీటీ ఎస్ (కొత్తగూడెం), శమం తకమణి: విశ్వరూపా, డీటీఎస్ (కొత్తగూడెం). ఫిదా: దుర్గా, ఎ/సి, డిటిఎస్ (కొత్తగూడెం), జయ జానకి నాయక: శ్రీవెంకటేశ్వర, (పాల్వంచ), డీజే: శ్రీపూర్ణ (కొత్తగూడెం), నేనే రాజు నేనే మంత్రి: వేణుగోపాల్ (పాల్వంచ), లై: శాంతి, (పాల్వంచ), దండుపాల్యం–2: పరమేశ్వరి (కొత్తగూడెం)

హన్మంతు భౌతికకాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామ ఉపసర్పంచ్, టీఆర్ఎస్ నాయకుడు నిమ్మటూరి కనకయ్య తండ్రి నిమ్మటూరి హన్మంతు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. హన్మంతు భౌతిక కాయాన్ని వైరా ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ సందర్శించి, తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీపీ మూడు చిట్టిబాబు, అధ్యక్షుడు చావా వెంకటరామారావు, ప్రధానకార్యదర్శి రాంశెట్టి రాంబాబు, నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, యల్లంకి సత్యనారాయణ, వేల్పుల నరసింహారావు ఉన్నారు.

నాగేశ్వరరావు మృతి తీరని లోటు

పాల్వంచ: కేటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికుడు కేశబోయిన నాగేశ్వరరావు మృతి తీరని లోటని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీడీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి బ్రహ్మయ్యలు అన్నారు. ఆదివారం స్థానిక వర్తక సంఘ భవనంలో నాగేశ్వరరావు సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, సత్తెనపల్లి వెంకన్న, కేశబోయిన కోటేశ్వరరావు,టీడీపీ నాయకులు కాపా కృష్ణమోహన్, ఎంపీపీ అరుణ, వడ్లమూడి సీపీఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, ఆదాం పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

చుంచుపల్లి: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దబడతారని ప్రముఖ ప్రకృతి వైద్యుడు కె.రామచంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానగర్‌లో సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సదస్సు పాల్గొని ప్రసంగించారు. జి,పద్మ, నీరుకొండ హనుమంతరావు,యోగా మాస్టార్ కె.కమలారాణి, అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నాబరు.

అనాథాశ్రమంలో అన్నదానం

పాల్వంచ: స్థానిక అనాథాశ్రమంలో మెగాస్టార్ చిరంజీవి 62వ జన్మదినం పురస్కరించుకుని మెగాఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఖాసీం ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నాదానాన్ని ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, ఖాసులు, మహబూబ్, సలీం, మౌలా, భాను పాల్గొన్నారు.

కాకర్లలో బోనాలు

జూలూరుపాడు: మండలంలోని కాకర్లలో ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తగూడెం, పాల్వంచ, జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కేక్‌లు కట్ చేశారు. రాజీవ్‌గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవల గుర్తు చేసుకున్నారు.

–సుజాతనగర్/ పాల్వంచ/ జూలూరుపాడు



రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ మంత్రి వనమా

జూలూరుపాడు బస్‌స్టాండ్ సెంటర్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో వైరా నియోజక వర్గ నాయకుడు లాకావతు గిరిబాబు, చౌడం నరసింహారావు, పొన్నెకంటి వీరభద్రం, దుద్దుకూరి శ్రీనివాసరావు, రోకటి సురేష్ పాల్గొన్నారు.

పాల్వంచ.. పాల్వంచలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, కాల్వ ప్రకాష్ రావు, మిరియాల కమలాకర్, కోటేశ్వరరావు, బేతంశెట్టి విజయ్ పాల్గొన్నారు.

ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తురక లక్ష్మయ్య, వసంతరావు, అక్కినేని శ్రీను, ఎస్‌కె.చాంద్‌పాషా, గుడి రమేష్, దాసరి ఆనందరావు పాల్గొన్నారు.

పట్టణంలో జరిగిన కార్యక్రమంలో వనమా రాఘవేంద్రరావు, ఎం.ఎ.రజాక్ కరాటే రామస్వామి, బత్తుల వీరయ్య పాల్గొన్నారు.

ఎడవల్లి కృష్ణ యువసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూరిబాబు, రాజు, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి ఓంప్రకాష్, ఏలూరి రాజేష్, నవతన్, సురేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డును పరామర్శించిన ఎస్పీ

కొత్తగూడెంక్రైం: ప్రమాదంలో గాయపడిన హోంగార్డును జిల్లా ఎస్పీ అంబర్‌కిషోర్ ఝా ఆదివారం పరామర్శించారు. పట్టణ పరిధిలోని బాబుక్యాంపునకు చెందిన హోంగార్డు శివ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. అతని ఎడమకాలు విరిగింది. దీంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరు, పొందుతున్న వైద్యం గురించి శివను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలి

కొత్తగూడెంటౌన్: విద్యార్థి దశ నుంచి కష్టపడి చవువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని సుబోదిని కోచింగ్ సెంటర్ డైరక్టర్ కాళేశ్వర్‌రావు అన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఆదివారం పోస్టాపీస్ సెంటర్లోని కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఫారెస్టు ఉద్యోగాల కోసం అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సదస్సులో విద్యార్థులు అడిగిన సందేహాలకు అధ్యాపక బృందాలు రాధాకృష్ణ,(ఖమ్మం), హరి(తిరుపతి), లక్ష్మణ్(కరీంనగర్), నారాయణ(విశాఖ),మాధవ్(మహబూబ్‌నగర్), జయరాజ్(భద్రాచలం), రమేష్(గుంటూర్) సమాధానాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కేశవ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో తెరుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెంటౌన్: సెలవు రోజుల్లో కూడా ప్రైవేట్ పాఠశాలలు తరగతులను నిర్వహిస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భూక్య మంగీలాల్ డిమాండ్ చేశారు. ఆదివారం టీఎస్ఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భానోతురవి,చంటి,రాజా, శేఖర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు

పాల్వంచ: నెల రోజులుగా స్థానిక గాంధీనగర్‌లో గల శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి.

ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి బియ్యం, పప్పు, బెల్లం, పసుపు, కుంకుమ సేకరించి ఒక మట్టి కుండలో వండి ఉమ్మడి బోనం తయారు చేశారు. అనంతరం బోనాన్ని నెత్తిన పెట్టుకుని మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలతో ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వచ్చి అమ్మవారికి సమర్పించారు. పూజారి గడ్డం భాస్కర్ రావు, ఆలయ ధర్మకర్త గంగపురి నాగేశ్వర రావు, కొత్తపల్లి సోమయ్య, కేసుపాక వెంకటేశ్వర్లు, దాట్ల బాలయ్య, ఎర్ర మల్లయ్య పాల్గొన్నారు.

Zone Guide

నేడు రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

సుజాతనగర్: రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సుజాతనగర్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సంఘం మండల కార్యదర్శి గూని అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జీఎన్‌ఎం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రంపూర్: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తగూడెంలోని సింగరేణి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో జీఎన్ఎం కోర్సు చదివేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ఆదరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డౌన్‌లోడ్ కాపీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయానికి సెప్టెంబర్ 23వ తేదీలోగా పంపించాలని సూచించారు.

బదిలీ వర్కర్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

కొత్తగూడెం: సింగరేణిలో ఇటీవల బదిలీ వర్కర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కాగా.. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కొత్తగూడెంలోని ఎస్‌వీఎస్ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ నిర్వాహకులు బానోతు బలరాం ప్రకటనలో తెలిపారు. ఎస్‌టీ అభ్యర్థులకు ఈ ఫ్రీకోచింగ్ ఇవ్వడం జరుగుతుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9951993161ను సంప్రదించాలని సూచించారు.

డ్రైవర్ల సర్వీసును క్రమబద్ధీకరించాలి

పాల్వంచ: కేటీపీఎస్ ప్లాంట్‌లో విలీన ప్రక్రియలో డ్రైవర్ల జాబితాను పెట్టి వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీడీపీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తుళ్లూరి బ్రహ్మంలు అన్నారు. ఆదివారం వెంగళరావు కాలనీలో గుండెపోటుతో మృతి చెందిన సయ్యద్ రఫీ బౌతికాయాన్ని వారు సందర్శించారు.

కుటుంబాన్ని ఆదుకోవాలని జెన్‌కో డైరెక్టర్ సి. రాధకృష్ణ, సీఈ టీఎస్ఎన్ మూర్తిలతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, బ్రహ్మం, శేఖర్, ఫణి, కిట్టు, కాపా కృష్ణమోహన్, పూర్ణచందర్‌రావు, ముత్యాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సుజాతనగర్: మండల పరిధిలోని నాయకులగూడెం గ్రామంలోని ఓ రేషన్ దుకాణం సమీపంలోని గదిలో అక్రమంగా నిల్వవుంచిన 20 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని కొత్తగూడెం సివిల్ సప్లై అధికారులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. నాయకులగూడెంలోని వొడుగు సీతారాములు ఇంట్లో అక్రమంగా సుమారు 20 క్వింటాళ్ల బియ్యంను నిల్వ చేశారు. సమాచారం తెలుసుకున్న సివిల్ సప్లై డీటీ జి.శివకుమార్ తనిఖీలు చేసి బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు.

గంగానదిలో నీటిని శుభ్రపరుస్తున్న బ్యాక్టీరియా ఏది?



డాక్టర్ డి. సమ్మయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

జనరల్ స్టడీస్
బయాలజీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలు ఏవి?
1) చేపలు 2) ఉభయచరాలు
3) సరీసృపాలు 4) క్షీరదాలు

2. కింది వాటిలో ఉష్ణరక్త జీవులు ఏవి?
1) ఎగిరే బల్లి, పక్షి 2) పక్షి, గోదురుకప్ప
3) గోదురుకప్ప, కుందేలు
4) కుందేలు, పావురం

3. భూమిపై నివసించిన తొలి జీవులుగా వేటిని పరిగణిస్తారు?
1) తొండలు 2) సర్పాలు
3) కప్పలు 4) డిప్నాయ్

4. కాలేయం.. ఆహారాన్ని ఏ రూపంలో నిల్వ చేస్తుంది?
1) గ్లూకోజ్ 2) గ్లైకోజన్
3) ఆల్బుమిన్ 4) ఎ.టి.పి.

5. మానవుడిలో ఆహారం శ్వాసనాళంలోకి ప్రవేశించకుండా నిరోధించేది ఏది?
1) స్వరపేటిక 2) గ్రసని
3) కంఠబిలం 4) ఉపజిహ్వ

6. జీర్ణక్రియ, శోషణం జరిపే ఆహారనాళ భాగం ఏది?
1) జీర్ణాశయం 2) పేగు
3) పురీషనాళం 4) ఆస్య కుహరం

7. చిన్న పిల్లల్లో జీరాప్థాల్మియా, పెద్దవారిలో నిక్టోలోపియా(రేచీకటి) ఏ విటమిన్ లోపం వల్ల కలుగుతాయి?
1) డి 2) ఎ 3) ఇ 4) కె

8. వివిధ కర్బన పదార్థాల్లో అత్యంత ఎక్కువ శక్తినిచ్చేవి ఏవి?
1) ప్రొటీన్లు 2) పిండి పదార్థాలు
3) విటమిన్లు 4) లిపిడ్లు

9. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ప్లీహంను రక్తం నిల్వ చేసే రిజర్వాయర్‌గా పేర్కొంటారు
బి) ఇది ఆర్.బి.సి., డబ్ల్యు.బి.సి.లను ఉత్పత్తి చేస్తుంది
సి) వృద్ధ, మృత ఆర్.బి.సి.లను నాశనం చేయడం వల్ల ప్లీహంను 'ఎర్రరక్త కణాల గ్రేవ్‌యార్డ్' అని పిలుస్తారు
1) ఎ, బి సరైనవి 2) ఎ, సి సరైనవి
3) సి మాత్రమే సరైంది
4) ఎ, బి, సిలు సరైనవే

10. గుండె పోషణకు, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమని ఏది?
1) పుపుస ధమని 2) కరోనరీ ధమని
3) వృక్క ధమని 4) మహా ధమని

11. కంట్లోకి కాంతి ప్రవేశించకుండా నియంత్రించేది?
1) ప్యూపిల్ 2) బ్లైండ్‌స్పాట్
3) ఐరిస్ 4) దృఢస్తరం

12. అడ్రినలిన్ హార్మోన్ దేన్ని పెంచుతుంది?
1) హృదయ స్పందన 2) రక్తపీడనం
3) 1, 2 4) ఏదీ కాదు

13. స్త్రీ బీజ కోశ హార్మోన్లు ఏ రకానికి చెందినవి?
1) ప్రొటీన్లు 2) స్టిరాయిడ్లు
3) పాలీశాఖరైడ్లు 4) లిపిడ్లు

14. కింది వాటిలో పరస్పర వ్యతిరేక ధర్మాన్ని కలిగి ఉన్న హార్మోన్లు ఏవి?
1) ఇంటర్ మిడిన్, ఇన్సులిన్
2) ఇన్సులిన్, గ్లూకగాన్
3) గ్లూకగాన్, ఎడ్రినలిన్
4) ఎడ్రినలిన్, ఇంటర్‌మిడిన్

15. మూత్రంలో యూరియాను విసర్జించే జంతువు ఏది?
1) స్పిర్నా 2) అంబ్లిస్టోమా
3) కంగారు 4) డ్రాకో

16. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
1) నలుపు రంగు 2) పడగ
3) రాళ్లల్లో నివసించడం వల్ల
4) పడగ, మూడో అధిపృష్ఠ పొలుసు

17. బాతు ముక్కు(డక్ బిల్ల్) ప్లాటిపస్ అనేది..?
1) విలుప్త సరీసృపం 2) పక్షి
3) మంచినీటి చేప 4) క్షీరదం

18. స్వేద గ్రంథులు లేని క్షీరదం ఏది?
1) కోతి 2) ఆవు
3) తిమింగలం 4) పంది

19. ముంజేతిని కదిపే కండరాలు ఏవి?
1) నునుపు కండరాలు
2) రేఖిత కండరాలు
3) హృదయ కండరాలు 4) ఏదీకాదు

20. జతపరచండి.

a) కుంతకాలు	i) 4		
b) రదనికలు	ii) 8		
c) అగ్ర చర్వణకాలు	iii) 8		
d) చర్వణకాలు	iv) 10		
	v) 12		

	a	b	c	d
1)	ii	i	iii	v
2)	i	ii	iii	iv
3)	i	iii	v	iv
4)	iv	v	iii	ii

21. జతపరచండి.

a) పుర్రె ఎముకలు	i) 18
b) కపాల ఎముకలు	ii) 22
c) పక్కటెముకలు	iii) 24
d) రెండు కాళ్ల ఎముకలు	iv) 30
	v) 60

	a	b	c	d
1)	ii	i	iii	v
2)	ii	i	v	i
3)	i	ii	iii	iv
4)	iii	ii	iv	v

22. రెండు ఎముకలను, ఎముకను కండరాలతో కలిపి ఉంచే నిర్మాణాలు వరుసగా..?
1) లిగమెంట్, టెండాన్స్
2) టెండాన్స్, లిగమెంట్
3) కీలు, సహనోవియల్ ద్రవం
4) శోషరసం, నరాలు

23. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) కార్నివోర్స్ – మాంసాహారులు
బి) శాంగ్వివోర్స్ – రక్తాన్ని పీల్చేవి
సి) సూడో రూమినేట్ – కల్లుతున్న సేంద్రియ పదార్థాలను గ్రహించేది
1) ఎ, బి
2) ఎ, సి 3) సి మాత్రమే
4) ఎ, బి, సి

24. డెంగీ వ్యాధికి గురైన వారి రక్తంలో ఏ రక్తకణాల సంఖ్య తగ్గుతుంది?
1) ఆర్.బి.సి. 2) డబ్ల్యు.బి.సి
3) ప్లేట్‌లెట్స్ 4) పైవన్నీ

25. జతపరచండి.

తెల్ల రక్తకణాలు	ఇతర పేర్లు
a) ఇసినోఫిల్స్	i) వ్యాధినిరోధక శక్తి
b) బేసోఫిల్స్	ii) యాంటీ అలర్జీ సెల్స్
c) న్యూట్రోఫిల్స్	iii) మైక్రో పోలీస్‌మెన్
d) లింపోసైట్స్	iv) గాయాలను మాన్పడం
	v) బ్లడ్ కేన్సర్‌కు కారణం

1) a-ii, b-iv, c-iii, d-i
2) a-i, b-ii, c-iii, d-v
3) a-iii, b-ii, c-i, d-iv
4) a-v, b-iv, c-iii, d-ii

26. విసర్జించిన మూత్రం వెంటనే ఎలాంటి వాసన రాదు. కానీ కొంత సమయం తర్వాత వాసన రావడానికి కారణం?
1) మూత్రంలోని యూరియా.. యూరికామ్లంగా మారడం
2) మూత్రంలోని యూరియా.. బాక్టీరియా వల్ల అమ్మోనియా మారడం
3) బాక్టీరియా వల్ల యూరియా.. యూరికామ్లంగా మారడం
4) యూరికామ్లం.. యూరియాగా మారడం

27. జతపరచండి.

శరీర భాగాలు	అధ్యయనం
A) హృదయం	i) ప్రినాలజీ
B) మెదడు	ii) నెఫ్రాలజీ
C) కాలేయం	iii) హెపటాలజీ
D) ఊపిరితిత్తులు	iv) పల్మనాలజీ
	v) కార్డియాలజీ

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	v	i	iii	iv
3)	ii	iii	iv	v
4)	iii	iv	v	ii

28. బొద్దింక ఆర్థ్రోపోడా వర్గానికి చెందుతుందని తెలియజేసేవి?
1) స్పర్శశృంగాలు 2) రెక్కలు
3) వివృత రక్తప్రసరణ వ్యవస్థ
4) అతుకుల కాళ్లు

29. కింది వాటిలో రక్తాన్ని పీల్చే రెక్కలు లేని బాహ్య పరాన్న జీవి అయిన కీటకం ఏది?
1) పెడిక్యులస్ 2) దోమ
3) టిక్ 4) మైట్స్

30. కింది వాటిలో మానవుడికి మేలు చేసే కీటకాలు ఏవి?
1) తేనెటీగ, మిడత, లక్క కీటకం
2) పట్టు పురుగు, తేనెటీగ, తూనీగ, మిడత
3) లక్క కీటకం, పట్టుమాత్, తేనెటీగ
4) రైస్ వీవిల్, పట్టుమాత్, తేనెటీగ

31. ముత్యపు చిప్ప శాస్త్రీయ నామం ఏది?
1) సింక్టాడ 2) నియోఫిలైన
3) నాటిలస్ 4) జాంకస్

32. కింది వాటిలో పరాన్న జీవులు లేని వర్గం?
1) పొరిఫెరా 2) మలస్కా
3) అనిలెడా 4) ఇకైనోడర్మేటా

33. ముఖబాహ్య జీర్ణక్రియ కలిగిన జీవి ఏది?
1) సముద్ర నక్షత్రం 2) బొద్దింక
3) జలగ 4) పైలా

34. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) ఏనుగు గర్భావధి కాలం – 600 రోజులు
బి) మానవుడి గర్భావధి కాలం – 280 రోజులు
సి) అపోజం గర్భావధి కాలం – 21 రోజులు
1) ఎ, బి 2) ఎ, సి
3) సి మాత్రమే 4) ఎ, బి, సి

35. ఆహార గొలుసులోని వివిధ పోషక స్థాయిలకు సంబంధించి కింది వాటిలో సరైన వరసక్రమం ఏది?
1) ఉత్పత్తి దారులు– ద్వితీయ వినియోగదారులు – విచ్ఛిన్నకారులు – ప్రాథమిక వినియోగదారులు
2) ఉత్పత్తి దారులు–ప్రాథమిక వినియోగదారులు – ద్వితీయ వినియోగదారులు – తృతీయ వినియోగదారులు
3) ప్రాథమిక వినియోగదారులు – ఉత్పత్తి దారులు – విచ్ఛిన్నకారులు
4) విచ్ఛిన్నకారులు – ద్వితీయ వినియోగదారులు – ప్రాథమిక వినియోగదారులు

36. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ఆల్బుమిన్, గ్లోబ్యులిన్‌లు ప్లాస్మాలో ఉండే ప్రొటీన్లు
బి) ఆస్టిన్యూరిన్ కంటిలో ఉండే ప్రొటీన్
సి) కెసిన్ పాలలో ఉండే ప్రొటీన్
1) ఎ, బి 2) ఎ, సి
3) ఎ, బి, సి 4) బి మాత్రమే

37. క్షీర గ్రంథులు ఏ గ్రంథులకు రూపాంతరాలు?
1) స్వేద గ్రంథులు
2) సెబేషియస్ గ్రంథులు
3) వాసన గ్రంథులు 4) ఏదీకాదు

38. మైటాసిస్ దేనిలో జరుగుతుంది?
1) పరాగ రేణువులు 2) శాఖీయ కణాలు
3) పిండం 4) అండం

39. కణజాల వర్ధనంలో అర్ధఘన యానకాన్ని తయారు చేయడానికి కావలసిన పదార్థం?
1) అగార్ – అగార్ 2) జిగురు
3) రెసిన్ 4) పిండి పదార్థం

40. మొక్కల్లో కేంద్రక రహిత సజీవ కణం ఏది?
1) దారునాళం
2) చాలనీ నాళ మూలకాలు
3) దృఢ కణాలు 4) దవ్వరేఖ

41. వర్గీకరణకు మూల ప్రమాణం ఏది?
1) ప్రజాతి 2) జాతి
3) కుటుంబం 4) రాజ్యం

42. ఆహారంగా తీసుకునే 'క్యాబేజీ' ఒక:
1) ఫలం 2) పుష్ప విన్యాసం
3) మొగ్గ 4) పుష్పం

43. కింది వాటిలో సరికానిది?
1) జనుము, కంది, వేరుశెనగ, చిక్కుడు.. పాబేసి కుటుంబానికి చెందినవి
2) క్యాబేజీ, కాలీఫ్లవర్, ముల్లంగి, ఆవాలు.. బ్రాసికేసి కుటుంబానికి చెందినవి
3) వంగ, టమాట, బంగాళదుంప, మిరప.. కుకుర్బిటేసి కుటుంబానికి చెందినవి
4) ఉల్లి, వెల్లుల్లి, కలబంద.. లిల్లియేసి కుటుంబానికి చెందినవి

44. మామిడి పండులో తినగలిగే భాగం ఏది?
1) మధ్య ఫలకవచం
2) అంతర ఫలకవచం
3) బాహ్య ఫలకవచం 4) విత్తనం

45. జీవానికి భౌతిక ఆధారం ఏది?
1) సైటోప్లాజమ్ 2) జీవ పదార్థం
3) కేంద్రక రసం 4) కణరసం

46. పక్వ స్థితిలో ఉన్న టమాట ఫలాన్ని సూదితో గుచ్చితే నీరు లాంటి ద్రవం వస్తుంది. ఈ ద్రవం నిల్వ ఉండే భాగాన్ని ఏమంటారు?
1) కణ ద్రవ్యం 2) ప్లాస్టిడ్
3) రిక్తిక 4) కేంద్రకం

47. క్షయకరణ విభజనలోని ఏ దశ కొత్త జాతుల ఆవిర్భావానికి, పరిణామ మార్పులకు తోడ్పడుతుంది?
1) డిప్లోటీన్ 2) డయాకైనసిస్
3) జైగోటీన్ 4) పాకిటీన్

48. జతపరచండి.

జాబితా – I	జాబితా – II
i) వృక్ష రాజ్య ఉభయచరాలు	a) వివృత బీజాలు
ii) బొటానికల్ స్నేక్స్	b) బ్రయోఫైటా మొక్కలు
iii) ఫానిరోగామ్స్	c) టెరిడోఫైటా మొక్కలు
iv) కవచ రహిత విత్తనాలు (నగ్న విత్తనాలు) ఉండే మొక్కలు	d) పుష్పించని మొక్కలు
	e) పుష్పించే మొక్కలు

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	ii	iii	v	i
3)	ii	iii	iv	v
4)	iii	iv	v	ii

49. గంగానదిలో నీటిని శుభ్రపరుస్తున్న బ్యాక్టీరియా ఏది?
1) డెలొవిబ్రియో బ్యాక్టీరియోవోరస్
2) బాసిల్లస్ డీనైట్రోఫికెన్స్
3) సూడోమోనాస్ పుటిడా
4) క్లాస్ట్రీడియం బోట్యులినమ్

50. కింది వాటిలో ఏక కణ ప్రొటీన్‌గా ఉపయోగపడని జీవి ఏది?
1) ఈస్ట్ 2) బ్యాక్టీరియా
3) వైరస్ 4) శైవలం

సమాధానాలు

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 2	7) 2	8) 4	9) 4	10) 2
11) 1	12) 3	13) 2	14) 2	15) 3
16) 4	17) 4	18) 3	19) 2	20) 1
21) 1	22) 1	23) 3	24) 3	25) 1
26) 2	27) 2	28) 4	29) 1	30) 3
31) 1	32) 4	33) 1	34) 3	35) 2
36) 3	37) 2	38) 2	39) 1	40) 2
41) 2	42) 3	43) 3	44) 1	45) 2
46) 3	47) 4	48) 2	49) 1	50) 3

How many persons are there..



K.M. Jaya Rao
Subject Expert, Hyderabad.

Model Questions

Directions (Q.No. 1 - 5): Read the information carefully and answer the following questions:

Seven friends A, B, C, D, E, F and G play different games - Cricket, Volleyball, Football, Basketball, Badminton, Snooker and Tennis not necessarily in the same order. Each one of them has a liking for a different character- Thor, Ironman, Hulk, Spiderman, Captain America, Deadpool and Hawk Eye not necessarily in the same order. Three of them are boys. A likes Spiderman but does not play Cricket. The one who plays Volleyball likes Hawk Eye and is a boy. C plays Tennis and does not like Hulk. D plays Football and he does not like Thor. F likes Hawk Eye and E likes Deadpool. The one who likes Ironman plays Badminton. B does not like Badminton.The boy who plays Basketball likes Captain America.

1. Who plays Volleyball?
1) A 2) G 3) F
4) Cannot be determined
5) None of these

2. Which of the following is the group of boys?
1) F, C, D 2) F, B, D
3) B, D, A
4) Cannot be determined
5) None of these

3. Which game is played by E?
1) Volleyball 2) Badminton
3) Snooker 4) Cricket
5) None of these

4. Who plays Snooker?
1) A 2) B 3) E
4) Cannot be determined
5) None of these

5. Which of the following combinations of Character - Person - Game is correct?
1) Ironman - G - Basketball
2) Captain America - D - Football
3) Dead pool - E - Volleyball
4) Ironman - G - Badminton
5) None of these

6. Which character is liked by 'B'?
1) Captain America
2) Thor 3) Hulk
4) Ironman 5) None of these

Directions (Q.No. 7 - 12): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: 35 24 maintain 87 safe distance 60 12 other cats
Step-1: cats 35 24 maintain 87 safe distance 60 other 12
Step-2: 24 cats 35 maintain 87 safe 60 other 12 distance
Step-3: maintain 24 cats 87 safe 60 other 12 distance 35
Step-4: 60 maintain 24 cats 87 safe 12 distance 35 other
Step-5: safe 60 maintain 24 cats 12 distance 35 other 87

And Step 5 is the last step of the above arrangement, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate

IBPS RRB Special Reasoning

steps for the given input.

Input: 35 and 15 days concept time 50 75 be 60

7. Which element is third the right of the element which is seventh element from the right end in the last step of the given arrangement?
1) 75 2) time 3) be
4) 60 5) days

8. What is the position of 'concept' from the right end in the second - last step of the given arrangement?
1) Eighth 2) Sixth 3) Ninth
4) Seventh 5) Tenth

9. Which element/s is/ are exactly between 'concept' and 'time' in the fourth step of the given arrangement?
1) Both 'and' and '35'
2) days
3) There is no element
4) Both 'days' and 'concept'
5) 35

10. What is the position of 'concept' from the left of '60' in the third step of the given arrangement?
1) Fourth 2) Sixth
3) Ninth 4) Seventh
5) Fifth

11. In which step of the given arrangement are the elements 'time 50 75 60' found in the same order?
1) Fourth 2) Second
3) Third 4) Fifth
5) The given order of elements is not found in any step

12. Which of the following is the last step of the given arrangement?
1) time 60 concept 35 and 15 be 50 days 75
2) time days concept be and 15 35 50 60 75
3) 15 35 50 60 75 time days concept be and
4) time days concept be and 15 35 50 60 75
5) time 75 concept 50 15 and be 35 days 60

Directions (Q. No. 13 - 18): Study the following information carefully and answer the given questions.

There are six sports persons A, D, O, P, Q and R whose earnings are different based on their performance. Each one has a different pet name - Viru, Tillu, Bannu, Fani, Chinna and Pari but not necessarily in the same order. Each one has a car of different colour- blue, white, green, violet, yellow and black, again not necessarily in the same order. Bannu earns less than Chinna. Tillu owns black car. There is only one in between the person who has green colour car and Tillu in the order of earnings. Chinna has blue colour car. The person who has white colour car is the highest earner. There are two persons between D and P in the order of earnings. Neither D nor P owns white car. Q, who is Bannu, earns more than Viru and the one who owns black car. There are two persons between Bannu and A in the order of earnings. A is not the least earner. O earns less than only P and Pari. The person who owns violet car is earning least.

13. How many persons are there between A and R in the order of earning?
1) One 2) Two 3) Three
4) Four 5) None

14. Who earns more than only the least earner?
1) A 2) O 3) Q
4) Tillu 5) None of these

15. Who among the following earns maximum?
1) A 2) O 3) Q
4) The person whose pet name is Chinna
5) None of these

16. Which of the following is not correct?

1) A	Pari	White
2) P	Chinna	Blue
3) R	Viru	Violet
4) O	Fani	Yellow
5) D	Tillu	Black

17. Who is Fani?
1) A 2) O 3) R
4) D 5) None of these

18. Who is ranking third in the descending order of earning?
1) A 2) O 3) Q
4) P 5) None of these

Directions (Q.No. 19 - 22): Study the following arrangement of letters, digits and symbols carefully to answer the questions given below.

A $ 1 9 © G H 5 6 N β T Y 3 7 = Z 2 £ 8 L P @ ?

19. If all the numbers are deleted from the above arrangement, and the remaining set of elements is reversed, then which of the following will be fourth to the left of the 10th element from the left end?
1) £ 2) E 3) Z
4) = 5) None of these

20. If every third element is dropped from the first in the above series till the end, then how many symbols, letters and numbers respectively which remain in the series?
1) 6,6,4 2) 5,5,6
3) 6,4,6 4) 4,6,6
5) None of these

21. How many such symbols are there in the arrangement each of which is not immediately followed by a number?
1) Five 2) Four 3) One
4) Two 5) None of these

22. If 1©5 is related to P8Z in a certain way, then in the same way G9A is related to:
1) 8=P 2) £L?
3) 87L 4) 8=@
5) None of these

Key with Explanations

(1-6):

Person	Gender	Character	Game
A	–	Spiderman	Snooker
B	+	Captain America	Basketball
C	–	Thor	Tennis
D	+	Hulk	Football
E	–	Deadpool	Cricket
F	+	Hawk Eye	Volleyball
G	–	Ironman	Badminton

1) 3 **2) 2** **3) 4** **4) 1**
5) 4 **6) 1**

(7-12):
Words have been picked up alphabetically and numbers have been picked up in ascending order.

In the first step, Word and number have been arranged in the first position and last position respectively.

In the second step word and number have been arranged in the last and the first position respectively, and the process is repeated.

Input: 35 and 15 days concept time 50 75 be 60
Step-1: and 35 days concept time 50 75 be 60 15
Step-2: 35 and days concept time 50 75 60 15 be
Step-3: concept 35 and days time 75 60 15 be 50
Step-4: 60 concept 35 and time 75 15 be 50 days
Step-5: time 60 concept 35 and 15 be 50 days 75
and Step 5 is the last step.

7) 3; be **8) 3;** ninth
9) 1; both 'and' and '35'
10) 2; sixth
11) 2; second
12) 1; time 60 concept 35 and 15 be 50 days 75

(13 -18):

Order of Earnings	Persons	Pet name	Colour of car
Highest earner	A	Pari	White
	P	Chinna	Blue
	O	Fani	Green
	Q	Bannu	Yellow
	D	Tillu	Black
Least earner	R	Viru	Violet

13) 4; Four
14) 4; Tillu **15) 1;** A
16) 4; O Fani Yellow
17) 2; O **18) 2;** O


(19 - 22):
19) 3; Z (? @ P L £ Z)
20) 1; 6,6,4
Symbols: $, ©, β, =, £, @
Letters: A, H, N, Y, Z, P
Numbers: 9,5,3, 8,


21) 2; Four
Symbol immediately followed by letter: © G, β, T, =, Z
Symbol immediately followed by Symbol: @ ?

22) 2; £L?
A $ 1 9 © G H 5 6 N β T Y 3 7 = Z 2 £ 8 L P @ ?
The relation between 1©5 and P8Z is as follows:
(3^{rd} from left) 1 © 5 :
+2 +3
(3^{rd} from right) P 8 Z
–2 –3
'+' indicates counting in the forward direction
'–' indicates counting in the backward direction
(6^{th} from left) G 9 A :
–2 –3
(6^{th} from right) £ L ?
+2 +3

లెక్కించండి.. రంగులు వేయండి


ఇక్కడ ఉన్న బొమ్మలో ఏఏ పండ్లు ఎన్ని ఉన్నాయో లెక్కించి, కింద రంగులలో ఇచ్చిన బొమ్మల దగ్గర రాయండి. అన్నిటికీ కింద ఇచ్చిన మాదిరిగా రంగులు వేయండి.





పూరించండి

పిల్లలూ... కింద గుమ్మడికాయలకు వరుసలో అంకెలు వేసి ఉన్నాయి. ఖాళీ గుమ్మడి కాయలకు ఏ అంకె ఉండాలో గుర్తించి పూరించండి.



దారి కనుక్కోండి



నాన్నా చెప్పవా?

ఒక గుంపులోని జంతువులు ఎప్పటికీ ఆ గుంపులో ఉండవా?

భూమి మీద అనేక జంతువులు, పక్షులు ఎక్కడికక్కడ సమూహాలుగా జీవిస్తూ ఉండటం సర్వ సాధారణమైన విషయం. ఇలా గుంపులో ఒక భాగంగా జీవించడం వల్ల ఆయా జంతువులకు కొన్ని లాభాలతో పాటు నష్టాలూ ఉంటాయి. ముఖ్యంగా కరువు కాటకాలు, ఆహారం తగినంతగా దొరకకపోవడం వంటి ప్రతికూల పరిస్థితుల్లో గుంపులోని కొన్ని జంతువులు బాగా నష్టపోతాయి. ముఖ్యంగా మిగతా వాటి కన్నా బలహీనంగా ఉండే జంతువులు ఎక్కువ నష్టపోతాయి. ఏదేమైనా ఒక సమూహంలో పుట్టిన జంతువులు ఎప్పటికీ ఆ సమూహంలోనే ఉండటం అనేది జరగదు. కొన్ని జంతువులు తమకు తాముగా ఆ సమూహం నుంచి విడిపోయి వేరుగా జీవించడమో, లేదా మిగతా జంతువులువాటిని వెళ్లగొట్టడమో జరుగుతుంది. ఉదాహరణకు ఒక సింహం గుంపులో పుట్టిన పిల్లలు పెరిగి పెద్దయ్యాక వాటిని మిగతా సింహాలు ఆ గుంపు నుంచి తరిమేస్తాయి. అలా తరిమేయబడ్డ సింహాలు కొంత కాలంపాటు ఒంటరిగానే జీవిస్తాయి. ఆ తరువాత ఏదైనా ఒక సింహాల గుంపులో భాగంగా మారేందుకు ప్రయత్నిస్తాయి. అయితే అదేమంత సులభమైన పని కాదు సుమా. అందుకై ఆ గుంపులోని మిక్కిలి బలమైన సింహంతో (సాధారణంగా నాయకుడితో)అవి పోట్లాడవలసి ఉంటుంది. అలా పోట్లాడిన ఆ సింహాన్ని ఓడించడం గాని, చంపడంగాని జరిగితే అప్పుడు దానికి ఆ గుంపులో స్థానం దక్కుతుంది. ఒకసారి స్థానమంటూ దక్కాక ఇక అది ఆ గుంపులో ఒక భాగమైపోతుంది.



కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





మీకు తెలుసా?

ఒక్కో మేఘం బరువు దాదాపు వంద ఏనుగుల బరువుకు సమానం



అమెరికాలో మనుషులకన్నా తుపాకులే ఎక్కువగా ఉన్నాయి



సముద్రతీరాల్లో ఏటా కాలుష్యం కారణంగా పదిలక్షల పక్షులు, పదికోట్ల క్షీరదాలు మరణిస్తున్నాయి



చనిపోయాక నరకలోకం ఉంటుందని ప్రపంచంలో దాదాపు 71 శాతం నమ్ముతున్నారు



రోజూ రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగేవారికి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు తక్కువగా వస్తాయట!



హనోకో చేప దాదాపు 250 సంవత్సరాలు బతుకుతుంది




చదవడం రాయడం రానివారు ప్రపంచంలో దాదాపు 78 కోట్ల మంది ఉన్నారు



మోనాలిసాకు కను బొమ్మలు ఉండవు



కింద ఇచ్చిన కోతి బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.



కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు



పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్:

శ్రావణమాసంలో బోనాలు సమర్పించే అనువాయితీ కావడంతోపాటు చివరి ఆదివారం కావడంతో పెద్దమ్మతల్లి దర్శనానికి వివిధ ప్రాంతాలనుంచి ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు నాలుగు వరస క్యూలైన్‌లో వెళ్లిఅమ్మవారిని దర్శించుకుని పూజ లు జరుపుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలా డింది. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు ఆలయ గదులు, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు దొరకక పోవడంతో పలువురు చెట్ల కిందనే వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా భోజ నాలు చేశారు. ఆలయ ఈఓ సంకాటల శ్రీని వాసరావు పర్యవేక్షణలో భక్తులకు ఆలయ సిబ్బంది పులిహోర ప్రసాదాని పంపిణీ చేశారు.

యాగశాల్లో రుద్రహోమ పూజలు

పెద్దమ్మతల్లి ఆలయ సమూదాయంలోని యాగ శాలల్లో రుద్రహోమ పూజలు నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతోపాటు ఆలయ ఈఓ, డైరెక్టర్ కొత్తవెంకటరెడ్డి తదితరులు పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో భక్తుల ఇబ్బందులు..

ఆలయం ఎదుటనే ప్రధాన జాతీయ రహదారి ఉండటంతో ఒకవైపు భక్తుల రద్దీ, మరో వైపు వాహనాల రాకపోకలతో రోడ్డు దాటి అమ్మవారిని దర్శించుకోవాలంటే ట్రాఫిక్ సమస్యతో భక్తులు ఇక్కట్లు పడ్డారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు వాహనాల రాక పోకలతో రోడ్డుదాటలేక అవస్థలు పడ్డారు.

తాలిపేరుకు స్వల్పంగా తగ్గిన వరద ఉధృతి

8 గేట్ల ద్వారా 24 వేల క్యూసెక్కుల నీరు విడుదల

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో వర్షాలు కాస్తా తగ్గుముఖం పట్టడంతో తాలిపేరులోకి వరద ఉధృతి తగ్గుతోంది. శనివారం భారీగా వరదనీరు రావడంతో 11 గేట్లను 12 అడుగుల మేర ఎత్తి 42 వేల క్యూసెక్కుల చొప్పున వరదనీటిని విడుదల చేయగా, ఆదివారం వరద ఉధృతి తగ్గడంతో కేవలం 8 గేట్లను 12 అడుగుల మేర ఎత్తి ఉంచి 24 వేల క్యూసెక్కుల చొప్పున వరదనీటిని దిగువన ఉన్న గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ డీ మల్లికార్జునరావు, జేఈ వెంకటేశ్వరావు ప్రాజెక్ట్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



వరదనీటిని విడుదల చేస్తున్న దృశ్యం

అంతర్జాతీయ నృత్యకారుణులకు

అన్నమయ్య అవార్డు

పాల్వంచ: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన వి.యశస్విని, వి.తపస్వీలు అన్నమ య్య అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో శనివారం శ్రీ లహరి క్లాసికల్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యశస్విని, తపస్వీ ప్రత్యేక నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నమయ్య అవార్డును అందించారు. వీరిని ఆదివారం పట్టణ ప్రముఖులు, తల్లిదండ్రులు అభినందించారు.



అవార్డును అందుకుంటున్న యశస్విని, తపస్వీలు

ఆటా జాతీయ పురస్కారానికి రోజాలక్ష్మీ ఎంపిక



పెండ్యాల రోజా లక్ష్మీ

పాల్వంచ: ఆటా జాతీ య పురస్కారానికి పాల్వంచకు చెందిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ప్రొగ్రాం కోఆర్డినేటర్ పెండ్యాల రోజా లక్ష్మీ ఎంపికయ్యారు. బెస్ట్ సోషల్ సర్వీస్ పర్సన్‌గా గుర్తించి పురస్కారానికి ఆటా జాతీయ అధ్యక్షులు బెక్కంటి శ్రీనివాసరావు ఎంపిక చేశారు. అక్టోబర్ 8న భద్రాచలంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంన ఈ పురస్కారాన్ని తాళ్ళూరి పంచాక్షరయ్య ట్రస్ట్, తానా తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ నిర్వాహకులు మాగంటి సూర్యం, పాకాల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నట్లు రోజా లక్ష్మీ తెలిపారు.

వనంలోకి జనం

సీతంపేటలో ఘనంగా వన భోజనాలు

సుజాతనగర్:

మండల పరిధిలోని సీతంపేటబంజరకు చెందిన గిరిజనులు ఆదివారం వనంలోకి వెళ్లి వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ ఏడాదంతా పాడిపంటలతో సంతోషంగా ఉండాలని గిరిజనుల ఆరాధ్య దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. సాంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో రోజంతా వనంలో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గుగులోతు రాజేష్ నాయక్, మాజీ సర్పంచ్ గుగులోతు నెహ్రూ, జానకీరాంనాయక్, రాంప్రసాద్, గోవిందు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



వనంలో వంటలు చేస్తున్న గిరిజనులు

కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో 'స్వచ్ఛ్ పక్వాడ'



స్వచ్ఛ్ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడంలోని భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా రైల్వే స్టేషన్ పరిధిలో చెత్తా చెదారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఏఓ మణికుమార్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కె.శివశంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రయాణీకులు డస్టను పిన్ బాక్స్‌లోనే వేయాలన్నారు. స్టేషన్‌ను శుభంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్టేషన్‌మాస్టర్ ఎం.నర్సింహారావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమణ, సీఎన్ డబ్ల్యూ అరుణ్‌కుమార్, ఐఓ డబ్ల్యు శశిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకుంటున్న అలుగు దృశ్యాలు

మురిపిస్తున్న 'మురుట్ల'



టేకులపల్లి : బోడు పంచాయతీ మురుట్ల చెరువు అలుగు వద్ద చిన్నారుల సందడి



టేకులపల్లి: మండలంలోని బోడు పంచాయతీ ఆర్సీపేట సమీపంలోని మురుట్ల చెరువు అలు గు అందరినీ అలరిస్తోంది. మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో చెరువులోకి వరద విపరీతంగా చేరింది. దీంతో మూడంచెలో ఉన్న అలుగు పడి నీరు సమీప కాలువల్లోకి పారుతోంది. ఆదివారం ఆ దృశ్యాన్ని చూసి అలుగునీటిలో జలకాలాడుతూ సందడి చేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9848264234

కొనసాగుతున్న వాగుల ఉధృతి

అలుగు పోస్తున్న చెరువులు • వాగొడ్డుగూడెం వాగు వద్ద నిలిచిన రాకపోకలు • కళకళలాడుతున్న పంటలు

అశ్వారావుపేటరూరల్: అల్పపీడిన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో మండలంలోని సాగునీటి చెరువులు నిండి అలుగులు పోస్తున్నాయి. ఆదివారం వర్షం జోరు తగ్గినప్పటికి వాగుల ఉధృతి మాత్రం కొనసాగింది. జోరుగా కురిసిన వర్షాలతో పంటలు కళకళ లాడుతున్నాయి. మండల పరిధిలోని ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువు పూర్తి స్థాయిలో నిండుకోగా శనివారం రాత్రి నుంచి అలుగు పారుతుంది. అలాగే రెడ్డిగూడెం గుండేటివాగు ప్రాజెక్టు, అనంతారం ఊరచెరువు, మల్లాయిగూడెం, వినాయకపురం, దబ్బాతోగు, సున్నంబట్టి వద్దగల వగ్గెల చెరువు, ఊట్లపల్లిలోని విశాలక్ష్మి చెరువు, శీమకుర్తి తాతయ్య చెరువుతో పాటు పలు సాగునీటి చెరువులు నిండిపోయి అలుగు పారుతున్నాయి. వర్షం జోరు తగ్గినప్పటికి గుమ్మడవల్లి–వడ్డెర రంగాపురం, నారాయణపురం–బచ్చువారిగూడెం, అనంతారం గ్రామాల వద్ద గల పెదవాగు ఉధృతి తగ్గలేదు. వాగొడ్డుగూడెం వాగు, గుమ్మడవల్లి–వడ్డెర రంగాపురం వద్దగల పెదవాగు ఉధృతి తగ్గకపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గుమ్మడవల్లి వద్దగల పెద వాగు ప్రాజెక్టు ఇప్పటికే నిండిపోగా రెండుసార్లు గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేసిన సంగతి తెలిసింది. ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల్లోని వాగుల నుంచి వరదనీరు భారీగా చేరుతుండటంతో నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. మరో వైపు జోరుగా కురిసిన వర్షాలతో మండలంలో సాగులో ఉన్న పత్తి, మొక్కజొన్న, వరి పంటలు కళకళలాడుతున్నాయి. ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలతో పంటలకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉండటంతో రైతులు అందోళన చెందుతున్నారు.



అలుగు పారుతున్న వెంకమ్మ చెరువు



ఉధృతంగా ప్రవహిస్తున్న పెదవాగు



నిండుకుండలా వెంకమ్మ చెరువు

న్యూస్‌బాక్స్

మంత్రి తుమ్మలకు పలువురి పరామర్శ

దమ్మపేట: అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మండలానికి చెందిన పలువురు అధికారులు, టీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం కలిసి పరామర్శించారు. ఫిలింనగర్‌లో తన నివాసంలో ఉన్న మంత్రి తుమ్మలను ఆదివారం ఉదయం ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ ఆలపాటి రామచంద్ర ప్రసాద్‌లు పరామర్శించారు. తర్వాత ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట డివిజనల్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డిలు కలిసి పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. దమ్మపేట గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మేనేజర్ పానుగంటి సత్యనారాయణ కలిసి పరామర్శించారు. ముష్టిబండకు చెందిన టీఆర్‌ఎస్ నాయకులు కూకలకుంట మాధవరావు, భద్రయ్యగారి రవి, కూకలకుంట రంగారావు, కిషోర్‌లు తుమ్మలను పరామర్శించిన వారిలో ఉన్నారు.

మంత్రిని కలిసిన వ్యాపారులు



మంత్రికి వినతిపత్రాన్ని అందిస్తున్న వ్యాపారులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం స్థానిక వర్తక, వ్యాపారులు హైదారాబాద్‌లో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. వ్యాపారులు మంత్రితో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత అశ్వారావుపేటలో వ్యాపార లావాదేవీలు దెబ్బతిన్నాయన్నారు. రహదారి నిర్మించాల్సి వస్తే అశ్వారావుపేటకు బైపాస్ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను నేషనల్ హైవే అధికారలతో చర్చిస్తానని మంత్రి చెప్పినట్లు వ్యాపారులు పేర్కొన్నారు. మంత్రిను కలిసిన వారిలో సమయమంతుల మహేశ్వరరావు, దారా కృష్ణ, శీమకుర్తి శివ, పుష్కరకుమార్, శీమకుర్తి వెంకటేశ్వరరావు, వేముల శ్రీను, శీమకుర్తి విజయ్‌తో పాటు పలువురు ఉన్నారు.

పామాయిల్ గెలల ధర పెరిగేలా చర్య తీసుకోవాలి

దమ్మపేట: పామాయిల్ గెలల ధర పెరిగేలా చర్యలు తీసుకోవాలని పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. అశ్వారావుపేట ఎంఎల్‌ఏ, ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లులతో కలసి ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నివాసంలో కలిసి ఈ మేరకు విన్నవించినట్లు ఆలపాటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం రైతులకు వరంలా మారిందని తెలిపారు. క్రూడ్ ఆయిల్‌పై వేస్తున్న దిగుమతి సుంకాన్ని 7.5 శాతం నుంచి 15 శాతానికి, రిఫైన్డ్ పామాయిల్‌పై 15 నుంచి 25 శాతానికి పెంచిందని వారు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శీమకుర్తి వెంకటేశ్వరరావు, అప్పారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో జేసీ పూజలు

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జాయింట్ కలెక్టర్ రామ్‌కిషన్ ఆదివారం కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ ఎన్ రజనీకుమారి పాల్గొన్నారు.

ఎకరానికి రూ.12 లక్షలు చెల్లించాలి



మాట్లాడుతున్న సునావత్ రమేష్

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ పనుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న భూములకు ఎకరానికి రూ.12 లక్షలు ఇవ్వాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు సునావత్ రమేష్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పూసుగూడెం పంచాయతీ వడ్డె రామవరం గ్రామంలో జరిగిన భూనిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి నిరుపేదలు తమకున్న ఎకరా రెండెకరాల భూమిని జీవనాధారంగా చేసుకొని అందులో వివిధ పంటలను సాగుచేసుకుని జీవిస్తున్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.12 లక్షల ప్యాకేజి అందించాల ని కోరారు. కార్యక్రమంలో టీజేఏపీ చైర్మన్ మల్లెల రామనాథం, ఎస్కే నభీసాహెబ్, రైతులు భుక్యా ధర్మ, బానోత్ హరిచంద్ర, చంద్రకళ, దేశ్యా, మధార్, శంకర్ తదితరుల పాల్గొన్నారు.

అభ్యాసకులకు ఎన్ఐఓఎస్ పరీక్షలు

అశ్వారావుపేటరూరల్: సాక్షరభారత్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అభ్యాసకులకు ఆదివారం ఎన్ఐఓఎస్ పరీక్షలను నిర్వహించారు. నారంవారిగూడెం పంచాయతీలో సర్పంచ్ మనుగొండ మహాలక్ష్మి, ఆసుపాక, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట పంచాయతీల్లో సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ తగరం సోమయ్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ మాట్లాడుతూ 16 గ్రామ పంచాయతీల్లో 256 మంది అభ్యాసకులకు ఈ పరీక్షలు నిర్వహించగా 241 మంది హాజరై పరీక్షలు రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీసీఓలు లలిత, రత్నం, దీప్తి, రమాదేవి తదితరులు ఉన్నారు.



అశ్వారావుపేట: పరీక్షలను రాస్తున్న అభ్యాసకులు

ఎన్ఐఓఎస్ పరీక్ష రాసిన సర్పంచ్

అన్నపురెడ్డిపల్లి/చండ్రుగొండ: మండలంలో ఆదివారం ఎన్ఐఓఎస్ పరీక్షలు నిర్వహించారు. రాజాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో సర్పంచ్ మారుతి జానకి పరీక్ష రాశారు.

అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల్లో మొత్తం 17 పంచాయతీల్లో 272 మంది అభ్యాసకులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలను జనశిక్షణ సంస్థ డైరెక్టర్ సుందర్‌రావు, సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ రవిచందర్ పరిశీలించారు.

వయోజనులందరూ విద్యనభ్యసించాలి

ములకలపల్లి: సాక్షరభారత్ ఆధ్వర్యలో ఆదివారం మండలంలో పంచాయతీల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఓపెన్ స్కూల్ పరీక్ష నిర్వహించారు.

పొగళ్లపల్లి పంచాయతీ ఒడ్డుగూడెంలో సర్పంచ్ కీసరి లక్ష్మి, సమక్షంలో 16 మంది వయోజనులకు పరీక్ష నిర్వహించారు.

15 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు నిరక్షరాస్యులంతా చదువుకోవడం కోసం ప్రభుత్వం ఈ సాక్షర భారత్‌ను ప్రవేశపెట్టి విద్యనందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మడకం జయ, కల్లూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

బస్టాండ్‌ను పునరుద్ధరించండి



చండ్రుగొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించాలి. బస్సులు బస్టాండ్ లోపలికి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుంది. కొత్తగూడెం ఆర్టీసీ డిపో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సత్వర చర్యలు తీసుకోవాలి.

– మక్కా రమేష్, చండ్రుగొండ

విద్యుత్ సమస్యను పరిష్కరించండి



ములకలపల్లి: మధారం, రామాంజనేయపురం వరి పొలాల్లో కరెంట్ స్తంభాలు ఒక పక్కకు వంగి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. కర్ర సహాయంతో విద్యుత్ తీగలు పైకి లేపి ఉంచుతున్నారు. వర్షం పడినప్పుడు పశువులు, ప్రజలు ఆదమరిచి కర్రకు తగిలితే ప్రాణాలు వదలాల్సిందే. గతంలో కూడా పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– ఊకంటి రవికుమార్, ములకలపల్లి

వెండితెర



తెలుగు

జయజానకినాయక: వెంకటదుర్గ (అశ్వారావుపేట) 11.15, 2.30, 6.30, 9.30; బాలాజీ (దమ్మపేట) 11.30, 2.30, 6.30, 9.30; **ఫిదా:** శ్రీబాలాజీ (సత్తుపల్లి), 11.30, 2.30, 6.30, 9.30. **వాసుకి:** శ్రీనివాస (సత్తుపల్లి) 11.15, 2.30, 6.30, 9.30. **నేనేరాజు నేనేమంత్రి:** సాయిసుమన్ (అశ్వారావుపేట) 11.15, 2.30, 6.30, 9.30, **గౌతం నంద:** శ్రీసాయి బాలాజీ (సత్తుపల్లి), 11.30, 2.30, 6.30, 9.30, **వైశాఖం:** కృష్ణా(సత్తుపల్లి) 11.15, 2.30, 6.30, 9.30,

బొజ్జ గణపయ్యలొచ్చారు.!

అశ్వారావుపేటరూరల్: వినాయక చవితి పండగ దగ్గర పడుతుండటంతో వ్యాపారులు బొజ్జ గణపయ్యల విగ్రహాలను విక్రయించేందుకు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. మరికొంత మంది వ్యాపారులు విగ్రహాలను వాహనాల్లో పల్లెలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దాంతో ఎక్కడ చూసినా బొజ్జ గణపయ్యలొచ్చారని స్థానికులు చర్చించుకుంటున్నారు. అశ్వారావుపేట మండల కేంద్రంలోని పంచాయతీ రోడ్, భద్రాచలం రోడ్, ఖమ్మం రోడ్‌లలో గణపతుల విగ్రహాలను దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దీంతో చవితి ఉత్సవాలు నిర్వహించే భక్తులు, కమిటీ బాధ్యులు దూరం ప్రాంతాలకు వెళ్లి గణనాథులను తెచ్చుకొనే ఇబ్బందులు తొలగాయి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న బొజ్జ గణపయ్యలు

ఎస్సీ కాలనీకి బురదనీరే దిక్కు

- పట్వారీగూడెం ఎస్సీ కాలనీని వేధిస్తున్న మంచినీటి సమస్య
- నీటి సరఫరాలో బురదనీరు కలుషితం
- అనారోగ్యంపాలైన కాలనీ వాసులు

దమ్మపేట: పట్వారీగూడెం ఎస్సీ కాలనీని మంచినీటి సమస్య వేధిస్తోంది. ఐదు రోజులుగా బురదనీరు సరఫరా అవుతోందని కాలనీ వాసులు పంచాయతీ పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బురదనీరు తాగటంతో కాలనీలో చాలామంది జ్వరాలతో అనారోగ్యం పాలయ్యారని గ్రామస్తులు తెలిపారు. ఎస్సీ కాలనీలో ఉన్న మంచినీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో నాచుతో కూడిన కలుషితమైన నీరు సరఫరా అవుతోందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

మంచినీటి ట్యాంకులో పెద్ద ఎత్తున ఇసుక మేట వేసిందని, అక్కడ నుంచి ఇసుకతో బురదనీరు సరఫరా అవుతోందని తెలిపారు. నిబంధనల ప్రకారం ట్యాంకును శుభ్రం చేయాల్సి ఉండగా.. శుభ్రం చేసిన దాఖలాలు లేవని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి మంచినీటి ట్యాంకును శుభ్రం చేయించి, బురదలేని రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై దమ్మపేట ఎంపీడీఓ నాగేశ్వరరావును వివరణకు సంప్రదించగా అక్కడ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దీనిపై సర్పంచ్ కొర్సా సునీతసాగర్ స్పందిస్తూ ఎస్సీ కాలనీలో ట్యాంకుకు సంబంధించిన బోరులో ఇసుక వస్తుందని తెలిపారు. అక్కడ నెల రోజులకొకసారి ఈ సమస్య ఉత్పన్నమవుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం ట్యాంకును శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు.



ట్యాంకులో మేట వేసిన ఇసుక



మంచినీటి ట్యాంకు

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

దమ్మపేట: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 73వ జయంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిపారు. పట్వారీగూడెంలో పార్టీ మండల అధ్యక్షుడు కారం శ్రీరాములు ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ వాసం శ్రీను, జల్లిపల్లి కిషోర్, నాయకులు కొర్సా వెంకటేశ్వరరావు, కొమరం రాము, కారం వసంతరావు, కాకా ప్రసాద్, వాడే వెంకటరావు, కొమరం ప్రసాద్, వాసం పోలారావు, పిచ్చియ్య పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో...

అశ్వారావుపేటరూరల్: స్థానిక సాయిసుమన్ సినిమాహాల్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మాజీ సీనియర్ నాయకులు బండి వీరరాఘవులు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పఠాన్ దావుద్, తుమ్మా రాంబాబు, శాఖ చక్రధరరావు, నాగ మహేశ్వరరావు, జుజ్జురపు దుర్గారావు, మిండా దుర్గారావు, కొప్పుల శ్రీను, సలీమ్ ఉన్నారు.



దమ్మపేట: రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న దృశ్యం

ఫొటో గ్రాఫర్లకు సన్మానం

దమ్మపేట: ఫొటోగ్రఫీ రంగంలో విశిష్ట సేవలందించిన మండలానికి చెందిన పలువురు ఫొటో గ్రాఫర్లను ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్లు నల్లపు ప్రభాకర్, గండికోట వేణు, నల్లగట్ల సత్యంబాబు, దాసరోజు రామారావును సన్మానించారు. కార్యక్రమానికి తహసీల్దార్ ఎం.భద్రకాళి, యూనియన్ రెండు జిల్లాల అధ్యక్షులు వేముల నరసింహారావు, ఎం రామకృష్ణ, ఉపసర్పంచ్ దారా మల్లిఖార్జునరావు, సత్యం పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

దమ్మపేట: కాంగ్రెస్ నాయకుల ప్రస్తుత పరిస్థితిని చూస్తే పార్టీని పెంచేలా లేదని, తుంచేలా ఉందని పార్టీ మండల అధ్యక్షుడు కారం శ్రీరాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్వారీగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నాటికి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సి ఉండగా కొందరు నాయకుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆరోపించారు. ఇటీవల నియోజకవర్గంలోని వినాయకపురంలో స్థానిక నాయకత్వానికి తెలియకుండా ఎస్సీ, ఎస్టీసెల్ సమావేశం నిర్వహించి మండల బాధ్యులను నియమించారని ఆగ్రహించారు. విలేకరుల సమావేశంలో సొసైటీ డైరెక్టర్ వాసం శ్రీను, జల్లిపల్లి కిషోర్, కొర్సా వెంకటేశ్వరరావు, కొమరం రాము, కారం వసంతరావు, కాకా ప్రసాద్, వాడే వెంకటరావు, కొమరం ప్రసాద్, వాసం పోలారావు, ఆకుల పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల వనయాత్ర



ఊరేగింపు నిర్వహిస్తున్న ఆదివాసీలు

చంద్రుగొండ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడులో ఆదివాసీలు ఆదివారం వనయాత్రకు వెళ్లారు. మూడేళ్లకోసారి సంప్రదాయంగా అడవితల్లి వడిలో ఒకరోజు సామూహికంగా వన భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని ఆదివాసీ పెద్దలు తెలిపారు. వనసమారాధనకు ముందు ముత్యాలమ్మదేవత, బొడ్రాయికి పూజలు చేశారు. కనకగిరి అటవీ ప్రాంతంలోని దూతచెట్టుకు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా పార్వతి, మాజీ సర్పంచ్ ఈసం రాములు, మోడెం రాజాలు, పద్దం నర్సింహులు, ఏటి బుచ్చిరాములు, భూక్యా బాలు, ఆంగోత్ లక్ష్మణ్, మల్లం కృష్ణయ్య, సురేష్ పాల్గొన్నారు.20ఏఎస్‌పి296 పొలిమేరలో తోరణాలు కడ్తున్న ఆదివాసీలు .

Zone Guide

వీధిలైట్ల ఏర్పాటు

అశ్వారావుపేటరూరల్: ఊట్లపల్లి గ్రామ పంచాయతీలో ఆదివారం వీధిలైట్ల ఏర్పాటు కార్యక్రమాన్ని సర్పంచ్ తెల్లం వీరకుమారి ప్రారంభించగా, అనంతరం పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలకు లైట్లు బిగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న లైట్లను ఆకతాయిలు ధ్వంసం చేయకుండా చూసుకోవాలన్నారు. వీధిలైట్లు అవసరం ఉన్న అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వం దమనకాండ నిలిపివేయాలి

చంద్రుగొండ: ప్రజా సమస్యపై నిత్యం పోరాటాలు సాగించే ఎన్‌డీపై నాయకులపై ప్రభుత్వం పోలీసులతో సాగిస్తున్న దమనకాండను వెంటనే నిలిపివేయాలని ఆ పార్టీ సబ్‌డివిజన్ కార్యదర్శి ఎస్కే ఉమర్ డిమాండ్ చేశారు. చంద్రుగొండలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లెందు, గుండాల మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై దాడులు, సోదాలు చేస్తున్న పోలీసులు ఎన్‌కౌంటర్లు చేసి చంపేస్తామని బెదిరించడం అప్రజాస్వామికం అన్నారు. తెలంగాణ సాధన కోసం పోరాటం చేసిన నాయకులను గద్దెనెక్కిన తెలంగాణ పాలకులు చంపేసేందుకు ప్రయత్నించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, సర్పంచ్ పద్దం శ్రీను, కారం వెంకటేశ్వర్లు, బాలు, కాకా కృష్ణ, కొడెం భద్రమ్మ పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

అశ్వారావుపేటరూరల్: వినాయక చవితి ఉత్సవాలకు కమిటీలు, నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ బాల్దే సురేష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులు, ఉత్సవ కమిటీలదేనని అన్నారు. ముందుగానే పోలీసులకు పూర్తి వివరాలను అందించాలన్నారు. అదే విధంగా మండపాలు ఏర్పాటు స్థలం యజమాని, విద్యుత్ సరఫరా, మైకుల ఏర్పాటుకు అనుమతులు పొందాలన్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: వినాయకపురం వద్ద గల శ్రీశ్రీశ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం, గోగులపుడి అటవీ ప్రాంతంలోని శ్రీశ్రీశ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు చేరుకొని అమ్మవార్లను దర్శించుకొని వివిధ రకాల పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకొని, అన్నదానం నిర్వహించారు. ఆలయాలకు స్థానికులతో, వివిధ ప్రాంతాలను భక్తులు తరలి రావడంతో సందడి నెలకొంది.





భద్రాచలం: దుమ్ముగూడెం మండలంలోని ఎర్రబోరుకు సరైన రహదారి లేదు.చాలా కాలం క్రితం వేసిన రోడ్డుపై ప్రస్తుతం మెటల్ పైకి లేవటంతో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో ప్రయాణం సాగటం లేదు. గ్రామానికి రోడ్డు వేయాలి.

పంపిన వారు: తునికి నాగరాజు, ఎర్రబోరు

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 99080 81167

న్యూస్‌బాక్స్

మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

దుమ్ముగూడెం: మండలంలో సింగారంలో స్వచ్ఛ భారత్ వారోత్సవాలలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణాలకు మార్కింగ్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రమాదేవి ఆదివానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతీ కుటుంబం తప్పనిసరిగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలని. లేని పక్షంలో ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు దరి చేరవని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతమ్మ, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు

భద్రాచలంటౌన్: ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్రం చేయాలని ఇస్లాం మత బోధకుడు తెలంగాణ ముస్లిం మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కౌసర్ మసీదులో హజ్ యాత్రకు బయల్దేరి వెళుతున్న యాత్రికులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలీం సాహెబ్, షేక్ సాదిక్ పాషా పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

దుమ్ముగూడెం: మండలంలో బీజేపీ బలోపేతానికి ఇప్పటి నుంచే కృషి చేయాలని, ప్రతీ కార్యకర్త సైనికునిలా పనిచేయాలని పార్టీ నియోజకవర్గ ఫుల్‌టైమ్ బాధ్యులు పారేపల్లి హరీష్ అన్నారు. మండలంలో గంగోలు, లక్ష్మీనగరం, దుమ్ముగూడెం, వర్క్‌షాప్ గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఆదివారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న పరిస్థితులను అధ్యక్షుడు జెట్టి రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, ప్రభాకర్, రామస్వామి, లంకా ప్రసాద్, లక్ష్మీ,గోవింద్ పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

చర్ల: రసాయనాలతో తయారు చేసే ప్రతిమలను పక్కన పెట్టి మట్టితో తయారు చేసే గణపతి విగ్రహాలను పూజలకు వినియోగించాలని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుచూరి రవికుమార్ కోరారు. ఆదివారం చర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని కావాల్సిన భక్తులు సంప్రదించాలని ఆయన కోరారు.

ఆటోలో మహిళ ప్రసవం

- పొంగిన వాగులతో గర్భిణీకి అవస్థలు
- అంబులెన్సు వెళ్లే సౌకర్యం లేక ఆటోలో తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు
- మార్గమధ్యలో అడ్డు తగిలిన రెండు వాగులు
- బిడ్డ పరిస్థితి విషమం.. ఏరియా ఆస్పత్రికి తరలింపు



పుట్టిన బిడ్డను చింతవాగు దాటిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) పుట్టిన బిడ్డ



తల్లీబిడ్డను అంబులెన్స్‌లో తరలిస్తున్న ఆశ కార్యకర్త

ఏజెన్సీలోని గిరిజనులను వాగులు, వరదలతో కష్టాలు వీడడం లేదు. అంబులెన్సులు వెళ్లేందుకు దారులు లేక.. అక్కడి నుంచి వారికి జడ్డీలు కట్టాల్సి వస్తోంది. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికోసం ప్రభుత్వాలు రూ. వందల కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నాయని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ అవి క్షేత్ర స్థాయిలో మచ్చుకైనా కనిపించడం లేదు. రోడ్డు సౌకర్యం సరిగా లేక మార్గమధ్యలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వస్తుంది.. ఈ క్రమంలోనే శనివారం తెల్లవాజుజామున చర్ల మండలంలో రహదారుల సౌకర్యం లేక ఆటోలోనే ప్రసవించిన హృదయ విధారక సంఘటన చోటు చేసుకుంది.

చర్ల:

మండలంలోని కుర్నపల్లికి చెందిన ఏడు నెలల గర్భిణీ ఇర్పా రమ్యకు పురిటి నొప్పులు వస్తుండడంతో ఆదివారం తెలవారుజామున అక్కడి నుంచి కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు సమాచారమిచ్చారు. చర్ల నుంచి 108 బయల్దేరి వెళ్తున్న క్రమంలో చింతగుప్ప సమీపంలో ఉన్న చింతవాగు వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చప్టా నీటమునిగి వరదనీటితో ప్రవహిస్తోంది. దీంతో 108 సిబ్బంది అంబులెన్సును చింతగుప్ప వద్దే నిలిపి ఆటోలో గర్భిణీని తీసుకురావాలని కుటుంబ సభ్యులకు సూచించడంతో వారు ఆటోలు గర్భిణీని తీసుకొని బయల్దేరి వస్తుండగా మార్గమధ్యలో బోదనెల్లి సమీపంలో బోదనెల్లి వాగు అడ్డు తగిలింది. దీంతో ఆటోను వాగులో నుంచి దాటిస్తున్న క్రమంలో ఆటో వాగులో దిగబడడంతో జాప్యమైంది. గర్భిణీ ఆటోలోనే ప్రసవించింది. అక్కడి నుంచి అతికష్టం మీద చింతగుప్ప వద్ద ఉన్న వాగు వద్దకు చేరుకోగా ఆటోను అవతలి వైపున నిలిపి ప్రసవించిన బాలింతను, పుట్టిన బిడ్డను వాగులో నుంచి భర్త సమ్మయ్య, ఆశ కార్యకర్త ఇర్పా కనకమ్మ దాటించారు. చింతగుప్ప వాగు వద్దే తల్లీబిడ్డను పరీక్షించిన 108 సిబ్బంది బిడ్డ బరువు తక్కువగా ఉండడంతో పాటు స్థానిక వైద్యాధికారి మణికంఠరెడ్డికి సమాచారమివ్వగా ఆయన భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించాలంటూ సూచించడంతో ఆయన సూచన మేరకు భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డలు భద్రాచలంలోని ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. టువంటి సంఘటనలు ఈ ప్రాంతంలో నిత్య జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆర్ కొత్తగూడెం నుంచి కుర్నపల్లికి ఇటీవల బీటీ రోడ్డును నిర్మించినప్పటికీ చింతగుప్ప, బోదనెల్లి గ్రామాల సమీపంలో ఉన్న ప్రధాన వాగులపై వంతెనలు నిర్మించకపోవడంతో రోడ్డు ఉన్నా ఉపయోగం లేకుండా పోయిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రామ.. రామా..!

- విద్యార్థులకు పసుపు అన్నమే చికెన్ బిర్యానీ..
- వసతిగృహాల్లో మౌలిక వసతులు కరువు
- చోద్యంచూస్తున్న సాంఘిక సంక్షేమ అధికారులు

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులు ఏమాత్రం దృష్టి సారించటం లేదు. ప్రభుత్వం తగిన నిధులు కేటాయింపులు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం సౌకర్యాలు కనిపించడం లేదు..



భద్రాచలం సాంఘిక వసతి గృహం (ఇన్‌సెట్‌లో) ఒకే కంచంలో భోజనం చేస్తున్న దృశ్యం



పసుపుతో చేసిన బిర్యానీ ఇదే..

భద్రాచలం:

పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆదివారం 'సాక్షి' పరిశీలించగా ఇది తేటతెల్లమైంది. ప్రతీ ఆదివారం విద్యార్థులకు కోడి కూరతో చికెన్ బిర్యానీ వడ్డించాలనే నిబంధన ఉన్నప్పటకీ, ఇక్కడ మాత్రం పసుపు అన్నమే బిర్యానీగా పెట్టారు. అది కూడా ఉడికీ ఉడకని అన్నంతో విద్యార్థులు తినలేక చెత్తబుట్టలో పడేయడంతో కనిపించింది. స్కిన్ లేకుండా కోడికూర పెట్టాల్సి ఉండగా, ఇది కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. చివర వరకూ ఉంటే భోజనం దొరకదేమోననే ఆందోళనతో విద్యార్థులు పల్లాలతో అన్నం పట్టుకొని ఒకే కంచంలో ఇద్దరేసి విద్యార్థులు తింటున్నారు. మంచి నీళ్లు తాగడానికి గ్లాసులు లేవు. చిన్నపాటి డబ్బాలో తాగునీళ్లు ఏర్పాటు చేసినప్పటికీ, ఆ నీళ్లు కూడా పరిశుభ్రమైనవి కాకపోవటంతో అక్కడ ఉన్న చేతి పంపు నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొంది. తాగారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతోనే సాంఘిక సంక్షమ వసతి గృహాల నిర్వాహణ అధ్వానంగానే ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కూలే భవనంలోనే..

సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో పాఠశాల స్థాయిలో చదివే విద్యార్థులు 92 మంది ఉన్నారు. కళాశాల స్థాయి విద్యార్థుల కోసమని నిర్వహించే ఎస్ఎం (సెల్ఫ్‌మేనేజ్‌మెంట్) హాస్టల్ కూడా ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ఎస్ఎం వసతి గృహంలో 75 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరికి ఇక్కడ సరైన వసతి సౌకర్యం లేదు. ఓ భవనం శిథిలావస్థకు చేరి వర్షానికి కురుస్తూ, స్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. కానీ అక్కడే కూర్చొని విద్యార్థులు భోజనం చేస్తున్నారు. వాటర్ ట్యాంకు వద్ద నాచు పట్టి ఉంది. వర్షాకాలంలో ఇలా ఉంటే వ్యాధులు రావటం తథ్యమని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి, పెచ్చులూడు తున్నమాట వాస్తవమే. దీనిపై ఉన్నతాధికారులు నివేదించాము. విద్యార్థుల నమోదుపై పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ కాలేదు. మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నాము.

– రాంబాబు, హెడ్‌డబ్ల్యూఓ



వెండితెర



ఫిదా
ఏషియన్ ఉదయభాస్కర్
11.00, 2.30, 6.00, 9.00.

నేనే రాజు.. నేనే మంత్రి
విజయభాస్కర్
11.00, 2.00, 6.00, 9.00.

లై
గోపాలకృష్ణ
11.00, 2.00, 6.00, 9.00.

ఆటవిడుపు

వర్షాలు జోరుగా కురుస్తుండటంతో వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. దుమ్ముగూడెం మండలంలోని ముల్కనాపల్లి చెరువు వద్ద విద్యార్థులు చున్నీలతో చేపలు పడుతున్నారు. ఆదివారం కావటంతో ఆటవిడుపుగా ఆ చిన్నారులను చేపలపట్టడాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

–పర్ణశాల



టీఆర్ఎస్ అనుబంధ సంఘాల ఎంపిక

దుమ్ముగూడెం: టీఆర్ఎస్ మండల అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోటమళ్ల సుధాకర్ తెలిపారు. మండలంలో లక్ష్మీనగరం టీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీలను ప్రకటించారు. రైతు సంఘం మండల అధ్యక్షుడిగా శోభన్‌బాబు, కార్యదర్శిగా కుర్సం సోమయ్య , ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా నరసింహారావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కణితి లక్ష్మణ్, ఎంపీటీసీ లక్ష్మి, సర్పంచ్ రాముడు పాల్గొన్నారు. సర్పంచ్ భానుమతి ు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని ఎస్పీకి వినతి

భద్రాచలంటౌన్: అక్రమంగా కొనసాగుతున్న ఇసుక తోలకాలపై భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ అంబర్ కిషోర్ ఝాకు భద్రాచాలానికి చెందిన నూకపేయి రాజేంద్ర వర్ధన్ వినతి పత్రం సమర్పించారు. భద్రాచలం పంచాయతీలోని ఇసుక రీచ్ విషయంలో పీసా గ్రామసభల ద్వారా తీర్మానం జరుగలేదని, పెసా చట్టానికి విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని, ఈ విషయంపై తాము హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని పేర్కొన్నా రు. ఇసుక ర్యాంప్ సొసైటీ వారికి ఈ ఏడాది జూన్ వరకే అనుమతులు ఉన్నాయని, కానీ ఇసుక తోలకాలు జరుపుతున్నారన్నారు.

చర్లలో రాజీవ్‌గాంధీ జయంతి

చర్ల: భారత మాజీ ప్రధాని స్వర్గీవ రాజీవ్ గాంధీ 73వ జయంతి వేడుకలు ఆదివారం చర్ల మండలంలో ఘనంగా జరిగాయి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లపు దుర్గాప్రసాదరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా ప్రధానిగా రాజీవ్ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, కారంపూడి సాల్మన్‌రాజు, కేఎస్‌కే నాయుడు, బాలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న పించన్ విద్రోహదినం

భద్రాచలంటౌన్: కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్1న పింఛన్ విద్రోహదినంగా పాటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీఎస్) నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో పింఛన్ విద్రోహదినం పేరిట వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు నేతలు మాట్లాడారు. సెప్టెంబర్ 1న ఉదయం 9గంటలకు కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి ర్యాలీని ప్రారంభించి ధర్నా శిబిరానికి చేరుకుంటామని నాయకులు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో అధికసంఖ్యలో ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐ జపాన్‌రావు, టీఎస్ యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బీ రాజు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం రామాచారి, వివిధ సంఘాల జిల్లా, మండల బాధ్యులు కే పాపారావు, ఏ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

సహకార సంఘాలకు ఎన్నికలు

భద్రాచలంటౌన్: సహకార సంఘాలకు ఈ నెల 22, 23 తేదిలలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు సహకార ఎన్నికల అధికారి జే సోమయ్య ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. జూలై 21, 2017 ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సహకార సంఘం చట్టం 22 (బి) ప్రకారం చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఈ ఎన్నికలు భద్రాచలం ఎంపీడీఓ ఆవరణలోని సహకార సంఘం కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరుగుతాయని పేర్కొ న్నారు. 22న ఆదిలక్ష్మీ వడ్డెర లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘం, సీతారామ బీడీ లీవ్స్ కలెక్షన్ లేబర్ కాంట్రాక్టు సహకార సంఘం ఆర్లగూడెం వారికి, 23న కనకదుర్గా హరిజన లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘం భూపతిరావుకాలనీ, భద్రాచలం, కళ్యాణి వడ్డెర సహకార సంఘం భద్రాచలం వారికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిరుపేదలను ఆదుకోండి

భద్రాచలంటౌన్: నిరుపేదలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని భద్రాద్రి రెవెన్యూ డివిజన్ ప్రజా పరిరక్షణ హక్కుల సమితి అధ్యక్షుడు పసుపులేటి నాగబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని పాత మార్కెట్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 71 ఏళ్లు గడిచినా పేదల పరిస్థితి ఏమీ మారలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను ఎత్తి వేయడం వలన సామాన్యులపై అధికభారం పడుతుందని వాపోయారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు రైతులకు 9గంటలు ఉచిత కరెంట్, ఆరోగ్యశ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట్ అన్ని వర్గాలకు అందించారని అన్నారు. ఈ సమావేశంలో మారెడు శివాజీ, రౌతు కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, కొల్లు రవి, కాపుల నవీన్, వెంకటేశ్వరరావు, మహిళా మండలి నాయకురాళ్లు ఝాన్సీ లక్ష్మీబాయి, సమ్మక్క, ఎన్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైనట్లు పట్టణ ఏఎస్సై సురేష్ తెలిపారు. మృతునికి సుమారు 70సంవత్సరాలు ఉంటాయని, మృతదేహం గోదావరిలో కొట్టుకొని వచ్చిందా. లేక పట్టణానికి చెందిన వ్యక్తి నదిలో పడి మృతి చెందాడా అనే విషయం తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎంపీ సీతారాం జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న మానె రామకృష్ణ

భద్రాచలంటౌన్: పట్టణంలోని టీఆర్ఎస్ కార్యాలయంలో మహబూబాబాద్ ఎంపీ సీతారాం నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీ సీతారాం నాయక్ మంచి విద్యావేత్త అని ప్రొఫెసర్‌గా పనిచేశారని, విద్యారంగంపై మంచి అభిమానం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ఎంపీ నిధుల నుంచి రూ.40లక్షలు భద్రాచలం రామాలయానికి కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు తిప్పన సిద్ధులు, భద్రాచలం సర్పంచ్ భూక్యా శ్వేత, శేషం భాస్కర్, మండల కార్యదర్శి చింతాడి చిట్టిబాబు, రామావజ్జుల రవికుమార్, సమ్మయ్య, మామిడి పుల్లారావు, వీబీ చారి, చింతాడి రామకృష్ణ, అంబటికర్ర కృష్ణ, వినోద్ పాల్గొన్నారు.

Zone Guide

సీపీఎస్ రద్దుకు పీఆర్‌టీయూ మద్దతు

భద్రాచలంటౌన్: సీపీఎస్ రద్దును కోరుతూ సెప్టెంబర్ 1న తలపెట్టిన ఉద్యోగుల సామూహిక సెలవుకు పీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతును తెలుపుతుందని పీఆర్‌టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డీ వెంకటేశ్వరరావు, బీ రవి అన్నారు.

నేటి నుంచి జీఎస్‌పీ దీక్షలు

భద్రాచలంటౌన్: జీఓ నంబర్ 54ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం నుంచి భద్రాచలంలోని ఐటీడీఏ ఎదుట దీక్షలు చేపట్టనున్నట్లు గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సొంది వీరయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలో సోడి శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో కట్టం అశోక్ పాల్గొన్నారు.

నేడు గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో హరితహారం

భద్రాచలంటౌన్: గ్రీన్ భద్రాద్రి సంస్థ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు గ్రీన్ భద్రాద్రి అధ్యక్ష, కార్యదర్శులు పల్లంటి దేశప్ప, హరితమిత్ర గోళ్ల భూపతిరావు తెలిపారు. భద్రాచలం పట్టణాన్ని హరిత భద్రాద్రిగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమానికి దాతల సహకారంతో రూ.60 వేలు వెచ్చించి రెండు వందల మొక్కలను కడియం నర్సరీ నుంచి తె ప్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు దుర్గాప్రసాద్, శంకరరావు, వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

నతానియేల్



అంశం : వసతిగృహంలో సదుపాయలు

ఏఎస్‌డబ్ల్యూఓ, భద్రాచలం

ప్రశ్న: మీ పరిధిలో ఎన్ని వసతి గృహాలు ఉన్నాయి, వాటిలో ఎంతమంతి విద్యార్థులున్నారు ?

జవాబు: తొమ్మిది వసతి గృహాలు నా పరిధిలో ఉన్నాయి. భద్రాచలంలో నాలుగు, దుమ్ముగూడెం, చర్ల, మణుగూరు, అశ్వాపురం, కరకగూడెం, పినపాక హాస్టల్స్ పర్యవేక్షణ కూడా నా పరిధిలోనే ఉంటుంది. భద్రాచలంలో 324మంది విద్యార్థులున్నారు.

ప్రశ్న: విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి ?

జవాబు: బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల కొరత ఉంది. కొత్త వాటికి ప్రతిపాదనలు పంపాం. రెండు హస్టల్స్‌కు నిధులు కూడా కేటాయించారు.

ప్రశ్న: బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా?

జవాబు: ప్రస్తుతం అమలు చేయడం లేదు. బయోమెట్రిక్‌కు సంబంధించిన పరికరాలు అన్ని పంపించారు. కానీ సిగ్నల్స్‌లో సాంకేతిక లోపంతో ప్రస్తుతం పక్కన పెట్టాం.

ప్రశ్న: విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా ?

జవాబు: మెనూ సక్రమంగా అమలు చేస్తున్నాం. ప్రభుత్వం కూడా విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కలుగజేస్తుంది. కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచింది.

– భద్రాచలం



ఎస్‌బీఐ ఎదుట జలమయమైన రహదారి

అశ్వాపురం: చిన్న చినుకు పడినా మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి జలమయమవుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి రహదారిపై భారీ స్థాయిలో నీరు నిలిచి ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి.

పంపినవారు...
యర్రమల్ల కిషోర్‌రెడ్డి, అశ్వాపురం

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9492959511

ఇసుక అక్రమ రవాణాతో రోడ్డు ప్రమాదాలు

పట్టించుకోని అధికారులు • ఇబ్బంది పడుతున్న స్థానికులు

అశ్వాపురం:

ఇసుక అక్రమ రవాణాతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాక్టర్ డ్రైవర్లు భయంభయంగా వెనుకకు, పక్కకు చూసుకుంటూ ట్రాక్టర్లు నడపడం, డ్రైవర్లు యువకులు కావడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అవుతున్నాయి. ట్రాక్టర్ల డ్రైవర్లకు అనుభవం లేకపోవడం, కనీసం లైసెన్స్ కూడా ఉండకపోవడం గమనార్హం. మండలంలో ఇసుక ట్రాక్టర్ల కారణంగా ఇటీవల మొండికుంట, అశ్వాపురం, మిట్టగూడెం గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలయ్యారు. అశ్వాపురం, గొల్లగూడెం, చింతిర్యాల, మొండికుంట గ్రామాల్లో ట్రాక్టర్ యజమానుల వద్ద పెద్ద మొత్తంలో అక్రమ ఇసుక నిల్వ ఉంది. ఈ ఇసుకను అవసరమైన వారికి ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.1500 నుంచి రూ.2000 వరకు ట్రాక్టర్ యజమానులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్నా, ఇసుక ట్రాక్టర్ల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. పలువురు అధికారులు ఇసుక ట్రాక్టర్ల యజమానులకు సహకరిస్తున్నారని అందుకే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మరుగుదొడ్లు, ఇళ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులకు ఇసుక తోలుకుంటే ఎన్నో నిబంధనలు చెబుతూ ట్రాక్టర్లు పట్టుకునే అధికారులు ఇప్పుడు అక్రమ రవాణాపై ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మొండికుంటలో ఇసుక ట్రాక్టర్, లారీ డీకొన్న దృశ్యం (ఫైల్)

సీఐ అల్లం నరేందర్ వివరణ..
అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసినా, రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అలాంటి సంఘటన జరిగినప్పుడు వెంటనే మాకు సమాచారం ఇవ్వండి.



ఇసుక ట్రాక్టర్లతోనే రోడ్డు ప్రమాదాలు...
ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ల కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో మొండికుంటలో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఐనా అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రివేళ ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. –బచ్చు వెంకటరమణ, మల్లెలమడుగు



ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి...
మండలంలో ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా ప్రయాణిస్తుండటంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి. – శ్రీనివాసరెడ్డి, రామచంద్రాపురం

న్యూస్‌బాక్స్

కాంగ్రెస్ కార్యకర్తలను వేధిస్తే సహించం

పినపాక: అధికార పార్టీతో కలిసి పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్డులో విలేకరులతో మాట్లాడారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని, దీనిని నిరశిస్తూ ఈ నెల 24వ తేదీన కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఏడూళ్లబయ్యారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 26వ తేదీన మణుగూరు డీఎస్పీ కార్యాలయం ఎదుట, 31న ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వేధింపులకు కారణమైన ఏడూళ్లబయ్యారం సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

వయోజనులకు ఎన్ఐఓఎస్ పరీక్ష



వయోజనులకు పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

గుండాల: వయోజనులకు అక్షరాస్యతపై అవగాహన కోసం ఆదివారం పడుగోనిగూడెంలో సాక్షర భారత్ ఆధ్వర్యంలో ఎన్ఐఓఎస్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ వూకె. రామక్రిష్ణ మాట్లాడుతూ... నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. మండలంలోని 96 మందికి ఈ పరీక్ష రాసినట్లు చెప్పారు. సర్పంచ్ కొమరం శాంతయ్య, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, సాక్షరభారత్ ఏపీఓ నాగేశ్వరావు, గ్రామ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

అశ్వాపురం: మండల కేంద్రంలోని శ్రీ సద్గురు సాయిబాబా ఆలయం తృతీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పుష్పాలు, ఫలాలతో అభిషేకం, సహస్ర కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.సాయి నామస్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్ర సాధనలో మాది ముఖ్యపాత్ర

గుండాల: తెలంగాణ ఉద్యమంలో అగ్రబాగాన ఉండి పోరాడిన న్యూడెమోక్రసీ పార్టీని నాడు టీఆర్ఎస్ పార్టీ పొగడ్తలతో ముంచెత్తి, నేడు అధికారంలోకి రాగానే నిర్బంధించడం సరైంది కాదని ఆపార్టీ జిల్లా నాయకుడు ముక్తి సత్యం, సర్పంచ్ కొమరం శాంతయ్య, బత్తినిసత్యం అన్నారు. గుండాల, ఆళ్లపల్లి మండల కేంద్రాల్లో వేర్వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం కోసం త్యాగాలు ఒకరివి, భోగాలు మరొకరిలా ఉందన్నారు. ఆరుమాసాలుగా ఇల్లెందు ప్రాంతంలో తమ పార్టీపై ప్రభుత్వం కక్ష కట్టిందని, దళనేత మధును అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా అతనిపై రాజద్రోహం, ఉపా కేసులు పెట్టడం దారుణమన్నారు. ఈ చర్యలు మానుకోకపోతే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో ఎంపీటీసీ పెంటన్న, యాసారపు వెంకన్న, పర్శిక రవి, కోరం సీతారాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్డీ నాయకులు

'చలో సెక్రటేరియట్' జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మణుగూరుటౌన్: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులైజేషన్, సమానపనికి సమానవేతనం అమలు కొరకు ఆగస్టు 23న చలో సెక్రటేరియట్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బండి రాజేష్ ఆదివారం కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి, డీఆర్‌సీసీ, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ, గ్లోబల్, ఓబీ కంపెనీల, ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు.

వెండితెర



జయ జానకి నాయక : శ్రీసత్యభాస్కర పిక్చర్ ప్యాలెస్ (బండారుగూడెం), శివం (సారపాక) బూర్గంపాడు,
ఫిదా: సీతారామ థియేటర్

రేషన్‌బియ్యం పట్టివేత

బూర్గంపాడు: నకిరిపేట గ్రామం నుంచి భద్రాచలానికి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ దాడులు నిర్వహించి ఆటోను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇరువురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





మొండికుంటలో బురదమయంగా అంతర్గత రహదారులు

రహదారులు ఇలా..
నడిచేది ఎలా..?

అశ్వాపురం: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని మొండికుంటలో అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. అడుగు తీసి అడుగు పెట్టలేకుండా ఉన్నాయి. రహదారులు బురదమయమై మోకాళ్ల లోతు బురద ఉండటంతో నడకసాగించలేక విద్యార్థులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. అధికారులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి రహదారులు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

Zone Guide

ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా రమేష్

మణుగూరురూరల్: మణుగూరు మండల బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా భీరా రమేష్‌ను ఎంపిక చేశారు. ఆదివారం మణుగూరులో రమేష్ మాట్లాడారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీజేపీ నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు భిక్షపతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంజిత్‌మహంత్ పాల్గొన్నారు.

మైత్రి ట్రస్ట్ వితరణ

పినపాక: ఉప్పాక పంచాయతీ రావిశెట్టిగూడెంకు చెందిన బొగ్గం సర్వేశ్వరరావు దహన సంస్కారాలకు ఆదివారం ఏడుళ్లబయ్యారం గ్రామానికి చెందిన మైత్రి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.3 వేలు వితరణ అందజేశారు. సంస్థ సభ్యులు రాంబాబు, సుబ్రమణ్యం, కె.దుర్గా ప్రసాద్, ఆర్‌ఎస్‌వీ రమణ, గోపిరాజు పాల్గొన్నారు.

'రెవెన్యూ' విధుల బహిష్కరణ

బూర్గంపాడు: వీఆర్‌ఓలపై తీవ్రమైన పనిభారాన్ని పెంచి రాత్రివేళలో కూడా తహసీల్‌లోనే పనిచేయాలనే తహసీల్దార్ శ్రీనివాసరావు వైఖరికి నిరసనగా సోమవారం నుంచి విధుల బహిష్కరించేందుకు నిర్ణయించినట్లు తెలంగాణ గ్రామరెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జలసూత్రం భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక తహసీల్‌లో జరిగిన సంఘం డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం రాత్రి 9గంటల వరకు విధులు నిర్వహించి ఇంటికి వెళ్లిన మోరంపల్లిబంజర వీఆర్‌ఓ పుష్పావతికి రాత్రికి రాత్రే మెమో ఇవ్వటంతో పాటు ఆదివారం ఆమెను సరెండర్ చేయటం దారుణమన్నారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి పూనెం రమేష్, జిల్లా నాయకులు వాసం నర్సింహారావు, కాకా శ్రీనివాస్, వరలక్ష్మి, రామిశెట్టి పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు

ఆటపాటలతో బోనమెత్తిన మహిళలు

బూర్గంపాడు: ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. నాగినేనిప్రోలు, గొమ్మూరు, గౌతమీపురం, లక్ష్మీపురం గ్రామాల్లో గ్రామదేవత ముత్యాలమ్మకు మహిళలు ఘనంగా బోనాలు సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ కారంగుల మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఆదివారం మణుగూరు ఏరియా పీవీకాలనీలో బోనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏరియాలోని మహిళలు పెద్దసంఖ్యలో బోనాలతో తెలంగాణ జాగృతి కార్యాలయానికి వచ్చారు. మల్లీశ్వరి సారధ్యంలో.. కనకదుర్గ అమ్మవారి ఆలయానికి ఆటపాటలతో వెళ్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా యూత్ కన్వీనర్ బానోత్ పవన్‌నాయక్, పద్మ, సతీష్, నర్సమ్మ, సింధ్యా, అనిల్‌కుమార్, రాహుల్, సాగర్, యాకూబ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గొమ్మూరులో పూనకాలతో ఊగుతున్న భక్తులు



ఆటపాటలతో ముత్యాలమ్మ గుడికి వెళుతున్న మహిళలు

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

మణుగూరుటౌన్: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారావు మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక విద్యను భారతదేశంలో ప్రవేశపెట్టిన మేధావి ప్రధాని రాజీవ్ అని అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డేగల రమణ, టౌన్ ప్రెసిడెంట్ టి.యాదగిరిగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు, హర్ష, తూపుడి శ్రీనివాస్, కె.శంకర్, వై.వెంకటయ్య, వి.వెంకట్రావు, వంశీ, క్రిష్ణ, కొండబాబు, హరిప్రసాద్, జి సాంబశివరావు, అక్బర్, శేఖర్, సతీష్ పాల్గొన్నారు.



కరకగూడెం: రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరకగూడెం: మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సైయ్యద్, హైమద్‌హుస్సేన్, రావుల సోమయ్య, ఊకే రామనాథం, గొగ్గలి నర్సయ్య, కొమరం రాంబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

అశ్వాపురం: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదె కేశవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్నా అశోక్‌కుమార్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండల పరిషత్, గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వర్షాలకు రహదారులు బురదమయమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. కంచుగట్ల వీరభద్రం, కాకా రాములు, చిలకా వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్య టెక్నో కళాశాలలో ఫ్రెషర్స్ డే

మణుగూరు: పట్టణంలోని శ్రీవిద్య టెక్నో జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక స్నేహ గార్డెన్స్‌లో వేడుకలను కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బూర్గంపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వట్టం రాంబాబు, శ్రీవిద్య విద్యాసంస్థల డైరెక్టర్ నూకారపు రమేష్, ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు, కిడ్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ ఎం.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినీ, విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకొని క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీవిద్య హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సాంబశివారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

ఇంటర్వ్యూ

అంశం : పంటల సాగు
శంకర్, వ్యవసాయాధికారి, ఆళ్లపల్లి



సాక్షి: మండలంలో ఏఏ పంటలు సాగు చేస్తున్నారు..?
ఏఓ: పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటలు దాదాపు 5వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి.
సాక్షి: రైతులకు అందించేందుకు ఎరువులు అందుబాటులో ఉన్నాయా..?
ఏఓ: యూరియా, డీఏపీ, 20-20 ఎరువులు అందుబాటులో ఉన్నాయి.
సాక్షి: పంటలకు ఇన్సూరెన్స్ చేయిస్తున్నారా..?
ఏఓ: పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. కానీ ఎవరూ ముందుకు రావడం లేదు. చాలా తక్కువ మొత్తంలో రైతులు తమ పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకున్నారు.
సాక్షి: ప్రభుత్వం ఇవ్వనున్న ఎకరాకు రూ. 4వేలపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.?
ఏఓ: ఇప్పటివరకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి 1954 దరఖాస్తులు వచ్చాయి.

– ఆళ్లపల్లి

హలో సాక్షి..

ఇల్లెందు 9705348031
ఇల్లెందు అర్బన్ 9848914357
ఇల్లెందు రూరల్ 9848834400
టేకులపల్లి 9849246913
కామేపల్లి 9705444250

సాక్షి భద్రాద్రి కొత్తగూడెం
మన ఇల్లెందు
సోమవారం । ఆగస్టు । 21 । 2017





మండలంలోని 24 ఏరియా నుంచి 21 పిట్ కాలనీకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. ఈ గుంతల రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో కనీసం వీధి దీపాలు లేకపోవడంతో అనేకమంది వాహన చోదకులు ఈ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు.

- పంపినవారు: నరేష్, 21 పిట్ఏరియా, ఇల్లెందు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705348031

పట్టపగలు... దీపపు వెలుగులు!



ఇల్లెందుఅర్బన్: మండలంలోని 21 పిట్ ఏరియా లోగల వీధి దీపాలు రేయింబవళ్లు నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. ఆన్ ఆఫ్ స్విచ్‌లు పనిచేయకపోవడంతో ఇవి ఇలా వెలుగుతుండటంతో విద్యుత్ దుబారా అవుతోంది. మన విద్యుత్ సిబ్బంది ఇప్పటికైనా వీటి ఆన్ ఆఫ్ స్విచ్‌లు పనిచేసేలా చూస్తారో, ఇలాగే విద్యుత్ దుబారా చేస్తారో చూడాలి.



మంత్రి గారూ.. ఎలా ఉన్నారు..!

ఇల్లెందు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జేసీసీ జిల్లా అధికారులు పరామర్శించారు. ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జేసీసీ ఇల్లెందు మేనేజర్ కూచిపూడి సతీష్, దమ్మపేట, మణుగూరు బ్రాంచ్ మేనేజర్లు పానుగంటి సత్యనారాయణ, ఎం.రామాంజనేయులు ఉన్నారు.రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మంత్రి తుమ్మలను టీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు ఆదివారం పరామర్శించారు. తుమ్మల ఆరోగ్యంగా ఉండాలంటూ భద్రాచలం రాముల వారికి పూజలు చేసి, తీసుకెళ్లిన ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో టీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు పడిదల నవీ న్, అశ్వారావుపేట, భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గ కన్వీ నర్లు మోహన్, జహీర్, కార్తీక్, రబ్బానీ, సురేష్, కళ్యాణ్ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

టేకులపల్లి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట టేకులపల్లి జెడ్పీటీసీ సభ్యుడు లక్కినేని సురేందర్, కోయగూడెం సర్పంచ్ పూనెం సురేందర్, టీఆర్ఎస్ నాయకులు చిట్టిబాబు, భద్రునాయక్ ఉన్నారు.

ఇళ్ల కూల్చివేతను అడ్డుకున్న నిర్వాసితులు

ఇల్లెందుఅర్బన్: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఓసి నిర్వాసిత కాలనీలో పరిహారం తీసుకున్న నిర్వాసితుల ఇండ్లను కూల్చివేసేందుకు ఆదివారం యాజమాన్యం ప్రయత్నించగా నిర్వాసితులు అడ్డుకున్నారు. తమకు పూర్తిగా పరిహారం అందేంత వరకు ఇళ్లను కూల్చవద్దంటూ సిబ్బందిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు, సింగరేణి ఏజెంట్ వెంకటేశ్వర్లు చేరుకున్నారు. పూర్తి స్థాయిలో పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆందోళనకారులు శాంతించారు.

బోనం... ఘనం

ఇల్లెందుఅర్బన్: శ్రావణ మాసంలో నాలుగవ ఆదివారం రోజున పట్టణంలో పలు బస్తీల్లోగల ముత్యాలమ్మ, పోశమ్మ దేవాయాలు కిటకిటలాడాయి. మహిళలు బోనాలు ఎత్తుకుని, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని బోనాలు సమర్పించారు. అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. శివసత్తు సారిక ఆధ్వర్యంలో భక్తులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



శివసత్తుల నృత్యాలు

ఎన్డీ నాయకుడు పాపయ్యకు ఘన నివాళి



సంతాప సభలో మాట్లాడుతున్న చిన్న చంద్రయ్య

ఇల్లెందురూరల్: పోలారం గ్రామంలో అరాచక శక్తుల ఆటలు కట్టించి ప్రజలకు అండగా నిలబడ్డ న్యూడెమోక్రసీ(ఎన్డీ) నాయకుడు మూతి పాపయ్య మృతితో తీరని లోటు ఏర్పడిందని ఆ పార్టీ నేత, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మూతి పాపయ్య సంతాప సభ పోలారం గ్రామంలో ఆదివారం జరిగింది. గుమ్మడి నర్సయ్య, ఎన్డీ రాష్ట్ర నాయకుడు చిన్న చంద్రయ్య, ఇల్లెందు జెడ్పీటీసీ సభ్యురాలు చండ్ర అరుణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. పోలారం గ్రామ సమస్యల పరిష్కారానికి ఎన్డీ నాయకత్వంలో విజయవంతంగా సాగిన ఎన్నో పోరాటాలకు మూతి పాపయ్య నాయత్వం వహించారని చెప్పారు. వ్యవస్థలో మార్పు కోసం పాపయ్య చేసిన పోరాటాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాపయ్య ఆశయ బాటలో తదికంటా నడుస్తామంటూ యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సభలో పార్టీ నాయకులు టి.నాగేశ్వరరావు, రాజు, ఆవుల కిరణ్, కిన్నెర నర్సయ్య, మోడెం వెంకన్న, అజయ్, బిచ్చా, మోకాల క్రిష్ణ, సూర్నపాక పార్వతి, సరోజని, దేవుజ పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

ఎంపీ సీతారాం నాయక్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతున్న దిండిగల

ఇల్లెందు: మహబూబాబాద్ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ జన్మదిన వేడుకలు ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు దిండిగల రాజేందర్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, కనగాల పేరయ్య తదితరులు కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచారు. కమ్యూనిటీ వైద్యశాలలోని రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. టీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సిలివేరు సత్యనారాయణ, గండె సదానందం, కౌన్సిలర్ ఎస్‌డి.జానీపాషా, నాయకులు మండల రాము, సురేందర్, భావ్‌సింగ్, వీరస్వామి, మునిగంటి శివ, మేకల శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ కమిటీ ఎన్నిక



విశ్వనాథం, రాజనర్సు

ఇల్లెందుఅర్బన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ నూతన కమిటీని ఇల్లెందులోని కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా డి.విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా కొమురం ముత్యాలు, ప్రధాన కార్యదర్శిగా సందిరి రాజనర్సు, సహాయ కార్యదర్శులుగా యోగానంద్, సత్యనారాయణ, నిర్వాహక కార్యదర్శులుగా కొండూరి రాంచందర్, యాదగిరి, వెంకటమ్మ, మరో 12మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. పింఛనుదారులు తమ సమస్యలపై 93941 16751 నంబర్‌లో సంప్రదించవచ్చని అధ్యక్షుడు విశ్వనాథం సూచించారు.

లోకల్ వాయిస్

'మంచి' నీరు ఇవ్వాలి



ఇల్లెందు మున్సిపల్ నీటిని శుద్ధి చేసి ఇవ్వాలి, వేసవిలో ఎండిపోయిన చెరువులోకి వర్షపు నీరు చేరింది. చెత్తాచెదారం, మలినాలతో కూడిన ఆ చెరువు నీటిని శుద్ధి చేయడం లేదు. వారం రోజులుగా ఆ చెరువు నీటినే సరఫరా చేస్తున్నారు. అం దులో తోక పురుగులు కనిపిస్తున్నాయి. వాటిని చూస్తేనే భయమేస్తోంది. తోక పురుగులున్న నీటిని తాగితే రోగాలొచ్చే పరిస్థితుంది. ఇకనైనా శుద్ధి చేసిన 'మంచి' నీటిని మాత్రమే సరఫరా చేయాలి. దయచేసి మా ప్రాణాలతో ఆడుకోవద్దు.

- బెడదం కృష్ణవేణి, నెంబర్-2 బస్తీ, ఇల్లెందు.

గుంతలు పూడ్చాలి



పట్టణంలోని ప్రధాన రహదారిపై గుంతలతో రాక పోకలకు ఇబ్బం దేర్పడుతోంది. మార్కెట్ ఏరియా, గోవింద్ సెంటర్, సబ్‌జైల్ బస్తీ ఏరియాలోని రహదారులు గుంతలమయంగా మారా యి. రాత్రి వేళల్లో వాహన చోదకులు ఈ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు.

- పాషా, 24 ఏరియా, ఇల్లెందు.

కార్మికుల సంఖ్య పెంచాలి



21 ఇన్‌క్లైన్ భూగర్భ గనిలో కార్మికుల సంఖ్యను పెంచాలి. రిటైరైన కార్మికుల స్థానంలో కొత్తవాళ్లను నియమించకపోవడంతో మిగతా వారిపై పని భారం పడుతోంది. ఈ కారణంగా వారు తీవ్ర శారీరక అలసటకు, అనారోగ్యానికి లోనవుతున్నారు. పనికి తగ్గట్టుగా కార్మికుల సంఖ్య పెంచాలి.

- ఆరుట్ల మాధవరెడ్డి, కార్మికుడు, 21 ఇన్‌క్లైన్, ఇల్లెందు.



వెండితెర



తెలుగు

నేనే రాజు నేనే మంత్రి : శ్రీ సీతారామ 70 ఎం. ఎం. ఏ/సి (ఇల్లెందు 90596 02828), 11.00, 2.00, 6.00, 9.00.

లై : కళాంజలి 70ఎం.ఎం. ఏ/సి (ఇల్లెందు 98850 61620) 11.00, 2.00, 6.00, 9.00.

జయ జానిక నాయక: లలిత్ కళామందిర్ 70 ఎంఎం. (ఇల్లెందు) 11.00, 2.00, 6.00. 9.00.



ఊర కుక్కలు ఊరికి తిప్పలు

ఇల్లెందు: ఇల్లెందులోని కార్మిక వాడల్లో రోడ్లపై కుక్కలు ఇలా తిష్ట వేస్తున్నాయి. పిల్లలు, పెద్దలు.. ఎవర్నీ వదలడం లేదు. అందరిపై దాడి చేస్తున్నాయి. ఈ ఊర కుక్కల బెడదతో ఊరంతటికీ తిప్పలొచ్చాయి.

వచ్చే నెల 1న సామూహిక సెలవుకు సిద్ధంగా ఉండాలి

టేకులపల్లి:

ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటిన సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈఏ మండల అధ్యక్షుడు బి.పూల్ సింగ్ పిలుపునిచ్చారు. స్థానిక పాఠశాలలో ఆదివారం సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. 1న టేకులపల్లిలో జరిగే ధర్నాలో ఉపాధ్యాయులంతా సెలవు పెట్టి హాజరు కావాలని కోరారు. సీపీఎస్ రద్దయ్యేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. నాయకులు రామకృష్ణరాజు, జి.హరిలాల్, బి.బిక్కులాల్, రవీందర్, ఎం.శ్రీనివాస రావు, ఎం.రమణ, రామరాజు, ఎల్.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో భారీ వర్షం

ఇల్లెందు:

ఇల్లెందులో ఉదయం పూట ఒర్పు... సాయంత్రం వర్షం కురుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి చిరు జల్లులు, ఓ మోస్తారు వర్షం కురిసింది. సాయంత్రం గంట పాటు ఎడతెరని వర్షం కురిసింది. రోడ్డన్నీ వర్షంతో జలమయంగా మారాయి. కాలువలు, డ్రైన్లు వర్షంతో నిండుగా ప్రవహిస్తున్నాయి. ఇల్లెందు పట్టణానికి మంచినీరందించే ఇల్లెందులపాడు మంచినీటి చెరువు అలుగు జాలువారుతోంది. గత మూడు రోజుల నుంచి వర్షాలు ఉధృతంగా పడుతుండటంతో పంట చేన్లలోకి నీరు చేరింది. సుదిమళ్ల, రాఘబోయినగూడెం,పూబెల్లి, హనుమంతులపాడు చల్లవాగు చెరువు, నాయకులగూడెం చెరువు, పోలారం పాతచెరువు, తాళ్ల చెరువు,కొమురారం గుట్టళ్లనాళ్ల చెరువు, యదళ్ల చెరువు, మాణిక్యారం ఎర్ర చెరువు, ధనియాలపాడు గోపాలరావు చెరువులు అలుగుల దశకు చేరుకున్నాయి. అధిక వర్షాలకు వరి, పత్తి చేన్లలో నీరు నిలిచింది.

అమ్మేదెట్లా..! కొనేదెట్లా...?!





వారాంతపు సంత ఆగమాగం

- బురదమయంగా సంత స్థలం
- వ్యాపారులు, కొనుగోలుదారుల అవస్థలు

టేకులపల్లి:

ప్రతి శనివారం మండల కేంద్రంలోని రామాలయం సెంటర్‌లో నిర్వహిస్తున్న సంత వర్షం కారణంగా ఆగమాగమైంది. సంత ఆవరణంతా వరద నీరు నిల్వ వల్ల బురదమయం కావడంతో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడం ఇబ్బందిగా మారింది. వ్యాపారులే స్వయంగా చిన్న చిన్న కాలువలు చేసి వరద నీటిని బయటకు పంపించే ప్రయత్నం చేశారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బురదలోనే సంత నిర్వహణ కొనసాగింది. సరుకులు తీసుకుని వచ్చిన ఆటోలు బురదలో, మిషన్ భగీరథ గుంతలో ఇరుక్కుని నానా తంటాలు పడ్డారు. వర్షం కారణంగా క్రయ విక్రయాలు బాగా తగ్గాయి.

రాజీవ్ జయంతి వేడుకలు

ఇల్లెందు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఆదివారం ఇల్లెందు ఇక్కడ ఘనంగా జరిగాయి. పట్టణంలోని పలుచోట్ల రాజీవ్ గాంధీ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌కె.జానీ, చీమల వెంకటేశ్వర్లు, గిన్నారపు నాగేందర్, కొక్కు నాగేశ్వరరావు, సుదర్శన్ కోరీ, జీవీ భద్రం, ప్రమోద్‌కుమార్, పోషం వెంకటేశ్వర్లు, అక్తర్, పెండ్లి శ్రీనివాసరెడ్డి, కటకం దయాకర్, అజ్మీర రవి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టేకులపల్లిలో ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బోడు క్రాస్ రోడ్డు సెంటర్‌లోగల రాజీవ్‌గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బానోతు సాములు నాయక్, భూక్య దళ్‌సింగ్ నాయక్, రెడ్యానాయక్, ఆకారపు స్వప్న, బుర్ర శంకర్, నవీన్, సాయి, ఖాజా, సత్యనారాయణ, బండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు

టేకులపల్లి:

మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు పాఠశాల సమీపంలోగలవిద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఈ నెల 13న రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీగలు, స్తంభం తెగాయి. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ముప్పు తప్పింది. వెంటనే తెగిన తీగలు, విరిగిన స్తంభాన్ని తొలగించకుండా విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనిపై ఈ నెల 17న 'ప్రమాదం ఇలా... పట్టించుకోకుంటే ఎలా' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. మరమ్మతు పనులు మొదలుపెట్టారు.

సాక్షి ఎఫెక్ట్..

'ఎన్డీని నిర్వీర్యం చేసేందుకే గిరిజనులకు బెదిరింపులు'

ఇల్లెందుఅర్బన్: ఇల్లెందు, గుండాల మండలంలో న్యూడెమొక్రసీ పార్టీని నిర్వీర్యం చేసేందుకు కొమరారం ఎస్ఐ, గుండాల సీఐ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాల్లోని గిరిజనులను బెదిరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు చంద్ర అరుణ విమర్శించారు. ఆదివారం ఎన్డీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వాహనాల తనిఖీ పేరుతో అర్ధరాత్రి గ్రామాల్లోని గిరిజనులను నిద్రలో నుంచి లేపి బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ పార్టీ దళ కమాండర్లు లింగన్న, పూనెం రమేష్ లొంగిపోకపోతే ఎన్‌కౌంటర్ చేస్తామని హెచ్చరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుండాల సీఐ, కొమరారం ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్, ఎస్పీకి వినతి పత్రాలు ఇచ్చినట్టు చెప్పారు. పోలీసుల తీరుపై ఉన్నతాధికారులు స్పందించకపోతే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోలీసుల బెదిరింపులకు, తూటాలకు బెదిరేది లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, నాయినిరాజు, బోసు, చిన్న చంద్రన్న, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దాడులు అమానుషం

టేకులపల్లి: తెలంగాణా ఉద్యమంలో కీలకపాత్ర పోషించి రాష్ట్ర అవతరణకు కృషి చేసిన న్యూడెమొక్రసీ నాయకుల ఇళ్లపై పోలీసులు దాడులు చేస్తుండటం అమానుషమని ఎన్డీ (రాయల) మండల నాయకులు ఎట్టి నరసింహారావు, గుగులోత్ రాంచందర్ అన్నారు. వారు ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణా ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు ఎన్డీ నాయకులపై కక్ష కట్టారని ఆరోపించారు. ఇల్లెందు మండలం ఎల్లాపురంకు రమేషన్న ఇంటిపై, ఆళ్ళపల్లి మండలం రావిగూడెం భట్టు ప్రసాద్ కుటుంబాలపై శనివారం రాత్రి సోదాలు చేస్తూ , గిరిజన ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదని ఖండించారు. విప్లవోద్యమంలో సుదీర్ఘ కాలం నుంచి పేద ప్రజల కోసం పని చేస్తున్న ఎన్డీ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ వారి ఇళ్ళపై పోలీసులు దాడులు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. పోతిరెడ్డిగూడెం, ఎల్లాపురం, రావిగూడెం, ఆళ్ళపల్లి గ్రామాల్లో ఉన్న ఎన్డీ ముఖ్య నాయకుల ఇళ్ళపై దాడులు చేసి గ్రామాల్లో యుద్ధ వాతావరణం నెలకొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణా సాధనలో ముఖ్య భూమిక పోషించిన ఎన్డీని అణగదొక్కేందుకు చేస్తున్న చర్యలు చూస్తుంటే నాటి పాలకులకు,నేటి కేసీఆర్ ఏమీ తేడా లేదని ఆరోపించారు. ఇటీవల ఎన్డీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధుని అరెస్టు ఆయన పై రాజద్రోహం, 20 ఆక్రమణ కేసులు బనాయించడం లాంటి చర్యలు ఎన్డీపై నిర్బంధం పెంచేందుకేనని అన్నారు. ప్రజా నాయకుల ఇళ్ళపై పోలీసులు చేస్తున్న దాడులను ప్రజాస్వామిక వాదులు, విద్యార్థి, మేధావులు ఖండించాలని కోరారు. ఇప్పటికైనా పాలకులు, పోలీసులు దాడులు ఆపకపోతే ప్రజాపోరాటాల ద్వారానే నాయకత్వాన్ని కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో నాయకులు కుంజా వీరభద్రం, గుగులోత్ చంద్రయ్య, బానోతు పంతులు, బాణాల రామలింగాచారి, దారావత్ వెంకన్న, చింత సంపత్ తదితరులు పాల్గొన్నారు.